బాలల కథా సర్వస్వము

# తెనాలి రామకృష్ణ కథలు



బాలల కథా సర్వస్వము

# తెనాలి రామకృష్ణుని హాస్య కథలు

వెల : రూ. 70-00

# తెనాలి రామకృష్ణుని హాస్య కథలు

## 1. వికటకవిగా రామకృష్ణ కవి




తెనాలి రామకృష్ణ కవికి "వికటకవి" అనే మరోపేరు ఉండేది. ఇంతకూ ఈ పేరు ఎలా వచ్చింది ?

రామకృష్ణునికి చిన్ననాడే తండ్రి పోయారు. పెద్దగా వారికి ఆస్తిపాస్తులు లేవు. కనుక మేనమామ ఇంట పెరిగారు. తండ్రి లేనందున మేనమామ గారాబంగా పెంచారు. గారాబం కాస్త ఎక్కువైంది. రామకృష్ణునికి చదువుపై ధ్యాస పెరగలేదు. పిల్లలతో ఆడుకుంటూ కాలక్షేపం చేసేవారు.

కాస్త పెద్దయ్యాక రామకృష్ణుడు సరిగా ఇంటిపట్టున ఉండటం మానేశారు. వేళకాని వేళల్లో రావడం, పెట్టింది తినడం. మరల బయటికి పోవడం, ఇలా అలవాటైపోయింది.

తరచు దేవాలయ మంటపంలో పడుకోవటం మామూలైపోయింది. దేవాలయంలో ఉండే ఒక యోగి రామకృష్ణుని రోజూ చూస్తున్నారు.

"రామకృష్ణా నీవు తెలివైనవాడిలా ఉన్నావు. చదువు సంధ్యలు మాని ఇలా తిరగడం బాగాలేదు. ప్రక్కనే గల చెరువులో స్నానం చేసిరా. నీకో మంత్రోపదేశం చేస్తాను'' అన్నారు యోగి. రామకృష్ణుడు అలాగే స్నానం చేసి వచ్చారు.

యోగికి ఎదురుగా బుద్ధిగా కూర్చున్నారు. "రామకృష్ణా నేనిపుడు మంత్రోపదేశం చేస్తున్నా. నీవు కాళికాలయానికి వెళ్ళి ఈ మంత్రం జపించు. కాళికాదేవి ప్రత్యక్షం అయ్యేవరకు జపించు. ఆ దేవి అనుగ్రహం పొందగలవు. నీకు శుభం కలుగు గాక !" అని దీవించారు.

యోగి చెప్పిన ప్రకారం రామకృష్ణ కవి కాళికాలయానికి వెళ్ళాడు. మంత్రం చదివాడు. కాళీమాతను ప్రార్థించాడు. కాళికాదేవి ప్రత్యక్షమైంది.

రామకృష్ణుడు సాష్టాంగ నమస్కారం చేశాడు.

''అమ్మా కరుణించు'' అని మొక్కాడు. కాళీమాత రెండు చేతులలో రెండు పాత్రలున్నాయి. ఇందు ఒక పాత్రలో పెరుగు, మరో పాత్రలో పాలూ ఉన్నాయి. ఈ రెంటిలో ఏది కావాలో కోరుకో ! ఇస్తాను" అంది మాత.

''అమ్మా – పాత్రలు రెండూ మీ వద్దే ఉంచుకొని ఏది కావాలో కోరుకో అంటే ఎలా ! రెండూ నాకిస్తే – ఏది రుచిగా ఉంటే – అది తాగుతాను" అన్నాడు రామకృష్ణ.

"సరే" అని కాళికాదేవి రెండు పాత్రలను రామకృష్ణునికి అందించింది. రామకృష్ణుడు రెండు పాత్రలను అందుకున్నారు.

కాసేపు అటూ ఇటూ చూశాడు. తల గోక్కొని ఆలోచించాడు. ఏమీ తోచలేదు. అనాలోచితంగా రెండు పాత్రలలోని పెరుగూ, పాలూ తాగేశారు. అందుకు కాళికాదేవికి ఆగ్రహం కలిగింది. కన్నులెర్ర జేసింది. రామకృష్ణుడు ఈ విషయం గ్రహించారు.

"జగన్మాతా ! క్షమించు. నీవిచ్చిన రెండు పాత్రలలోని పదార్థాలూ రుచిగా ఉన్నాయి. అందుచేత రెంటినీ తాగేశాను. మన్నించు మాతా!" అని వేడుకున్నాడు రామకృష్ణుడు.

కాళీమాత కోపం కాస్త తగ్గింది.

తమాయించుకుంది. "నీవు వికటకవివి అగుగాక" అని శపించింది, కాళీమాత.

రామకృష్ణుడు వెంటనే "అమ్మా నా తప్పు మన్నించు. దారిద్ర్యం నుంచి నన్ను కాపాడు. కనికరించు" అని ప్రార్థించాడు.

రామకృష్ణుని వినతిని కాళికాదేవి మన్నించింది.

"రామకృష్ణా నీవు వికటకవిగా రాజుల సన్మానం పొందుతావు. దారిద్ర్యం నుంచి బయట పడతావు" అని అభయం ఇచ్చింది మాత. ఆ తరువాత అదృశ్యమైపోయింది. రామకృష్ణుడు క్రమంగా కవి అయినాడు.

తదుపరి వికటకవి అయినాడు. రాజాదరం పొందాడు. దారిద్ర్యం నుంచి బయటపడ్డాడు. సుఖజీవనం చేశాడు.

అది ప్రచారంలో ఉన్న కథ. వాస్తవమో, కల్పితమో తెలియదు.

★ ★ ★

## 2. రామకృష్ణ కవి రాయలవారి దర్శనం

కాళీమాత దర్శనం కలిగాక రామకృష్ణునిలో ఉత్సాహం పెరిగింది. కవికావాలనుకున్నారు.

చదువుపై ఆసక్తి కలిగింది. శ్రద్ధగా చదువు ప్రారంభించారు. అమరం నెమరు వేశారు.



కావ్యాలు, పురాణాలు పుక్కిటబట్టారు. ఛందస్సు, అలంకార శాస్త్రాలను లోబరచుకున్నారు.

కవిగా నిలబడేందుకు ఆసరా ఏర్పరచుకున్నారు. పద్యాలు రాయడం ప్రారంభించారు. స్నేహితులకు చదివి వినిపించారు.

విన్నవారంతా "భేష్" అన్నారు. యవన ప్రాయం "లింగ పురాణాన్ని" రాశారు. ఈ గ్రంథాన్ని పండితులు ప్రశంసించారు.

స్నేహితులు ఎంతో ఆనందించారు. రామకృష్ణుడు కవి అయినందుకు అభినందించారు.

ఆనాడు హంపి, విజయనగరాన్ని పాలిస్తున్న కృష్ణదేవరాయలకు ఎంతో పేరు ప్రఖ్యాతులుండేవి. రాయలవారు తమ దండయాత్రలో తెనాలి, అనంతవరం (గుంటూరు జిల్లా), శ్రీకాకుళం (కృష్ణాజిల్లా) గ్రామాలు సందర్శించినట్లు ప్రజలు చెప్పుకోవడం రామకృష్ణుడు విన్నారు.

పైగా రాయలవారు కవి పండితులను ఆదరిస్తారని, వారికి ఆంధ్రభోజుడనే బిరుదు కలదని విన్నారు.

పైగా ఆనాడు రాజాశ్రయం లేనిదే కవికి మనుగడ లేదు. కనుక రామకృష్ణుడు రాయలవారిని దర్శించాలనుకున్నారు.

రాయల దర్శనం దుర్లభం అని తెలుసుకున్నారు. తెనాలి నుంచి విజయనగరం వెళ్ళడమంటే మాటలా ! ఆనాడు ప్రయాణ సౌకర్యాలు లేవు. దాదాపు 500 మైళ్ళు కాలినడకనే వెళ్ళాలి – అంచెలంచెలుగా !

రామకృష్ణునికి యుక్త వయస్సు వచ్చింది. తల్లి పెళ్ళి ప్రయత్నం చేసింది. తల్లి, మేనమామలు ఆడపెండ్లివారితో మాట్లాడి, ముహూర్తం నిర్ణయించారు. మంచి కుటుంబానికిచెందినచి.ల.సౌ. మంగమ్మతో వివాహం జరిగింది. భార్య ప్రోత్సాహంతో రచనలు ప్రారంభించారు. రాజాశ్రయంపై మోజు తగ్గలేదు. ఇంతలో ఒక వార్త విన్నారు.

రాయలవారి కులగురువు తాతాచార్యులవారు మంగళగిరి (గుంటూరుజిల్లా)లో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాన్ని దర్శించే నిమిత్తం ఏతెంచారని తెలిసింది. రామకృష్ణుడు ఆ వార్త విని ఎంతో ఆనందించారు.

తాతాచార్యుల వారిని దర్శించారు. సాష్టాంగ దండ ప్రణామం చేశారు. తాతాచార్యులవారు గమనించారు. “ఎక్కడి నుంచి వచ్చావు. నీకేం కావాలి” అని అడిగారు తాతాచార్యులవారు.

“నేను కవిని. విజయనగరంలో రాయలవారి దర్శనం కలిగించండి” అని తన కోరిక బయట పెట్టారు.

“నీవు రాసిన కొన్ని పద్యాలు చదువు” అన్నారు తాతాచార్యులు.

వెంటనే రామకృష్ణ కవి విజృంభించి తాను రాసిన పద్యాలను అనర్గళంగా చదివారు.

రామకృష్ణకవి పాండిత్యానికి తాతాచార్యుల వారు మెచ్చుకున్నారు.

“నీ కవిత్వం బాగుంది. రాయలవారి దర్శనానికి నీవు అర్హుడవు. నేను విజయనగరం చేరుకున్నాక రాయలవారితో మాట్లాడి, రాజభటులచే కబురు చేస్తాను, అందాక వేచి ఉండు” అని పైకి అన్నాడు తాతాచార్యులవారు. కాని రామకృష్ణునిపై వారికి అసూయ ఏర్పడింది. తాతాచార్యుల వారి మాటలు రామకృష్ణకవి నమ్మారు.

ఈ పలుకులు రామకృష్ణకవిలో ఆశలు రేకెత్తించాయి. రాయలవారి దర్శనంపై ఎన్నో కలలుగన్నారు. తనకు త్వరలో రాయలవారి దర్శనం కలుగుతుందని ఎంతో మురిసిపోయారు. మిత్రులందరికీ చెప్పారు.

తరువాత –

రోజులు గడిచాయి.

వారాలు గడిచాయి.

నెలలు గడిచాయి.

తాతాచార్యులవారి నుంచి ఎలాంటి వర్తమానం లేదు.

కాళీమాత ఆశీస్సులు గుర్తుకు వచ్చాయి.

తనకు తాను హంపి, విజయనగరం బయలుదేరుదాం అని అనుకున్నారు. కాళీమాతను తలచుకున్నారు.

కాలినడకనే విజయనగరం బయలుదేరారు. మార్గమధ్యంలో తిరిపె మెత్తుకుని తిన్నారు. అష్టకష్టాలు పడ్డారు. తెనాలి నుంచి దాదాపు మూడు మాసాలు ప్రయాణం చేసి ఎట్టకేలకు విజయనగరం చేరుకున్నారు.

కనులు మిరుమిట్లు గొలిపే భవనాలు. విశాలమైన రహదారులు. రహదారుల కూడళ్ళలో అంగళ్ళు. అంగళ్ళలో మణులు, రత్నాల అమ్మకం. లోతైన కందకాలు ఉన్నాయి.

దుర్భేద్యమైన రాజప్రాసాదం.

చీమ చిటుక్కుమన్నా పసిగట్టే రాజభటులు.

విజయనగరం అందాలు చూసేందుకు రెండు కళ్ళు చాలవనిపించింది.

ఎప్పుడు రాజదర్శనం కలుగుతుందా! ఆశతో ఉన్నాడు.

ముందుగా తాతాచార్యుల వారిని దర్శించాలి గదా ! వారి సాయంతో గదా రాజాశ్రయం పొందేది.

◆ ◆ ◆

రామకృష్ణకవి ఒక రోజు ఉదయాన్నే లేచారు. సంధ్యావందనం పూర్తిచేశారు. తాతాచార్యుల వారింటికి బయలుదేరారు.

తాతాచార్యులవారు ప్రభుత్వ సదనంలో ఉంటున్నారు. వారింటి వద్ద రక్షకభటులు కాపలా ఉన్నారు. రాజగురువు కదా !

లోనికి ఎవ్వరినీ పోనివ్వడం లేదు. తనలాగే మరికొందరు తాతాచార్యుల వారి ప్రాపకం కోసం వచ్చారు.

రామకృష్ణకవి రక్షకభటుని సమీపించారు. "నేను గుంటూరుజిల్లా, తెనాలి నుంచి వచ్చాను. నా పేరు రామకృష్ణ కవి అంటారు. తాతాచార్యుల వారి దర్శనార్థం వచ్చాను. లోనికి పంపుడు" అన్నారు.

రాజభటులు వినలేదు. రామకృష్ణకవి వారిని పదేపదే ప్రాధయపడ్డాడు. ఎట్టకేలకు వారు వెళ్ళి తాతాచార్యులవారు వారికి కబురు చేరవేశారు.

అప్పటికే తాతాచార్యులవారు రామకృష్ణునిపై అసూయపడ్డారు కాబోలు. రామకృష్ణుని రాజా స్థానంలో ప్రవేశిస్తే – తన పలుకుబడి ఎక్కడ ముప్పు వాటిల్లుతుందో అని ఆలోచనలో మునిగారు.

"ఆ రామకృష్ణకవి ఎవరో నాకు తెలియదు. నాకు చాలా పని ఉంది. ఆయన కలిసేందుకు నాకు సమయం లేదు. ఆయన దారిన ఆయన్ను వెళ్ళమనండి" అని తాతాచార్యులవారు కటువుగా చెప్పి భటులను పంపారు.

భటులు వచ్చి రామకృష్ణునికి ఈ విషయం చెప్పారు. రామకృష్ణునికి నిరాశ కలిగింది. అయినా పట్టువిడువలేదు. మరుసటిరోజున రామకృష్ణుడు మరల తాతాచార్యుల వారింటికి వెళ్ళారు. రాజ భటులకు తన సంగతి చెప్పారు. అయినా వారు వినలేదు. ఇంతలో తాతాచార్యులవారు వారే బయటకు వచ్చారు. రామకృష్ణకవి వారికి పాదాభి వందనం చేశారు.

"అయ్యా నేను తెనాలి నుండి వచ్చాను. తమను మంగళగిరిలో ఒకసారి దర్శించాను. నాకు రాజదర్శనం కల్పిస్తానని ఆనాడు మీరు వాగ్దానం చేశారు. నాకు అవకాశం కల్పించండి" అని బ్రతిమలాడారు.

"నీ మాటలు వింతగా ఉన్నాయి. నిన్నెపుడు నేను చూడలేదు. నేనెవరికీ వాగ్దానం చేయలేదు. నీవు తిరిగి తెనాలి వెళ్ళిపో" అని గదిమి చెప్పారు.

రామకృష్ణకవి బాధపడ్డారు. కాని పట్టుదల పెరిగింది. "రాయలవారిని దర్శించకుండా తెనాలి వెళ్ళను. నా ప్రయత్నం నేను చేస్తాను" అని అనుకున్నారు.

కాళీమాత అనుగ్రహం ఉంది కదా ! అని విజయనగరంలో ఉండిపోయారు.

ఇంతలో ఒకరోజున రాజాస్థానం నుంచి ఒక దండోరా ! వినబడింది.

"రాయలవారి ఆస్థానానికి గొప్ప పండితులు వస్తున్నారు. వారి ఉపన్యాసం వినేందుకు కవులు పండితులు రావచ్చు" అని ఆహ్వానించారు.

దీన్ని రామకృష్ణకవి విన్నాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలింది అనుకున్నాడు.

రామకృష్ణకవి ఉదయాన్నే స్నానాదికాలు ముగించుకుని రాజసభకు బయలుదేరారు. సభలో అందరితోపాటే కూర్చున్నారు. కవిగారిని తాతా చార్యులవారూ చూశారు. చూడనట్లు నటించారు. అభివాదం చేసినా పట్టించుకోలేదు.

సభకు కొత్తగా వచ్చిన మహాపండితులు ఇలా ప్రారంభించారు.

"ఈ లోకమంతా మిధ్య. కనబడేదంతా నిజం కాదు. రుచి చూడడం, వాసన చూడడం,

ఇంద్రియాల అనుభవం – అన్నీ అబద్ధం. మనం కల్పించుకున్నవే. అంతా ఒక భ్రమ" ఇలా సాగింది మహా పండితుల ఉపన్యాసం. ఇది విన్న వారంతా ఆశ్చర్యపడ్డారు.

రామకృష్ణకవి వెంటనే లేచి –

"మహా ప్రభూ ! నా పేరు రామకృష్ణుడు. తెనాలి నుంచి తమ దర్శనార్థం వచ్చాను. మహా పండితులు చెప్పినదంతా విన్నాను. మనం అనుభవించడానికి, అనుభవించామనుకోవడానికి భేదం లేదనుకోవాలి గదా" అన్నారు.

మహాపండితులు "ఔను భేదం ఏమీ లేదు" అని చెప్పారు.

వెంటనే రామకృష్ణకవి ఇలా అన్నారు.

"ఈ మహాపండితులు చెప్పిన మాటలలో ఎంత సత్యం ఉందో ఇప్పుడే నిరూపిస్తాను. ఈనాడు రాయలవారు ఏర్పాటు చేసిన విందును అందరం ఆనందంతో ఆరగిద్దాం. మహాపండితుల వారు మాత్రం భోజనం చేయరు. చేయకపోయినా చేసినట్లుంటారు. అంతా మిధ్య కదా" అనగానే అందరూ గొల్లున నవ్వారు.

సమాధానం దొరక్క మహాపండితుల వారి నోట మాట రాలేదు.

రామకృష్ణకవి తెలివితేటలకు రాయలవారు ఆనందించారు. "నీవు ఎప్పుడైనా పండిత సభలకు రావచ్చును" అని కొంత పారితోషికం కూడా ఇచ్చారు. ఈ విషయం తాతాచార్యుల వారికి నచ్చలేదు. కాని చేసేది లేక మిన్నకున్నారు.

రామకృష్ణకవి సభ నుంచి బయటికి పోతూ తాతాచార్యుల వారికి మరల నమస్కరించారు. అది ఆచార్యుల వారికి చెంపపెట్టులాగ అనిపించింది.

◆ ◆ ◆

ఆ తరువాత రామకృష్ణకవి విజయనగరం లోనే ఉండిపోయారు. రాజాస్థానంలో జరిగే పండిత సభలకు హాజరౌతూ ఉండేవారు.

రామకృష్ణకవిగారికి ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన గారితో పరిచయం ఏర్పడింది.

వీలున్నప్పుడు పెద్దన కవిగారికి తన కవిత్వాన్ని రామకృష్ణకవి వినిపిస్తూ వచ్చారు. ఒకసారి పెద్దన గారిని చూచినప్పుడు ఈక్రింది పద్యాన్ని చదివాడు.

కం. నలుగు నిను బలుమారుల్
గెలుచురు సుగుణోత్తు కాంతిర్యాకృతులన్
నలుగురు నిన్ను బలుమారుల్
భళిభళీయన కబ్బరంగ పాండురంగా

ఈ పద్యాన్ని పెద్దన కవిగారు విన్నారు. ఉప్పొంగిపోయారు.

"నీ విషయం రాయలవారికి చెబుతాను" అన్నారు పెద్దన కవిగారు.

ఆ విధంగా ఒక మంచిరోజున పెద్దన కవిగారు రామకృష్ణ కవి ప్రతిభను గురించి రాయలవారికి వివరంగా చెప్పారు.

రాయలవారికి పెద్దన కవిగారి ఎడల విశేషమైన గౌరవం ఉండేది.

రాయలవారు పెద్దన కవి మాట మన్నించారు.


రామకృష్ణకవిని ప్రత్యేక దూతతో ఆస్థానానికి ఆహ్వానించారు. తమ హోదాకు తగిన గౌరవ మర్యాదలు చేశారు. రామకృష్ణకవిని ఆస్థాన కవిగా నియమించినట్లు సభాముఖంగా ప్రకటించారు.

రామకృష్ణ కవి తన జీవితం ధన్యమైనట్లు భావించారు.

★ ★ ★

## 3. తాతాచార్యులవారికి జ్ఞాన బోధ

రామకృష్ణకవి రాయలవారి కొలువులో ఆస్థాన పండితుని హోదాలో కొనసాగుతున్నారు. తెనాలి నుంచి తన భార్యను తీసుకువచ్చారు. దారిద్ర్య బాధ నుంచి బయటపడ్డారు. కవితా సాధనపై శ్రద్ధ పెంచారు.



తాతాచార్యులవారు రాయలవారి కులగురువు. వైష్ణవ మత పక్షపాతి దీంతోపాటు శైవులంటే – ఈసడించుకునేవారు. అసహ్యించుకునేవారు. ఈ పద్ధతి శైవులకు నచ్చలేదు. తాతాచార్యులవారి ప్రవర్తన శైవులకు కొంత ఇబ్బంది కలిగిస్తూనే ఉంది. రాయలవారికి కూడా ఈ విషయం వేగుల వారి ద్వారా తెలిసింది. శైవులంతా రామకృష్ణకవిని కలిసి తమ పరిస్థితి మొరపెట్టుకున్నారు.

రామకృష్ణకవి శైవుల మాటలు విని బాధ పడ్డారు. తాతాచార్యుల వారికి బుద్ధి చెప్పాలి అనుకున్నారు. ఒక ఉపాయం ఆలోచించారు.

ఇంతలో ఒకరోజు రామకృష్ణుని రాయల వారు పిలువనంపారు. కవిగారు కొలువులో ప్రవేశించారు. రాయలవారు రామకృష్ణకవిని రహస్య మందిరానికి తీసుకెళ్ళారు.

“రామకృష్ణకవీ ! మా కులగురువు తాతా చార్యుల వారు శైవుల ఎడల ఏహ్యభావంతో ప్రవర్తిస్తున్నట్లు తెలిసింది. అది మంచి పనికాదు. మా రాజ్యంలో ఏ ఒక్కరూ బాధపడరాదు. పైగా తాతాచార్యులవారు మాకు కులగురువు. వారిపై మాకెంతో గౌరవం ఉంది. నేను ఏమీ చెప్పుట భావ్యం కాదు. మీరేదైనా ఉపాయం ఆలోచించి, యుక్తిగా తాతాచార్యులలో మార్పు తెండు” అని చెప్పారు రాయలవారు. రామకృష్ణకవి “సరే” అని తన పనిలో సమాయత్తమైనారు.

కవిగారి మనసులో ఆలోచన మెరిసింది. మరునాడే పని ప్రారంభించారు.

ఒక ఉదయానే కవిగారు తాతాచార్యుల వారింటికి పోయారు. ఆచార్యులవారు పూజాదికాలు ముగించుకుని తమ ఆసనంపై కూర్చున్నారు. ఎవరో మనుషులు వస్తున్న అలికిడి విని, స్మార్తులేమో అనుకుని ముఖంపై ఉత్తరీయాన్ని కప్పుకున్నారు.

“గురువుగారు నేనూ మీ శిష్యుణ్ణేగదా ! నేను వస్తుంటే ఉత్తరీయం ఎందుకు కప్పుకున్నారు” అన్నారు రామకృష్ణకవి.

“రామకృష్ణా విను. నీవు నాకు ప్రియ శిష్యుడవే. నీవు వస్తే నాకేం అభ్యంతరం లేదు. అప్పుడప్పుడు చెప్పకుండానే స్మార్తులు వస్తుంటారు. నీకో రహస్యం తెలుసోలేదో ! ఈనాటి స్మార్తమతం లోప భూయిష్టమైనది. స్మార్తులు పాపులు. ఉదయాన్నే వారిని చూస్తే వచ్చే జన్మలో గాడిదలుగా పుడతారు. అంచేతే స్మార్తులెవరన్నా కనబడతారేమోనని ఉత్తరీయం చాటు చేసుకుంటున్నా – అంతే. ఈ విషయం ఎవరికీ చెప్పకు. గోప్యంగా ఉంచు” అన్నారు తాతాచార్యులవారు.

“నా విషయంలో ఏ మాత్రం అనుమానం ఉంచుకోవద్దు. నేను మీ శిష్యుడనే” అని అభయ హస్తం అందించారు రామకృష్ణకవి. తాతాచార్యుల వారు దీన్ని నమ్మారు.

రాయలవారు అపుడపుడు కోట బయటకు విహారానికివస్తుంటారు. కులగురువు తాతాచార్యులు, కవి పండితులు, పరివారం వారితో ఉంటారు.

రాయలవారు కొంతసేపు గాలి మార్పుకోసం తోటలో విహరించారు. ఈలోగా అక్కడో గాడిదల

గుంపు తయారైంది. అప్పుడు రామకృష్ణ కవికి ఒక ఆలోచన తట్టింది. పరుగున పోయి గాడిదలకు సాష్టాంగ ప్రణామం చేశారు.

ఇది చూచి రాయలవారు ఆశ్చర్యపడ్డారు.

"రామకృష్ణ కవీ ! గాడిదలకు నమస్కరిస్తున్నా రేమిటి ? నీకు మతిపోయిందా'' అన్నారు రాయలవారు.

"మహారాజా ! నాకు మతి చెడలేదు. ఈ గాడిద తాతాచార్యుల వారి మేనమామ. ముఖంపై నల్లమచ్చలున్న గాడిద తాతాచార్యుల వారి తండ్రిగారు. పూర్వజన్మలో వీరు స్మార్తుల మొహం చూచినందువలన ఈ జన్మలో గాడిదలై నారు. ఈ పెద్దలను దర్శించుట నా ధర్మం. తనకీ దుస్థితి కలగకుండా ఉండేందుకు తాతాచార్యుల వారు ముఖంపై అంగవస్త్రం కప్పుకొని తిరుగు తుంటారు. కావాలంటే ఒకసారి తాతాచార్యుల వారిని అడగండి" అన్నారు రామకృష్ణకవి.

ఈ మాటలు తాతాచార్యులవారూ విన్నారు. సిగ్గుపడి తలవంచుకున్నారు. తాను తప్పు చేసినట్లు భావించారు. ఆ తరువాత స్మార్తులు కనిపిస్తే ముఖానికి అంగవస్త్రం కప్పుకోలేదు. మర్యాదగా చూశారు.

ఆ తరువాత విజయనగరంలో శైవులు, వైష్ణవులు మత భేదాలు మరచారు. అన్నదమ్ముల లాగ మెలిగారు.

★ ★ ★

## 4. విప్రోత్తములకు బంగారు మామిడిపండ్లు

రాయలవారి తల్లి నాగాంబగారు. తల్లి గారంటే రాయలవారికి అపారమైన గౌరవం. వయసు మీరి కాలవశాన ఆమె చనిపోయారు. చనిపోయే ముందు "నాకు మామిడిపండ్లు తినాలని ఉంది" అన్నారు నాగాంబగారు.



కాని అది శీతాకాలం. ఎంత ప్రయత్నించినా మామిడిపండ్లు దొరకలేదు. మామిడిపండ్లు వేసవిలో కదా వస్తాయి.

కాని నాగాంబగారు "మామిడిపండ్లు, మామిడి పండ్లు" అంటూ ప్రాణం విడిచారు. రాయలవారికి పెద్ద లోటు మిగిలిపోయింది.

మామూలుగా తాతాచార్యులవారు రాయల వారి కొలువుకు వచ్చారు. రాయలవారు తన కులగురువు తాతాచార్యులు వారికి మనసులోని కోరికను బయటపెట్టారు.

"తాతాచార్యులవారూ ! మా తల్లిగారు మామిడి పండు కావాలని చెప్పిన కోరికను తీర్చలేకపోయాను. మార్గం ఆమె ఆత్మకు శాంతి కలిగే ఏదైనా ఉందేమో చూడండి. శాస్త్రాలు శోధించండి" అని అన్నారు రాయలవారు.

తాతాచార్యులవారు కోటనుంచి ఇంటికి చేరారు. శాస్త్రాలు అన్నీ పరిశీలించారు. అదే పనిగా ఆలోచించారు. వారం దినాల పిదప రాయల వారిని దర్శించారు.

"మహా ప్రభూ ! శాస్త్రాలు అన్నీ పరిశీలించాను. ఒక మార్గం కనిపించింది. ప్రతి ఏటా మీ

అమ్మగారి సాంవత్సరీకం నాడు బ్రాహ్మణులకు బంగారు మామిడిపండ్లు దానం ఇవ్వండి. ఆమె ఆత్మకు శాంతి చేకూరుతుంది. మీరు బాధపడటం మానండి. నేను చెప్పింది చేయండి" అన్నారు తాతాచార్యులవారు.

రాయలవారు అందుకు అంగీకరించారు. ఆ తరువాత మంత్రులతో ఈ విషయం చెప్పారు. ధనాగారం పని చూస్తున్న మంత్రికి ఈ పని ఇష్టం లేదు. ఇలా చేస్తే ఖజానా కొన్నేళ్ళలో ఖాళీ అయిపోతుందని భావించారు. ఈ పద్ధతి తప్పించ డానికి మార్గం ఆలోచించాలని అనుకున్నారు.

ఇలాంటి ఆలోచనలు చెప్పేందుకు రామకృష్ణ కవి ముందుంటారు. వెంటనే కవిగారికి కబురు చేశారు మంత్రిగారు.

కవిగారికి మంత్రిగారు విషయమంతా వివరించి కోశాగారం ఖాళీ కాకుండా కాపాడమని కోరారు.

"నా ప్రయత్నం నేను చేస్తాను. మీరు నిశ్చింతంగా ఉండండి" అని అభయం ఇచ్చారు కవిగారు. రామకృష్ణకవి ఆలోచించారు. తన ఆలోచన రహస్యంగా ఉంచారు. మంత్రిగారికీ చెప్పలేదు. అవసరం వచ్చినప్పుడు చెబుదాం అనుకున్నారు.

కాలం త్వరగా జరిగిపోయింది. రోజులు, వారాలు, మాసాలు ఇట్టే గడిచిపోయాయి. నాగాంబగారి సాంవత్సరీకం రానే వచ్చింది.

రాయలవారు ఈసారి తమ తల్లిగారి సాంవత్సరీకం ఘనంగా జరిపించాలనుకున్నారు. నగరమంతా దండోరా వేయించారు. సాంవత్స రీకం రోజున విప్రులకు బంగారు మామిడిపండ్లు బహుమతిగా ఇస్తామన్నారు.

ఇకనేమి విప్రులు తండోపతండాలుగా కోట వెలుపల గల సత్రాలలో చేరుకున్నారు. సంతోషంతో మునిగిపోయారు.

కోశాగార మంత్రిగారికి భయం పట్టుకుంది. ఖజానాలోని బంగారమంతా దానం చేసేస్తే – ముందు ముందు ఎన్నో సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది గదా అని.

ఈలోగా రామకృష్ణకవి రానే వచ్చారు. పరిస్థితి గమనించారు. "ఈ సమస్యను నేను పరిష్కరిస్తాను. మీరు చింతపడవలదు" అని చెప్పి వెళ్ళిపోయారు.

రామకృష్ణకవి కోట బయటగల ధర్మసత్రాల వద్దకు వెళ్ళారు. బ్రాహ్మణులందరూ కోటలోకి ప్రవేశించేందుకు తయారవుతున్నారు. ఒకరిని మించి ఒకరు రేఖలు పెట్టుకుంటున్నారు. నిలువు బొట్లు పెట్టించుకుంటున్నారు.

కవిగారు అందరినీ సమావేశపరిచారు. ఆస్థాన కవి పిలుపుగదా ! అందరూ బిలబిలా వచ్చారు. అప్పుడు కవిగారు ఇలా చెప్పారు.

"అన్నలారా ! బ్రాహ్మణోత్తములారా ! రాజాజ్ఞను మీకు తెలియజేస్తాను వినండి. బంగారు మామిడిపండు కావలసినవారు వాత పెట్టించుకుని కోటలోకి ప్రవేశించాలి. ఒక మామిడిపండు కావాలంటే ఒక వాత, రెండు కావాలంటే రెండు వాతలు పెట్టించుకోవాలి. ఇది కోటలోని ఆచారం. ఇలా వాతలు పెట్టించుకున్నవారు లోనికి పొండు" అని చెప్పారు.

బంగారు మామిడిపండ్లకు ఆశపడిన వారంతా కవిగారి మాటలు నమ్మారు. కొందరు ముందుకు వచ్చారు. అలా వచ్చిన వారికి రామకృష్ణ కవి ఒక పండు కావలసినవారికి ఒక వాత, రెండు కావలసిన వారికి రెండు వాతలు వేసి పంపారు.

రాయలవారు దానమిచ్చే ముందుగా వాతలతో బాధపడుతున్న బ్రాహ్మణులను చూశారు.

"స్వాములూ ఎందుకిలా బాధపడుతున్నారు. ఈ వాతలేమిటి ? ఏం జరిగింది" చెప్పమన్నారు రాయలవారు.

జరిగినదంతా బ్రాహ్మణులు రాయలవారికి విన్నవించారు. రామకృష్ణ కవిపై కోపం వచ్చింది. కవిగారికి కబురు చేశారు.

వెంటనే కవిగారు కొలువుకు వచ్చారు. ప్రభువుగారికి ప్రణామం చేశారు.

"రామకృష్ణకవీ ! ఏమిటీ పని ! ఈ విప్రోత్తములకు ఎందులకు వాతలు పెట్టారు" అని కోపంగా అన్నారు రాయలవారు.

"మహాప్రభూ ! నా మనవి వినండి. కాస్త శాంతించండి. మా తల్లిగారికి పెద్ద జబ్బు చేసింది. మరణావస్థలో ఉంది. వాతలు వేయించిన వాతం తగ్గునని వైద్యులు చెప్పారు నేను ఆమెకు వాతలు వేసేలోగా ఆమె మరణించింది. ఇందరు బ్రాహ్మణోత్తములు మరల దొరకడం కష్టం గదా ! దొరికిన వారిని మా అమ్మగారి ఆత్మశాంతి కోసం వాతలు వేశాను. నా తప్పు ఉంటే మన్నించండి ప్రభూ !" అంటూ వేడుకున్నారు.

రాయలవారు కుశాగ్రహ బుద్ధి కలవారు. కొంచెంసేపు ఆలోచించారు. కవిగారి మాటలో కిటుకు ఉందని గమనించారు.

వెంటనే మంత్రిమండలి సమావేశం ఏర్పాటు చేశారు. బంగారు మామిడిపండ్ల దానం మంచిది కాదని, ఇందువలన ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని రాయలవారికి సూచించారు. అప్పుడు రాయలవారు పరిస్థితి అర్థం చేసుకున్నారు. బంగారు మామిడిపండ్లు పంపకం ఆపేశారు. వచ్చిన పండితులందరికీ కమ్మని విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉచిత రీతిన సత్కరించారు.

ధనాగారాన్ని కాపాడిన రామకృష్ణ కవిని ప్రత్యేకంగా సత్కరించారు.

★ ★ ★

# 5. తప్పించుకున్న శిక్ష



రాయల తల్లిగారి సాంవత్సరీకం రోజున మామిడి పండ్లు దానం ఇవ్వబోగా రామకృష్ణ కవి ఆపేయించారు. ఈ పని తాతాచార్యుల వారికి ఆగ్రహం తెప్పించింది, చేసేది లేక మిన్నకున్నారు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

ఒకరోజున కూచిపూడి భాగవతులు రాయల వారి దర్శనం కోసం వచ్చారు. రాయలవారు అందుకు అనుమతించారు. కోటలో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఈలోగా తాతాచార్యులవారు రాజభటులను పిలిచి రేపు కోటలో కూచిపూడి నాట్య ప్రదర్శన జరుగబోతుంది. రామకృష్ణ కవిని మాత్రం లోనికి పంపకండి" అని చెప్పారు. "చిత్తం – అలాగే చేస్తాం స్వామీ !" అన్నారు ద్వారపాలకులు.

మరునాడు కూచిపూడి నాట్య ప్రదర్శన కోటలో ప్రారంభమయ్యింది. రాగ, తాళాలు వినిపిస్తున్నాయి.

రామకృష్ణ కవి యథాప్రకారం కోటలోకి ప్రవేశింపబోయారు. రాజభటులు అడ్డుకుని "కులగురువు మిమ్మల్ని రానివ్వ వద్దని చెప్పారు.

వెనుదిరిగి పొండి. మమ్మ మన్నించండి" అన్నారు భటులు.

వెంటనే రామకృష్ణకవి "రాయలవారు ఈ దినం కవులకు, పండితులకు కానుకలు ఇస్తా మన్నారు. నన్ను లోనికి పోనిస్తే – అందులో మీకు సగం ఇస్తాను" అన్నారు. భటులకు ఆశ పుట్టించాక మెత్తబడ్డారు. వారి ఆశ వారిది కదా! కవిగారిని లోనికి పోనిచ్చారు.

భాగవతం కూచిపూడి నాట్యంగా ప్రదర్శన జరుగుతుంది. బాలకృష్ణుని చేష్టలను యశోదకు గోపికలు వివరిస్తున్నారు. యశోద బాలకృష్ణుని మందలించింది. కాని కొట్టలేదు. పోతన భాగవతంలో బాలకృష్ణుని యశోద తిట్టినట్లుంది గదా !

రామకృష్ణకవి దీన్ని కథలో లోటుగా భావించాడు. వెంటనే ఒక కట్టె తీసుకుని స్టేజిపైకి వెళ్ళి బాలకృష్ణుని కొట్టాడు. "కథకు వాస్తవ రూపం కల్పించాలి" అనుకున్నారు. భాగవతులు కథ చెప్పడం ఆపేశారు. వచ్చినవారు వెళ్ళిపోయారు.

ఈ సంఘటన రాయల వారికి కోపం తెప్పించింది. రామకృష్ణ కవిని పట్టితెండని భటులను ఆజ్ఞాపించారు. భటులు వెంటనే కవిగారిని తోడ్కొని వచ్చారు.

"రామకృష్ణా – ఏమిటి నీ ఆగడాలు. ఇవి రోజురోజుకు మితిమీరిపోతున్నవే. స్టేజిమీద బాలకృష్ణుని ఎందుకు కొట్టావు" అన్నారు రాయల వారు.

"మహాప్రభూ. నేను భాగవతాన్ని పూర్తిగా చదివాను. అందు యశోద బాలకృష్ణుని మందలించుట చూపలేదు. ఆమె బాలకృష్ణుని కొట్టింది. ఇది భాగవత కథ. కథ సరిచేసేందుకు ఈ పని చేశాను.నా తప్పుంటే క్షమించండి ప్రభూ" అన్నారు. రామకృష్ణుని సంజాయిషీ రాయలవారికి నచ్చలేదు.

"కవిగారు పిలవని పేరంటంగా వచ్చారు. భాగవతులను కొట్టారు. ప్రదర్శనను భగ్నం చేశారు. ఈతనికి శిక్ష విధించవలసి ఉంది. కవిగారిని నాలుగు రోడ్ల కూడలిలో నిలబెట్టండి. ఇరవై నాలుగు కొరడా దెబ్బలు కొట్టండి" అన్నారు రాయలవారు.

ఈ మాటలు రామకృష్ణ కవి విన్నారు. ఏమీ కలత చెందలేదు. బాధపడలేదు. పైగా నవ్వుతూ" మహాప్రభో – నాదొక చిన్న మనవి. నేను కోటలోనికి ప్రవేశించేటప్పుడు – నన్ను లోనికి పోనిస్తే – రాజుగారు ఇచ్చే బహుమతి సగం ఇస్తానని ద్వారపాలకులకు వాగ్దానం చేశాను. అలా ఇవ్వకపోతే వాగ్దాన భంగంగదా ! కనుక ఆ వాగ్దానం నేను పాటించాలి. నన్ను ఇరవై నాలుగు కొరడా దెబ్బలు కొడతామనుకుంటే – నన్ను 12 దెబ్బలు కొట్టండి. మీ ద్వారపాలకులకు సగం దెబ్బలు అనగా 12 దెబ్బలు కొట్టండి చెరి సగం అని ఒప్పందం కదా !" అన్నారు కవిగారు.

ఇది తెలిసి ద్వారపాలకులు రాయలవారి కాళ్ళపై పడ్డారు చేసిన తప్పుకు క్షమించమని వేడుకున్నారు.

రాయలవారు నవ్వుకుని అందరినీ విడిచి పెట్టారు. కవిగారి యుక్తికి ఆనందించారు.

★ ★ ★

## 6. దెబ్బకు దెబ్బ

రాయలవారికి కవిపండితులంటే అభిమానం ఉండేది. తన ఆస్థానంలో కవి పండితులను పోషించారు. రాయలవారు కొలువు దీర్చిన దినాలలో కవులు, పండితులు, కళాకారులు రాయలవారిని దర్శిస్తూ ఉండేవారు. రాయలవారి సత్కారాలను అందుకుంటూ ఉండేవారు. ఇది విజయనగర సామ్రాజ్య ప్రత్యేకత.



ఒకరోజున రాయలవారు కొలువు దీర్చి ఉన్నారు. అష్టదిగ్గజాలు కొలువులో ఆసీనులై ఉన్నారు. అన్నంభట్టు అనే మహాకవిగారు కొలువుకు ఏతెంచారు. వేషంలో, మాటలో, నడకలో దర్పం, గర్వం ప్రదర్శిస్తూన్నారు. మహాకవి గారు వస్తూనే రాయలవారికి ప్రణామం చేస్తూ ఇలా అన్నారు.

"ప్రభూ నేనొక పద్యం రాశాను. తమకు చదివి వినిపిస్తాను. దీనికి అర్థం చెప్పగలవారుంటే ఆనందిస్తాను అన్నారు.

"సరే నీ పద్యం వినిపించు. అష్టదిగ్గజాలలో ఎవరో ఒకరు అర్థం వివరిస్తారు" అన్నారు రాయలవారు. మహాకవిగారు తాను రాసిన పద్యాన్ని ఇలా చదివారు.

సీ॥ రాజనంద రాజ రాజత్మజులు సాటి
తలప నన్నయ వేమ ధరణిపతికి
రాజనందన రాజ రాజాత్మజులు సాటి
తలప నన్నయ వేమ ధరణిపతికి
రాజనందన రాజ రాజాత్మజులు సాటి
తలప నన్నయ వేమ ధరణిపతికి
రాజనందన రాజ రాజాత్మజులు సాటి
తలప నన్నయ వేమ ధరణిపతికి

గీ॥ భావ భవ భోగ సత్కళా భావములను
భావ భవ భోగ సత్కళా భావములను
భావ భవ భోగ సత్కళా భావములను
భావ భవ భోగ సత్కళా భావములను

ఈ పద్యం విన్నారు గదా. ఇది సీస పద్యం ఇందు మొదటి పాదంలో ఉన్న మాటలే మిగతా మూడు పాదాలలో ఉంటాయి. అలాగే చివరి తేటగీత పద్యంలో ఉండే నాలుగు పాదాలు ఒకే రీతిగా ఉంటాయి. ఈ విద్యా విశేషాలను వివరించండి. అని ఒక సవాలు విసిరారు అన్నంభట్టు మహాకవి.

అష్టదిగ్గజాలకు ఇదొక పరీక్ష అయింది. అందరూ రామకృష్ణకవి ముఖంవైపు చూశారు. రామకృష్ణ కవి క్షణం ఆలోచించారు. పద్యంలో పసకంటే ఏదో ఒక ట్రిక్కుతో అందరినీ ఓడిద్దామనే దురుద్దేశంతో ఉన్నట్లు భావించారు. అన్నంభట్టు కవిగారికి తగిన బుద్ధి చెప్పాలి అనుకున్నారు రామకృష్ణకవి.

తన స్థానం నుంచి లేచారు.

రాయలవారికి నమస్కరించారు. మహాప్రభూ! నేనూ ఒక పద్యం రాశాను. ఈ పద్యానికి అర్థం విశేషాలు ముందుగా అన్నంభట్టు కవిగారిని చెప్పమనండి. ఈలోగా నేను ఆలోచించుకుని వారి పద్యానికి అర్థం చెబుతాను" అన్నారు.

రాయలవారు అందుకు అంగీకరించి అన్నంభట్టు కవిగారిని ఉద్దేశించి "మీరు రామకృష్ణ కవిగారి పద్యానికి అర్థం చెప్పగలరా" అన్నారు.

"అదెంతపని రామకృష్ణ కవిగారిని పద్యం చదవమనండి" అర్థం చెబుతాను. అన్నారు అన్నంభట్టు మహాకవి గర్వంతో.

"నీ పద్యం చదువు రామకృష్ణా" అన్నారు రాయలవారు.

రామకృష్ణ కవి తాను అప్పటికప్పుడు కల్పించిన పద్యాన్ని ఇలా చదివారు.

సీ॥ మేకకు తోకకు మేక తోక మేకకు తోక
మేక తోకకు మేక తోక మేక
--- --- ---
--- --- ---

గీ॥ మేకతోకకు మేకకు తోక మేక
తోక మేకకు తోకకు మేకతోక
మేకకు మేక మేక మేకతోక
తోకమేకకు తోకతోక తోకమేక ॥

(మిగిలిన మూడు పాదాలు అట్లే చెప్పారు)

రామకృష్ణ కవిగారు చెప్పిన పద్యం విన్నాక అన్నంభట్టు మహాకవి ఆలోచనలో పడ్డారు. ఒక పట్టాన అర్థం బోధపడలేదు.

"ప్రభూ నాకొక రోజు సమయం ఇవ్వండి" ఈ పద్యానికి అర్థం వివరిస్తాను" అన్నాడు అన్నంభట్టు కవిశేఖరుడు. తెల్లవారుతుండగా ఎవరికీ కనిపించ కుండా జారుకున్నారు. మరుసటి దినం సభ కొలువుదీరింది. కవిశేఖరుని పత్తాలేదు. రాయల వారు రామకృష్ణ కవిగారిని పిలిచి కవిశేఖరుని పద్యానికి అర్థం వివరించమన్నారు.

రామకృష్ణకవి తన సహజ ధోరణిలో పద్యానికి అర్థం చెప్పి, విశేషాలు వివరించారు. పదాల గారడితో కవిశేఖరుడు చేయదలచిన మోసాన్ని వివరించారు. అలాగే దెబ్బకు దెబ్బగా "మేక" పదాల గారడీతో కవిశేఖరుని చిత్తుచేశానని వివరించారు.

రామకృష్ణకవి సభను రంజించిన తీరుకు రాయలవారు ఎంతో ఆనందించి అభినందించారు.

★ ★ ★

# 7. రామకృష్ణుని కోరిక

రాయలకాలంలో హంపీ, విజయనగరం అష్టయిశ్వర్యాలతో తులతూగుతూ ఉండేది. ప్రజలు అన్ని సుఖాలను అనుభవించేవారు. ఎవరికీ ఏ కొరత ఉండేది కాదు.



అయితే విజయనగరానికి ఎప్పుడూ శత్రు భయం వెంటాడుతూ ఉండేది. ఆనాడు కనిగిరిని (నేడు ప్రకాశం జిల్లాలో ఉంది) రాజధానిగా చేసుకుని వీరభద్ర గజపతి పాలిస్తూ ఉండేవారు. విజయనగర సామ్రాజ్యంపై కన్నేసి ఉంచారు. ఎప్పుడు విజయనగరాన్ని స్వాధీనం చేసుకుందామా! అనే పన్నాగంతో ఉన్నారు.

ఇంతలో ఒకరోజున శ్రీకృష్ణదేవరాయలు తుంగభద్ర తీరానికి వెళ్ళారు. వెంట కొద్దిమంది సైనికులు, అష్టదిగ్గజాలు ఉన్నారు.

ఈ విషయాన్ని వీరభద్ర గజపతి వేగులవారి ద్వారా తెలుసుకున్నారు. రాయలవారిని బంధించ డానికి ఇదే అదును అనుకున్నారు.

తన సేనాని పసరం గోవిందరాజును పిలిచారు. "రాయలవారు తుంగభద్రా నదీతీరంలో ఉన్నారు. బంధించి తీసుకురండి" అని హుకుం జారీ చేశారు వీరభద్ర గజపతి. సేనాని "తమ ఆజ్ఞ" అని సైనికులతో తుంగభద్ర నదీతీరానికి వెళ్ళారు.

రాయలవారి వద్ద సైనికులు తక్కువే ఉన్నారు. పోరాటంలో రాయలవారి సైనికులు నిలువలేక

పోయారు. పసరం గోవిందరాజు రాయలవారితో తలపడ్డారు. పోరు భీకరంగా ఉంది. రాయలు ఒక్కరే పోరాడుతున్నారు. రాయలు వారు గెలిచే అవకాశం కనిపించడం లేదు.

రాయల వెంట వారి అష్టదిగ్గజాలు – "మనం ఏమైనా చేయదగింది ఉందా" అని మధనపడ్డారు. వారిలో రామకృష్ణ కవి ముందుకు వచ్చి ఈ పద్యం పసరం గోవిందరాజు చెవిన పడేట్లు చదివారు.

క. బసవనకు చుట్టినప్పుడె
పసరము గోవిందరాజు ! పసరంబైనను
గసవేటికి దినఁడనగా
కసవుందికు శత్రులాజి గనసిన వేళన్"

ఈ పద్యం చదివిన వెంటనే పసరం గోవింద రాజు రక్తం కక్కుకొని మరణించాడట! రామకృష్ణ కవిగారి పద్యం శాపంగా మారి, బాణంగా దూసుకువెళ్ళి గోవిందరాజుని సంహరించింది అనుకున్నారు. గోవిందరాజు పడిపోగానే వారి సైనికులంతా చెల్లాచెదురైపోయారు.

పెద్దనాది కవులంతా రామకృష్ణకవి కవితా శక్తిని అభినందించారు.

రాయలవారు తేరుకుని "రామకృష్ణా! నీ శక్తి చాలా గొప్పది. ఇంత కాలం మేమే తెలుసుకో లేకపోయాం. ఈ విపత్తు నుంచి మమ్ము కాపాడారు. విజయనగర సామ్రాజ్య ప్రతిష్ఠ నిలిపారు. మీరేదైనా కోరుకోండి. ఇస్తాను" అన్నారు.


"మహాప్రభూ ! మాకు కోరికలేమి ఉంటాయి. మీరు శాంతిభద్రతలతో ఉంటే మేము ఉంటాము. మీ అనుగ్రహం మాపై ఉంటే చాలు అదే పదివేలు" అన్నారు కవిగారు.

"భేష భేష" అన్నారు రాయలవారు. ఆ తర్వాత రామకృష్ణ కవిగారు "మహాప్రభూ నాదొక చిన్న మనవి. నేను తరచు చిలిపి చేష్టలు చేస్తుంటాను. తప్పులు చేస్తుంటాను. ఇవన్నీ సరదా కోసమే ! కనుక నూరు తప్పుల దాకా నన్ను దండించకండి" అన్నారు.

"అంతకంటేనా!" అంటూ నవ్వుకున్నారు రాయలవారు. ఆ తరువాత తుంగభద్ర నదీ తీరాన్ని వదలి అందరూ నగరానికి తరలివెళ్ళారు.

★ ★ ★

## 8. గురువుగారి భుజమెక్కిన శిష్యుడు!




తాతాచార్యులవారు మహా పండితులు. శుద్ధ వైష్ణవులు. సదాచార సంపన్నులు.

వారు రాయలవారి కొలువులో ఉండేవారు. అయితే ఆచార్యుల వారికి ఒకే ఒక బలహీనత ఉండేది. ఆయన వేశ్యాలోలుడు. విజయనగరంలో మోహనాంగి అనే వేశ్యతో సంబంధం ఉండేది.

ఒకరోజున ఆచార్యులవారు మోహనాంగి వద్దకు బయలుదేరారు. నెత్తిన ముసుగు వేసుకున్నారు. ఎవరూ గుర్తుపట్టకుండా రామకృష్ణ కవి ఈ విషయం గమనించారు. ఆచార్యుల వారి పనిపట్టాలి అనుకున్నారు.

ఆచార్యులవారు తిరిగి వచ్చే సమయం కోసం కాపుకాశారు. ఆచార్యులవారిని సమీపించారు. ముసుగు తీశారు.

"ఇదేం పని గురువుగారూ ! అన్నారు" కవిగారు. ఆచార్యులవారు వణికిపోయారు. "రామకృష్ణా ఏదో పాడుపనిచేశాను. నీకు ఏమి కావాలన్నా చేస్తాను. నా పరువు తీయకు. ఎవరికీ చెప్పకు" అన్నారు ఆచార్యులవారు. దొరికిన అవకాశం వినియోగించుకోవాలిగదా ! కవిగారు వెంటనే ఇలా అన్నారు. "స్వామీ నాదొక కోరిక. అదేం పెద్దది గాదు. మీ భుజాల మీద కూర్చుని ఊరేగాలని ఉంది".

ఆచార్యులవారు క్షణం ఆలోచించారు. తప్పదు గదా ! అంగీకరించారు.

కవిగారు గంతేసి ఆచార్యులవారి భుజాల మీద కూర్చున్నారు.

ఆచార్యులవారు కవిగారిని భుజాలపై నిడుకుని విజయనగర రాజవీధుల గుండా ఊరేగుతున్నారు. కవిగారు ఆనందిస్తున్నారు.

ఇంతలో రాయలవారు అతఃపురం కిటికీ లోంచి చూశారు. వింత దృశ్యం కనిపించింది. ఆచార్యులవారి భుజాలపైన కవిగారు కూర్చున్నారు.

భటులను పిలిచారు.

రామకృష్ణకవిని పట్టితెమ్మని ఆజ్ఞాపించారు.

◆ ◆ ◆

ఇంతలో కవిగారికి ఒక ఆలోచన వచ్చింది.

"గురువుగారూ మన్నించండి. మీరు చాలా అలసిపోయారు. నేను కాసేపు మోస్తాను. నా భుజాల మీద కూర్చోండి" అన్నారు. గురువు గారు సంతోషించారు. కాస్తయిన శ్రమ తగ్గుతుందని ఆశపడ్డారు.

"సరే" అని అంగీకరించారు.

గురువుగారు కవిగారి భుజాలపై కూర్చున్నారు. తరువాత రాజవీధులలో నడక ప్రారంభించారు. ఈలోగా రాజభటులు వచ్చారు. వారు కంగారుపడ్డారు.

తీరా చూస్తే –

రామకృష్ణ కవి భుజాలపైన ఆచార్యులవారు కూర్చున్నారు. వెంటనే రాజమందిరానికి వెళ్ళి తాము చూచింది చెప్పారు.

"తాను పొరపాటుగా చూశానా ?" రాయలవారు ఆశ్చర్యం – ప్రకటించారు.

రామకృష్ణకవిని కొలువుకు పిలిపించారు.

కవిగారు వచ్చారు.


"ఏం జరిగిందో వివరంగా చెప్పమన్నారు" రాయలవారు. కవిగారు జరిగినదంతా వివరణ చెప్పారు. ఈ విషయం తాతాచార్యుల వారికి తెలిసింది.

సిగ్గుతో తలదించుకున్నారు.

ఆ తరువాత కొన్ని రోజులపాటు ఆచార్యుల వారు రాయలవారి కొలువుకు రాలేదు.

★ ★ ★

## 9. గడ్డి తినని గుర్రం




రాయలవారు దిగ్విజయ యాత్ర పూర్తి చేశారు. తెలుగునాడు అంతా తన చేతి క్రిందికి వచ్చింది. విజయనగరం రాజధానిగా చేరుకున్నారు. తన బలగాన్ని మరింత వృద్ధి చేయాలని భావించారు.

తన ఆస్థానంలో పెద్దలందరికీ తలో గుర్రాన్ని బహుమతిగా ఇచ్చారు. గుర్రాన్ని పోషించేందుకు తలో పాతిక వరహాలు ఇప్పించారు. ఇలా గుర్రాన్ని పొందిన వారిలో రామకృష్ణకవి ఒకరు. రాయల వారు గుర్రాన్ని ఇచ్చేప్పుడు కొన్ని విషయాలు చెప్పారు.

"గుర్రాన్ని బాగా పోషించాలి. చేతనైనవారు గుర్రంపై స్వారీ చేయవచ్చు. రాజవీధులలో తిరగ వచ్చు. సామ్రాజ్య గౌరవానికి భంగం రానీయ రాదు. మూడు మాసాలకోసారి గుర్రాన్ని నాకు చూపాలి." ఈ మాటలు రామకృష్ణకవి విన్నారు. భటులు గుర్రాన్ని కవిగారికి అప్పగించారు. రాజుగారి మాటలు మన్నించి గుర్రాన్ని మేపేందుకు అంగీకరించారు. కాని గుర్రాన్ని మేపడం మాటలా ! కవిగారు గుర్రాన్ని గదిలో ఉంచారు.

గదికి మూడడుగులపై ఒక పెద్ద కంత చేశారు. తనకు గుర్తు వచ్చినపుడు కవిగారు నాలుగు పచ్చగడ్డి పరకలు కన్నంలోంచి పడేసేవారు. నీళ్ళు అంతంత మాత్రమే. ఆ గడ్డి, నీరు గుర్రానికి చాలేవి కావు.

గుర్రం బక్కచిక్కిపోయింది. దానాకు, నీటికి మొహం వాచిపోయింది. రాజుగారిచ్చిన పాతిక వరహాలు కవిగారు ఇంటి ఖర్చులకు వాడుకొన్నారు. ఇలా మొదట మూడు మాసాలు గడిచిపోయింది.

గుర్రాలను చూపించమని రాయలవారు కబురు చేశారు. కవిగారి గుండె గతుక్కుమంది. కాని తప్పలేదు. అందరూ తమ గుర్రాలను చూపించారు. పైగా అలంకారాలు చేసి మరీ చూపారు.

రాయులవారు "భేష్" అన్నారు వారూ ఆనందించారు. ఇహ కవిగారి వంతు వచ్చింది. "రామకృష్ణ కవిగారూ మీరు పెంచే గుర్రం ఏదీ"– అన్నారు.

వెంటనే కవిగారు చెప్పారు. "ప్రభూ! మీరు నాకో పెంకె గుర్రాన్ని అంటగట్టారు. గడ్డి తినదు. కాని ఎవరినీ దగ్గరకు రానీయదు. అందుకే ఇక్కడకు తీసుకురాలేకపోయాను ప్రభూ" అన్నారు – వినయంగా.

"అయితే ఒక భటుని పంపుతా అతని ద్వారా పంపు" అన్నారు రాయలవారు. "సరే ! అన్నారు కవిగారు. రాయలవారు బలమైన రాజభటుని పంపారు. ఆ భటునికి పొడవైన గడ్డం ఉంది. భటునికి కవిగారు గుర్రాన్ని చూపారు. కంతలోంచి గుర్రం సరిగా కనిపించలేదు.

భటుడు కన్నంలో తలదూర్చి గుర్రాన్ని చూశాడు. గుర్రం ఆకలితో నకనకలాడుతుంది. భటుని గడ్డాన్ని గడ్డిఅని భావించి ఒక పట్టు పట్టింది.

భటుడు లబోదిబోమన్నాడు. గుర్రం నోటి నుంచి గడ్డాన్ని పీక్కుని బతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు.

పరుగు లంకించుకుని కోటలో ప్రవేశించి రాయలవారికీ విషయం చెప్పారు.

రాయలవారికి కోపం వచ్చింది. కవిగారిని పిలిపించమన్నారు. భటులు కవిగారికి కబురు అందించారు.


కవిగారు కొలువులోకి వచ్చారు. రాయల వారు కొలువుతీరారు.

"రామకృష్ణా – నీకిచ్చిన గుర్రానికి సరిగా గడ్డి, నీరు పెట్టనందున బలహీనమై, నడవలేని స్థితికి వచ్చిందని విన్నాను నిజమా. నేనిచ్చిన డబ్బు ఏమి చేశావు" అన్నారు.

"చిత్తం ప్రభూ – గుర్రానికి తిండి పెట్టబోతే – ఎంతో పొగరుగా తయారైంది. మంచి పచ్చిగడ్డీ, దాణా, తాగే నీరు పెడితే, మదించి ఇంకా ఎంతో పెంకెగా తయారయ్యేది గదా ! అందుచేతే తిండి తగ్గించాను. దానికి బుద్ధి చెబుదామని" అని యుక్తిగా సమాధానం చెప్పారు కవిగారు.

★ ★ ★

# 10. గోతిలో నుంచి రాజసభకు



విజయనగర సామ్రాజ్యాన్ని రాయలవారు పాలిస్తున్న దినాలు. ఈ సామ్రాజ్యానికి ఆనాడు ఎంతో పేరు ప్రఖ్యాతులుండేవి. విజయనగర రాజ వీధులలో రత్నాలు అమ్మేవారని చెప్పుకొనేవారు.

దీనితోపాటు విజయనగర సామ్రాజ్య వైభవం చూచి పలువురు రాజులు అసూయపడేవారు. ఈ సామ్రాజ్యానికి శత్రుభయం బాగా ఉండేది.

ఒకసారి విజయనగర సామ్రాజ్యం వాయువ్య ప్రాంతంలో శత్రువులు పొంచి ఉన్నారు. ఈ విషయం వేగులవారి ద్వారా రాయలవారికి తెలిసింది. రాయల వారు తక్షణం మంత్రిమండలి సమావేశం ఏర్పాటు చేశారు. వీరంతా సమస్యను ఎలా ఎదుర్కోవాలో తీవ్రంగా చర్చిస్తున్నారు. ఇదొక రహస్య సమావేశం.

ఈ సమావేశం జరుగుతుంది. రామకృష్ణ కవి సమావేశంలోకి వెళ్ళే ప్రయత్నం చేశారు. ద్వార పాలకులు అడ్డగించారు. వారి మాట రామకృష్ణ కవి వినలేదు. నెట్టుకుని లోపలికి వెళ్ళారు. హాస్యంతో పద్యం చెప్పబోయారు. రాయల వారికి కోపం వచ్చింది. కళ్ళెర్రజేశారు.

"రామకృష్ణా పిలవని పేరంటంగా ఎందుకీ రహస్య సమావేశానికి వచ్చావు" అన్నారు రాయల వారు.

రామకృష్ణకవి ఏదో చెప్పబోయారు. రాయల వారు వినిపించుకోలేదు. గంట వాయించి భటులను పిలిచారు.

"రహస్య మంత్రాంగానికి రామకృష్ణకవి అనుమతి లేకుండా వచ్చారు. పైగా పరిహాసాలాడ బోయారు. మా పనికి భంగం కలిగించారు. వీరిని ఊరి బయటికి తీసుకెళ్ళి గోతిని తవ్వి. అందు గొంతు వరకు పాతి పెట్టండి. మరుసటి రోజు ఏనుగు చేత తొక్కించండి" ఇలా కఠిన దండన విధించారు. రాజసభలో ఉన్నవారంతా కిక్కురుమనలేదు. అందరి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎదురు చెప్పేందుకు ఎవరూ సాహసించలేదు.

భటులు రామకృష్ణ కవిని బంధించారు. వెంటనే ఊరి బయటకు తీసికెళ్ళారు. కొందరు భటులు గొయ్యి తవ్వారు. రామకృష్ణకవిని అందు దించారు. తల కనిపించే వరకు ఉంచి, మిగతా దంతా పూడ్చివేశారు. రాజభటులు వెళ్ళి పోయారు. రామకృష్ణ కవి ఏమీ బాధపడలేదు. ఎలాగో బయటపడవచ్చనే ధైర్యంతో ఉన్నారు.

కాసేపటికి ఒక చాకలి రేవు నుంచి ఊళ్ళోకి వస్తున్నాడు. చాకలి రామకృష్ణుని గుర్తుపట్టారు.

"స్వామీ ఎందుకీ శిక్ష. ఎందుకింత కష్టంలో ఉన్నారు." అన్నాడు చాకలి.

ఆ మాటలు విన్న రామకృష్ణ కవి నవ్వుతూ ఇలా చెప్పారు.

"మిత్రమా ! నన్నెవరూ పాతిపెట్టలేదు. శిక్ష అనేది ఏమీలేదు. నేను కొంతకాలంగా గూనితో బాధపడుతున్నా. సరిగా నడువలేకున్నా. రాజవైద్యుని సలహా కోరాను. రెండు దినాలు

గోతిలో ఉంటే గూని పోతుందని సలహా ఇచ్చారు. అందువల్ల ఇలా ఉన్నాను. నన్ను పాతిపెట్టి రెండు దినాలైనది అని బొంకారు కవిగారు.

"స్వామీ ! చూశారా !నన్నూగూని బాధిస్తున్నది. నేను కూడ ఇలా చేస్తాను" అన్నాడు చాకలి.

చాకలి గోతిలోని మట్టి అంతా తీశాడు. రామకృష్ణకవి బయటకు వచ్చారు. నిటారుగా నిలబడ్డారు.

"నా గూని పోయింది" చూడు అన్నారు రామకృష్ణకవి.

"చిత్రంగా ఉందే. గూని పోయింది." అని ఆనందించాడు చాకలి. చాకలి బట్టల మూట ఒడ్డున పెట్టి గోతిలో దిగాడు.

రామకృష్ణకవిగారు చాకలి తల కనిపించేటట్లు ఉంచి, మిగతాదంతా కప్పేశారు.

రామకృష్ణకవి నగరంలోకి వెళ్ళిపోయారు. ఆ రోజు విశ్రాంతి తీసుకున్నారు.

మరునాడు ఉదయమే భటులు వచ్చారు. ఏనుగును తెచ్చారు.

తలవరకు కనిపించే చాకలి గొల్లుమన్నాడు.

గోతిలో ఉన్నది రామకృష్ణకవిగారు కాదని మరొకరని భటులు గమనించారు.

"ఎవరు నువ్వు? ఆ గోతిలోకి ఎలా వచ్చావు? గోతిలో పాతిపెట్టిన కవిగారు ఏమైనారు?" అని అడిగారు భటులు.

అప్పుడు గోతిలో ఉన్న చాకలి జరిగిన విషయం అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

భటులు జాలిపడ్డారు.అతనిని దివాణం చాకలి అని గుర్తించారు.మట్టి అంతా తీసి, అతనిని బయటకు లాగారు. చాకలి తన మూట తీసుకుని వెళ్ళిపోయాడు.

ఈలోగా రామకృష్ణకవి ఉదయమే కొలువుకు పోయారు.రాయలవారిని దర్శించి నమస్కరించారు.

"రామకృష్ణా రాజభటులు నిన్ను శిక్షంచలేదా! నీవెలా బతికి బయటపడ్డావు" అన్నారు రాయలవారు.

తాను దివాణం చాకలిని ఎలా మోసగించిందీ వివరించారు. రాయలవారు నవ్వుకున్నారు. రామకృష్ణ కవిగారి బుద్ధి కుశలతకు ఆనందించారు.

అతనిపై రాయలవారి కోపం మాయమై పోయింది.

* * *

## 11. తిలకాష్ట మహిషబంధనం




హంపి విజయనగరం రాజధానిగా శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రదేశాన్ని పాలిస్తున్న రోజులవి. రాయలవారు రోజూ కొలువు తీర్చేవారు. ఆ కొలువులో అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, తెనాలి రామకృష్ణకవి వంటి అష్టదిగ్గజాలు ఉండేవారు.

ఒకరోజునరాయలవారి కొలువుకు రామశాస్త్రి అనే పండితుడు దర్శనానికి వచ్చారు. రామశాస్త్రి గారు తర్క, వ్యాకరణ శాస్త్రాలలో మహాపండితుడు.

ఆ పండితునికి రాయలవారి ఆస్థానంలోని కవి పండితులను ఓడించాలనే కోరిక ఉండేది.

ఆ కోరిక మనసులో ఉంచుకుని రామశాస్త్రి గారు రాయలవారిని దర్శించి "మహాప్రభూ ! మీ ఆస్థానంలో అష్టదిగ్గజాలు అనిపించుకున్న మహాకవులు ఉన్నారు గదా. వారి కవిత్వం, పాండిత్యం తెలుసుకోవాలని నాకు తలంపు ఉంది. నాకు అవకాశం ఇవ్వగలరా !" అని అన్నారు.

రాయలవారు అందుకు అంగీకరించారు. "ఆ మరుసటి రోజే కలుద్దాం" అని చెప్పారు.

రాయలవారు కొలువు దీరారు. మంత్రి పుంగవులు, కవి పండితులు అంతా కొలువులో ఉన్నారు. అందు తెనాలి రామకృష్ణకవి ఉన్నారు. అయితే రామకృష్ణకవి సభకు వస్తూనే అంగవస్త్రంతో చుట్టిన పెద్ద కట్టను చంక నిడుకొని వచ్చారు. ఇదేమిటో అని అందరూ ఆశ్చర్యపడ్డారు. కవిగారు ఏదో చమత్కారం చేస్తారని అందరూ ముందే ఊహించారు.

రామశాస్త్రిగారు కవిగారి చంకలోని కట్ట చూశారు. అదేదో గ్రంథం అనుకున్నారు.

వెంటనే రామశాస్త్రిగారు కవిగారి వద్దకు వచ్చారు. నమస్కరించారు. కవిగారు ప్రతి నమస్కారం చేశారు. రామశాస్త్రిగారు కవిగారిని సమీపించి "మీ చంకలోని గ్రంథం పేరు తెలుసు కోవచ్చా !" అని ప్రశ్నించారు.

ఇది "తిలకాష్ట మహిష బంధనం" అని ఠక్కున కవిగారు సమాధానం చెప్పారు.

రామశాస్త్రిగారు ఉలిక్కిపడ్డారు. "ఇలాంటి గ్రంథం పేరు వినలేదే" అని ఆలోచనలో పడ్డారు. ఎంత తలగోక్కున్నా గుర్తుకు రాలేదు.

కవిగారు "తిలకాష్ట మహిష బంధనం అనే గ్రంథం ఉంది. వాదనకు పనికివస్తుందని తెచ్చి భద్రంగా కట్టకట్టి ఉంచాను" అన్నారు.

రామశాస్త్రిగారు గాభరా పడ్డారు. "తర్క వ్యాకరణ శాస్త్ర గ్రంథాలన్నీ నేను ఔపోసన పట్టినవే. కవిగారు చెప్పిన గ్రంథం నా దృష్టికి రాలేదు. అయినా ఒకసారిపరిశీలిస్తా. మరొకసారి కలుద్దాం" – అని సభ వదలి వెళ్ళిపోయారు.

రామశాస్త్రిగారు ఇల్లు చేరాక తన వద్ద గల తాళపత్ర గ్రంథాలన్నిటినీ పరిశీలించారు. ఎక్కడా ఆ పేరు గల గ్రంథం కనిపించలేదు. సాటి పండితులను వాకబు చేశారు. వారి వద్ద కనిపించలేదు.

రామశాస్త్రిగారు ఓడిపోయినట్లు భావించారు. రాయలవారి కొలువుకు మరల వెళ్లేందుకు మనస్కరించలేదు. అయితే రాయలవారు మరుసటి రోజు కొలువు దీరారు. కవిగారిని పిలిచారు.

"రామకృష్ణా – నీ వద్ద గల తిలకాష్ట మహిష బంధనం అనే గ్రంథంలోని కొన్ని పద్యాలు చదివి వినిపించు" అన్నారు రాయలవారు.

అందుకు కవిగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ –

"ప్రభూ నా చంకలోనిది మీరొక గ్రంథం అనుకుంటున్నారు గదా ! కాదు కాదు" అని కట్టపై గల అంగవస్త్రాన్ని తీసేశారు. అది తాడుతో కట్టిన నువ్వుల కంప. తరువాత ఇలా వివరించాడు.

"ప్రభూ – తిలకాష్టం అంటే నువ్వుల కంప. మహిష బంధనం అంటే ఎనుబోతును కట్టివేసే తాడు. రెంటిపై అంగవస్త్రాన్ని కప్పి తెచ్చాను. గర్విష్టులైన కవి పండితులకు ఇలాగే బుద్ధి చెప్పాలి" అని అన్నారు కవిగారు.

కవిగారి యుక్తికి రాయలవారు ఎంతో ఆనందించారు.

* * *

## 12. సానివాడలో సాహిత్య గుభాళింపు

హంపి విజయనగర సామ్రాజ్యం రాయల వారి కాలంలో కవులతో, కళాకారులతో కళకళ లాడుతుండేది. ఈ సామ్రాజ్యంలో సాని వీధి అని ప్రత్యేకంగా ఒక వీధి ఉండేది. రాజభటులూ, పండితులూ కూడ ఆ వీధికి వెళ్ళడం కద్దు.



ఈ వేశ్యలలో పాండిత్యం కలవారూ కొందరుండేవారు. వేశ్యలు వచ్చిన విటులతో సాహిత్య గోష్ఠి నెరపేవారు. ఒకోసారి పందేలు కాసేవారు.

వేశ్యలు కొందరు గర్విష్టులు ఉండేవారు. వారిలో లతాంగి పేరుగల వారు ఒకరున్నారు. ఆమె మంచి పండితురాలు. ఎంతటి వారినైనా తన జిత్తులతో, కవితాకుయుక్తులతో ఓడించ గలదు.

రామకృష్ణకవికి ఈ విషయం తెలిసింది. ఎలాగైనా లతాంగిని ఓడించాలి. ఆమె గర్వం అణచాలి అనుకున్నారు.

ఒకరోజు రామకృష్ణకవి మారువేషం వేసుకున్నారు. నెత్తిన గడ్డి మోపు పెట్టుకున్నారు. సానివాడకు చేరారు. "గడ్డి మోపు అమ్ముతాం – గడ్డి మోపు అమ్ముతాం" అని అరవడం మొదలు పెట్టారు.

లతాంగి ఇంటిలో ఒక పశువులశాల ఉంది. ఆ ఇంటి సమీపంలోకి రాగానే ఇంకా పెద్దగా అరిచారు. ఈ మాటలను లతాంగి విన్నది. ఇంటి బయటకు వచ్చింది.

"ఏం నాయనా ! గడ్డిమోపు ఎంతకిస్తా వేంటి?" అని అడిగింది.

ఈ మాటలు కవిగారు విని – "డబ్బెందుకమ్మా నాకు ! పట్టెడు మెతుకు చాలు. ఈ పూట తింటాను" అన్నారు మారువేషంలో ఉన్న కవిగారు.

"అయితే గడ్డిమోపు ఆ గొడ్ల చావడిలో వెయ్యి. అన్నం తీసుకువస్తాను" అంది లతాంగి.

మారువేషంలో ఉన్న కవిగారు అలాగే చేశారు.

ఈలోగా లతాంగి ఇంట్లోకి పోయి ఒక గిన్నెలో అన్నం తీసుకువచ్చింది.

అంగవస్త్రం పట్టు. అందులో అన్నం పడేస్తానంది. కవిగారు అంగవస్త్రం తీశారు. జంధ్యం కనపడింది. లతాంగి వీరు రామకృష్ణ కవి అని గుర్తు పట్టింది. అయినా బయటపడలేదు.

"ఏమ్మా నేను కావాలంది పట్టెడు మెతుకు. అనగా చేతిలో ఒక మెతుకు మాత్రమే. పట్టెడన్నం కాదు. పట్టెడు మెతుకుకు పట్టెడు అన్నానికి తేడా తెలియదా ! నీదేం పాండిత్యం" అన్నాడు లతాంగిని ఉద్దేశించి.

ఈ విషయం లతాంగి గమనించి "పట్టెడు మెతుకు" కావాలన్నారు. మెతుకులు అనలేదు. అయినా మెతుకేం చేసుకుంటావ్ ! మెతుకులే తెచ్చాను తిను. ఆకలి పోతుంది" అంది తెలివిగా.

లతాంగి పాండిత్యాన్ని కవిగారు గమనించారు. వెళ్ళిపోబోయారు. లతాంగి కవిగారిని పిలిచి "మీరు మా యింటికి రావడం, నన్ను పరీక్షించడం ఒక అదృష్టం అంటూ – కొన్ని వరహాలు మూటకట్టి కవిగారిచేత ఉంచి నమస్కరించింది." ఇలా జరుగుతుండేవి ఆనాటి సాహిత్య వ్యాపకాలు.

★ ★ ★

# 13. ప్రత్యక్ష రామాయణం



మన రాష్ట్రంలో నెల్లూరు ప్రసిద్ధి గన్న పట్టణం. దీన్ని ఇంతకు పూర్వం విక్రమ సింహపురి అనేవారు. ఒకప్పుడు ఈ పట్నంలో కొందరు వేశ్యలుండేవారు. వారు చాలా చమత్కారులు. యుక్తిపరులు. వాక్చాతుర్యం గలవారు. ప్రతిభ గలవారు. మాటలతో వారిని ఓడించడం చాలా కష్టం.

ఆ వేశ్యలలో ఒకరిపేరు చిత్రాంగి. ఆమె చాలా తెలివైనది. ఎలాంటి పండితులనైనా మాటలతో చిత్తు చేయగలదు. దాసులను చేసుకో గలదు. అంతటి గర్వం ఆమెకుండేది.

తన వద్దకు వచ్చిన పండితులను ప్రత్యక్ష రామాయణం చెప్పమని, దానిపై రకరకాల ప్రశ్నలు వేసి వేధిస్తూ ఉండేది. తనకు నచ్చిన విధంగా చెబితే వారికి వేయి వరహాల బహుమతి నిచ్చి తనతో కాపురం చేస్తానని ప్రకటించేది.

ఆ ప్రకటన విన్న పలువురు పండితులు వచ్చి రామాయణ కాలక్షేపం చేసేవారు.

లతాంగి ఏవో వంకలుచెప్పి,వారిని నిరుత్సాహ పరిచేది. కొందరిని దాసులుగా చేసుకొనేది. ఈ విషయం రామకృష్ణ కవి చెవిన పడింది. చిత్రాంగికి బుద్ధి చెప్పాలనుకున్నారు. పండితులను కాపాడదాం – అనుకున్నాడు.

ఒకసారి ఏదో పనిమీద విక్రమసింహపురి వెళ్ళారు. ఆ ఊరి విశేషాలు పేదరాసి పెద్దమ్మ ద్వారా తెలుసుకున్నారు.

మారువేషం వేశి చిత్రాంగి ఇంటికి చేరారు.

"ప్రత్యక్ష రామాయణంచెప్పమంది" చిత్రాంగి.

"సరే" అన్నాడు రామకృష్ణకవి. ఒక షరతు పెట్టారు రామకృష్ణ కవి. "నేను కథ చెప్పేటప్పుడు ఏమీ అడ్డు చెప్పరాదు. నేను చెప్పినట్లు చేయాలి. తరువాత నా కథ బాగుంటే బహుమతి ఇవ్వండి. లేకుంటే శిక్షించండి. మీరేశిక్ష వేసినా అనుభ విస్తాను" అని అన్నాడు.

చిత్రాంగి అందుకు తన అంగీకారం తెలిపింది. రామకృష్ణ కవి కథా కాలాక్షేపం ప్రారంభించారు.

రాముడు, వారి సోదరుల జననం, విశ్వామిత్రుని వెంట వెళ్ళడం, తాటకిని చంపడం, అహల్య శాపవిముక్తి, శివుని విల్లు విరచడం, కైక కోర్కె తీర్చేందుకు అడవులకు పోవడం, రావణుడు సీతను అపహరించడం, హనుమంతుడు లంకకు పోవడం, లంకా దహనం – ఇలా పూస గుచ్చినట్లు చెప్పుకుపోయాడు రామకృష్ణ కవి.

లతాంగి – పెదవి విరిచింది. "రామాయణం కళ్ళకు కట్టినట్లు చెప్పలేదు" అంది.

కథ పూర్తయ్యే వరకు మాట్లాడవద్దని చెప్పాను గదా" అని తన ఒప్పందం గుర్తు చేశారు రామకృష్ణ కవి.

చిత్రాంగి ఊరుకుంది.

రామకృష్ణ కవి విజృంభించి ఇదిగో ప్రత్యక్ష రామాయణం ప్రారంభిస్తున్నా అని "హనుమంతుడు మహేంద్ర పర్వతాన్ని ఇలా ఎక్కాడు" అని మంచం ఎక్కాడు.

వెన్ను విరుచుకున్నాడు.

"ఆ తర్వాత ఒక పర్వతం మీద నుంచి మరో పర్వతం మీదకు ఇలా దూకాడు – అంటూ – ఒక చోటి నుంచి మరో చోటకిదూకాడు. హనుమంతుడు లంకా నగరం ప్రవేశించాడు. తనకు అడ్డుపడ్డ లంకిణిని ఒక గుద్దు గుద్దాడు – అని చిత్రాంగి వీపుపై గట్టిగా గుద్దాడు. చిత్రాంగి ఏడుపు ముఖం పెట్టి – ఇక కథ ఆపమంది.

"మధ్యలో ఆపవద్దన్నాను గదా" అని మరలా కథ కొనసాగించాడు.

"హనుమంతుడు సీతాదేవిని చూసి తిరిగి వస్తూ, లంకను ఇలా తగులబెట్టాడు. అని ఇంట్లో బట్టలన్నిటినీ తెచ్చి గుట్టపోసి నిప్పంటించి తగలేశాడు" రామకృష్ణకవి.

చిత్రాంగి నెత్తి నోరు బాదుకొంది. కథ ఆపమని గగ్గోలు పెట్టింది. కవిగారు కథ చెప్పడం ఆపేశారు.

చిత్రాంగి ఈ విషయాన్ని న్యాయాధిపతికి ఫిర్యాదు చేసింది. న్యాయాధిపతి – చిత్రాంగి చెప్పింది విన్నారు.

రామకృష్ణకవిని తన సమాధానం చెప్ప మన్నారు. అప్పుడు కవిగారు ఇలా చెప్పారు.


"ఆమె కోరికపై రామాయణ కథాకాలక్షేపం ప్రారంభించాను. అలాకాదు ప్రత్యక్ష రామాయణం చెప్పమంది. అందు ప్రత్యక్షంగా చేసి చూపాను. నా తప్పేంలేదు" అని చెప్పాడు కవిగారు.

న్యాయాధిపతి ఉభయవాదాలు విన్నాడు. కవిగారి తప్పేం లేదని తీర్పు ఇస్తూ – కవిగారికి బహుమతి ఇవ్వమని కూడా చెప్పారు. అందుకు చిత్రాంగి అంగీకరింపక తప్పలేదు.

ఈ విషయం తెలిసి రాయలవారూ ఆనందించారు.

★ ★ ★

## 14. పదిహేను రోజులలో భారత రచన



హంపి శ్రీకృష్ణదేవరాయలు విజయనగరం రాజధానిగా చేసుకుని ఆంధ్రదేశాన్ని పాలించారు. వారి కాలంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండేవి. ప్రజలు సుఖశాంతులతో ఉండేవారు.

కాని రాయలవారికి ఎప్పుడూ శత్రు భయం ఉండేది. ఆ కాలంలో బహమనీ రాజ్యాన్ని పదుల్‌శాహీ అనే రాజు పాలిస్తూ ఉండేవారు. వీరి తాత కుతుబ్‌షాహీ. వీరు నాదెండ్ల అన్నమాత్యుడు రచించిన "తపతీ సంవరణోపాఖ్యానం" అనే కావ్యాన్ని అంకితం పొందారు. తన తాతగారి లాగా తానూ ఒక కావ్యాన్ని అంకితం పొందాలనే కోరిక పదుల్‌శాహీకి కలిగింది. కావ్యం అంకితం అందుకుంటే జీవిత కాలం పెరుగుతుందని ఆనాడు ఒక నమ్మకం ఉండేది. ఆ నమ్మకం ఈనాడూ ఉంది.

కారణాలు ఏవైతేనేం శ్రీకృష్ణదేవరాయలు పదుల్‌శాహీల మధ్య యుద్ధం చెలరేగింది. కొన్ని రోజులు యుద్ధం జరిగింది. చివరకు సంధి కుదిరింది.

ఈ సంధిలో ఒక షరతు ఏమంటే – రాయల వారు పదిహేను దినాలలో భారతం రాయించి తమకు అంకితం ఇవ్వాలి. ఆ భారతంలో తమను పాండవులుగా చిత్రించాలి. తమ శత్రువులైన నిజాం ఉల్ముల్క్ వంశాన్ని కౌరవులుగా చిత్రించాలి. ఇవీ షరతులు. రాయలు అందుకు అంగీకరించారు.

రాయలవారు కోటకు చేరారు. మరుసటి రోజే అష్ట దిగ్గజాలు, ఇతర కవి పండితులను సమావేశపరిచారు.

"కవి పండితులారా ! పదిహేను దినాలలో మీరంతా కష్టపడి మహాభారతాన్ని రాయాలి. లేకుంటే సంధి విఫలం అవుతుంది. మన రాజ్యానికి ముప్పు కలుగుతుంది. కనుక భారత రచనకు పూనుకుని పరువు కాపాడండి" అన్నారు.

కవులకు ఏమీ పాలుపోలేదు. ఒకరి మొహం ఒకరు ప్రశ్నార్థకంగా చూచుకున్నారు. చివరకు తలలు దించుకున్నారు. అప్పుడు రామకృష్ణ కవి మాత్రం లేచి నిలబడి "మహాప్రభో ! మీరు కోరినట్లు పదిహేను దినాలలో మహాభారతం రాస్తాను. పదుల్ శాహీ ప్రభువుకు అందజేద్దాం. మన రాజ్యం భద్రంగా ఉంటుంది. అయితే నాకు 15 దినాలు సమయం ఇవ్వండి. రాతకు అవసరమైన తాటి ఆకులు మా ఇంటికి పంపండి" అన్నారు.

రాయలవారు "భేష్ బాగుంది. అలాగే చేస్తాము" రచనకు అవసరమైన తాటాకులను రామకృష్ణ కవిగారి ఇంటికి పంపే ఏర్పాటు చేశారు. 15 దినాలు గడువు ఇచ్చారు.

రామకృష్ణ కవి యథాలాపంగా కాలక్షేపం చేశారు. 15 రోజులు గడువు పూర్తయింది. కవులలో గుబులు పట్టుకుంది. రామకృష్ణ కవి తాటాకుపై ఘంటం పెట్టలేదు. ఏం జరుగుతుందో! ప్రభువులవారు ఏ శిక్ష వేస్తారో అని భయపడి పోయారు. తాతాచార్యులవారు మాత్రం ఈసారి "రామకృష్ణునికి శిక్ష పడాల్సిందే" అని అనుకున్నారు.

రామకృష్ణకవి మాత్రం నిశ్చింతగా ఉన్నారు. 16వ రోజు రానే వచ్చింది. కవిగారు రాజభటులకు కబురు చేశారు. బండ్లు తెమ్మన్నారు. బండ్లపై తాటాకు కట్టలు క్రమంగా పేర్చారు. ఈ తాటాకులపై ఏమీ రాయలేదు అంతా విచిత్రం !

అష్టదిగ్గజాలు, ఇతర కవి పండితులు అందరితో కలిసి రామకృష్ణ కవి పదుల్శాహీ రాజధాని నిజాపూర్కి తరలివెళ్ళారు. సత్రంలో మకాం వేశారు. అందరూ రాజ బంధువులుగా మంచి విందు ఆరగించారు.

మరునాడే అందరూ పదుల్శాహీ దర్బారుకు వెళ్ళారు. రాజావారు పెద్దనాది మహాకవులు తమ దర్బారుకు వచ్చినందుకు ఉచిత రాచమర్యాదలన్నీ చేశారు.

"మహాకవులారా ! మహాభారత రచన చేశారా! మమ్ములను పాండవులుగానూ, శత్రువు నిజాం ఉల్ముల్క్ను కౌరవులుగానూ చిత్రించారా! నాకు అంకితం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారా! అన్నారు పదుల్శాహీ !

కవులంతా రామకృష్ణకవి వంక చూశారు. కవిగారు సమాధానం చెబుతారు" అని మనవి చేశారు.

"ప్రభూ ! మీ కోరిక మేర మహా భారతం రాశాను. తాళపత్రాలన్నీ బండ్లపై కట్టగా ఉన్నాయి. అయితే ఇంకా కొంత కొరవుంది. ఒక సందేహం ఉంది. నివృత్తి చేయండి" అన్నారు కవిగారు !

"ఏమా సందేహం చెప్పండి కవిగారూ" అన్నారు పదుల్శాహీ !

కవిగారు వెంటనే అందుకున్నారు.

"ప్రభూ ! మీరు కోరినట్లుగా నిజాం ఉల్ముల్క్ వారి వంశాన్ని కౌరవులుగా చేర్చి రాశాను. మిమ్ములను పాండవులుగా చిత్రించి రాస్తున్నా. ఈ సమయంలో నన్నొక సందేహం పట్టుకుంది.

ఏమనగా ! పాండవులు ఐదుగురు కదా ! వీరి భార్య ద్రౌపది. అనగా ద్రౌపదికి ఐదుగురు భర్తలు. ఈ విషయం భారతంలో ఉంది కదా ! తమ ధర్మపత్నిని ద్రౌపదిగా వర్ణించాను.

తమను ధర్మరాజుగా వర్ణించాను. ద్రౌపది మిగతా నలుగురు భర్తలు – అనగా మీ భార్యకు నలుగురు భర్తల పేర్లు ఎలా రాయమంటారో చెప్పండి" అన్నారు యుక్తిగా !" కవిగారు.

"ఏమిటీ మా రాణీ వారికి మరో నలుగురు భర్తలుండాలా ! మీ భారతంలో ఇలాగే ఉందా ! ఛూ ! ఛూ ! ఛూ ! నాకు భారతం వద్దు, గీరతం వద్దు. తాటాకు కట్టలు తగలేయండి !" అని కోపంగా పదుల్‌శాహీ అన్నారు.

ఇంకేం క్షణాలలో భటులు తాటాకు కట్టలను బూడిద చేశారు. కవులంతా బతికిపోయాం అనుకుంటూ ! రామకృష్ణ కవిని అభినందించారు.

పదుల్‌శాహీ వారికి రామకృష్ణకవి చేసిన చమత్కారం సంగతి తెలియదు.

తమ రాజ్యానికి వచ్చిన కవులందరినీ ఘనంగా సత్కరించి సాదరంగా పంపారు. అందరూ విజయనగరం చేరుకుని రాయలవారికి జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు చెప్పారు. తాతాచార్యులవారు మెల్లగా తప్పుకున్నారు. రాయల వారు రాజ్య గౌరవాన్ని కాపాడినందుకు రామకృష్ణ కవిని అభినందించారు.

★ ★ ★

# 15. పున్నాగనాయుని పేరాశ

రాయలవారు హంపి విజయనగరం రాజధానిగా విశాలాంధ్రావనిని పాలించారు. అపారమైన సంఖ్యలో సామంత రాజ్యాలుండేవి. వారిలో పున్నాగనాయుడు ఒక సామంతరాజు ఉండేవాడు. నాయుడుగారు నలుపు రంగులో ఉండేవారు. బంగారు మేని రంగు కావాలనుకుని తన సంస్థానములోని వైద్యులందరికీ కబురు చేశారు. వారంతా కొలువుకు ఏతెంచారు.



నాయుడుగారు విషయం చెప్పారు. ధన్వంతరీ పూజ అనంతరం వైద్యం మొదలుపెడదాం అన్నారు వైద్యులు. నాయుడు సరే అన్నారు. రాజ వైద్యులు చిక్కులో పడ్డారు. శరీరం రంగు మార్చడం బ్రహ్మతరం కాదు. ఈ విషయం తెలిసి కొందరు ఛాందసులు రామకృష్ణ కవిగారి వద్దకెళ్ళి తమను కాపాడమని కోరారు.

రామకృష్ణ కవి ఒక మార్గం ఆలోచించారు.

◆ ◆ ◆

వైద్యులు నాయుడుగారిని తీసుకుని నది ఒడ్డుకు చేరారు.

రామకృష్ణుడు ఒక కుక్కను తీసుకుని నది ఒడ్డుకు చేరుకున్నారు. కాస్త దూరంలో కూర్చు న్నారు. వైద్యులు శుభ వచనాలు ప్రారంభించారు.

కవిగారూ ప్రారంభించారు. నాయుడుగారు నదిలో దిగారు. స్నానం ప్రారంభించారు.

రామకృష్ణకవి నల్లకుక్కను నదిలో దింపి శుద్ధి చేయడం ప్రారంభించారు.

పండితులు పున్నాగనాయుని వేద ప్రవచనాలతో దీవించారు. కవిగారూ కుక్కను వేద ప్రవచనాలలో దీవించారు. ఇదే సమయంలో రాయల వారు మారువేషంలో ఆ ప్రాంతంలో సంచరిస్తున్నారు.

రెండు బృందాలను చూశారు. "బిగ్గరగా పక పకా నవ్వారు. ఏమిటి రామకృష్ణా – అందరూ ఇచ్చుట చేరారు" అన్నారు రాయలవారు.

అప్పుడు రామకృష్ణకవి ఇలా వివరించారు.

"ప్రభూ ! పున్నాగనాయుని శరీరం రంగు మార్చాలని వైద్యుల ప్రయత్నం మంచిదే కాని అది సాధ్యం కాదు. ఎందుకంటే శరీరపు రంగు జన్మతః వచ్చేది ఎవరూ మార్చలేరు. మార్చమని కోరడం మార్చా లనుకోవడం భ్రమ. శరీరపు రంగు మధ్యలో పోయేది కాదు."

రాయలవారు విషయం గ్రహించారు. పున్నాగనాయుని కోరికకు జాలిపడ్డారు. రామకృష్ణ కవి వివరణకు ఆనందించారు. తన తప్పును నాయుడు గారు తెలుసుకున్నారు.


★ ★ ★

# 16. అంతఃపుర రహస్యాలు

హంపి విజయనగర సామ్రాజ్యం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్న రోజులవి. నాడు రాయలవారికి తిరుగులేదు. వారి కీర్తి దశ దిశల పాకింది. రాయలవారిని హాస్యోక్తులతో నవ్వించడం రామకృష్ణకవిగారి పని. హాస్యం కవిగారి నైజం.

ఒకమారు రాయలవారు అంతఃపురంలో ఉన్నారు. వారితో రాణి చిన్నాదేవి ఉన్నారు. వారిద్దరే ఒక మంటపంలో ఉన్నారు.

రాయలవారు చిన్నాదేవిని సమీపించారు. వంగి ముద్దుపెట్టుకోబోయారు. అప్పుడు రాణీ వారికి తుమ్ము వచ్చి పెద్దగా తుమ్మారు తుమ్ము ఆపుకోలేరు గదా.



రాయలవారు చేద్దామనుకున్నపని ఆగి పోయింది. వెంటనే మరో గదికి వెళ్ళిపోయారు.

ఈ విషయం గోప్యంగా ఉంచుదామను కున్నారు. కాని ఆ దృశ్యాన్ని ఇద్దరు దాసీలు చూశారు. వారి నోటిలో నువ్వుగింజ నానదు గదా!

అందులో ఒక దాసీ కూతురు రామకృష్ణ కవిగారి ఇంట్లో పనిచేసేది. ఆ విషయం దాసి కూతురు రామకృష్ణ భార్యకు చెప్పింది. ఆ భార్యామణి ఈ విషయం రామకృష్ణ కవి చెవిలో ఊదింది.

ఇంకేం కవిగారికి చేతినిండా పని. ఒక పట్టు పడదాం ! అనుకున్నాడు. అసలు విషయం రాబడదాం అనుకున్నాడు.

ఆ దినాలలో కవిగారికి గుర్రపు, బండి ఉండేవి. రాయలవారి కొలువుకు బండిలో దర్జాగా వెళ్ళేవారు.

ఒక రోజున కవిగారు కోటకు బయలు దేరారు. గుర్రం మూతికి ఎర్రటి గుడ్డ కట్టారు.

దారిలో ఒకడు ఇలా అడిగాడు "స్వామి గుర్రం మూతిని గుడ్డతో కట్టి వేశారేమిటి" అన్నాడు. అందుకు కవిగారు చమత్కారంగా "అంతః

పుర రహస్యాలు అది బయటపెట్టవచ్చు గదా! అందు చేతే మూతిని మూసేసా గుడ్డతో" అన్నారు.

ఇలా నగర వీధులలో కవిగారు తిరిగారు. ప్రతిచోట ఇలాగే చెప్పారు. ఆ మాటలు వేగుల వారి చెవిన పడ్డాయి.

వేగులవాడు కవిగారిని సమీపించి గుర్రం మూతిని కట్టివేసిన కారణం అడిగాడు. వేగులవాడి చెవిలో కవిగారు రహస్యంగా ఇలా చెప్పాడు.

"ఆ మరేంలేదు. రాయలవారు చిన్నాదేవిని ముద్దుపెట్టుకోబోతుండగా తుమ్మిందటగా. మా గుర్రం మంచిది గాదు. ఈ రహస్యం అందరికీ చేరవేస్తుంది. అంచేత మూతి కట్టేశాను" అన్నాడు నీళ్ళు నములుతూ. వేగులవారు ఈ విషయం కోటలోకి చేరవేశారు.

రాయలవారి చెవిన పడింది. రాయలవారు కవిగారిని గట్టిగా మందలించాలనుకున్నారు.

కవిగారిని కొలువుకు పిలిపించకుండా ఆయన ముఖం తనకు చూపవద్దని భటుల ద్వారా కబురు చేశారు. ఈ విషయం కవిగారికి తెలిసింది. దీన్నుంచి ఎలాగో బయటపడాలనుకున్నారు కవిగారు. మార్గం ఆలోచించారు.

మరుసటి రోజు రాయలవారు కొలువు జరుగుతుంది. అచట ఏవో చర్చలు జరుగు తున్నవి. కవిగారు తన స్థానంలో లేరు. రాయల వారు సంతృప్తి చెందారు.

ఆ సమయంలో కవిగారు ఊడిపడ్డారు. తలపై బోర్లించిన ఒక కుండతో, కుండపై కళ్ళు కనబడేందుకు రెండు చిన్న కంతలున్నాయి.

ఈ పరిస్థితిని రాయలవారు గమనించారు. "రామకృష్ణకవి నీ ముఖం చూపించవద్దని చెప్పాను గదా ! మరల కొలువుకు ఎందుకు వచ్చావు" అన్నారు రాయలవారు కోపంగా.

"చిత్తం ప్రభూ ! మీరు నా ముఖం చూప వద్దన్నారు గాని, నన్ను వద్దనలేదు గదా" అన్నారు కవిగారు.

కవిగారి యుక్తికి రాయలవారు నవ్వుకుని కవిగారిపై ఉన్న శిక్షను తొలగించారు. ఆనాటి కొలువు ఆనందంగా ముగిసింది.

★ ★ ★

## 17. తెనాలి రాముని యుక్తి



శ్రీకృష్ణ దేవరాయలు హంపీ విజయనగర సామ్రాజ్యాని పాలించారు. దేశవ్యాప్తంగా మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించారు. కవి, పండితు లను పోషించారు.

రాయలవారు వేసవి విడిది కోసం భవనం నిర్మించాలని తలచారు. అనుకూలమైన చోటు ఎంపిక చేశారు. అచట భవనం నిర్మించారు. అచట గోడలకు చిత్రాలను అలంకరించేందుకు చిత్రకారుని నియమించారు. పని పూర్తయ్యేదాకా అచటికి ఎవరినీ అనుమతించలేదు. పని పూర్తయింది. వేసవి విడిది చూపించేందుకు మంత్రులను, అష్టదిగ్గజాలను ఆహ్వానించారు. అందులో తెనాలి రామకృష్ణకవి ఉన్నారు.

అందరూ చిత్రాలను చూచి ఎంతగానో మెచ్చుకున్నారు. కాని కొన్ని చిత్రాలను అసంపూర్ణంగా ఉన్నట్లు రామకృష్ణుడు గమనించారు.

"ఈ చిత్రాలు పూర్తికాలేదు. వీటిని పూర్తి చేయాలి" అని కొన్ని చిత్రాలను కవిగారు చూపించారు.

ఈ మాటలు విన్న చిత్రకారునికి కోపం వచ్చింది. కవిగారి మాటలకు బాధ కలిగింది.

"కవిగారూ ! మీరు నా చిత్రాలను సరిగా అర్థం చేసుకోలేదు. చిత్రకళపై అవగాహన ఉన్నవారే చిత్రాలను అర్థం చేసుకోగలరు" అన్నారు చిత్రకారులు బిగ్గరగా. దానిపై మంత్రులందరికీ అనుమానం వచ్చింది "కవిగారు పొరపడ్డారా" అని.

వెంటనే కవిగారు అందుకున్నారు. "మహారాజా నేను గోడలపై కొన్ని చిత్రాలు కోటలో వేస్తాను" అన్నారు.

"సరే" అన్నారు రాయలవారు.

కవిగారికి కొంత సమయం ఇచ్చి కోటలో చిత్రాలు వేయమన్నారు. కొన్ని రోజులు గడిచాయి.

ఒక రోజున కవిగారు రాయలవారిని కలిశారు. తాను వేసిన చిత్రాల్ని చూడమన్నారు.

రాయలవారు చూశారు. ఏమీ కనిపించలేదు. ఖాళీ గోడలే.

"రామకృష్ణా ! గోడపై బొమ్మలు కనిపించడం లేదేమి ?" అన్నారు రాయలవారు.

"చిత్తం ప్రభూ ! చిత్రకళపై పరిజ్ఞానం గల వారికే చిత్రాలు కనిపిస్తాయి" అన్నారు కవిగారు. చిత్రకారుడు చెప్పిన మాటలే తిరిగి చెప్పాడు.


ఈ మాటలే చిత్రకారుడు విన్నాడు.

"ప్రభూ ! మన్నించండి. కొన్ని చిత్రాలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని త్వరలో పూర్తి చేస్తాను" అన్నాడు చిత్రకారుడు.

చిత్రకారుని పొరపాటును గుర్తించినందుకు రాయలవారు కవిగారిని ప్రశంసించారు.

★ ★ ★

# 18. కుస్తీ పహిల్వాన్‌తో పోటీ




హంపీ రాయలవారు విజయనగరం పాలించే రోజులలో ఢిల్లీలో బాబరు ప్రభువు పాలించేవారు. ఆ దినాలలో కుస్తీ యోధులు, కళాకారులు అన్ని ప్రాంతాలూ పర్యటిస్తూ ఉండేవారు.

ఒకరోజున బాబరు ఆస్థానంలో గల మల్ల యోధుడు విజయనగర సంస్థానానికి వచ్చాడు. "తన మల్ల విద్యను ప్రదర్శిస్తాను" తనతో పోటికి వచ్చే వారిని రమ్మన్నాడు.

కొలువుదీరిన తెనాలి రామకృష్ణ కవి లేచారు.

"నేను ఈ మల్లునితో పోటీకి వస్తాను" అన్నారు కవిగారు. కొలువు అంతా ఆశ్చర్య పోయింది.

"ఈ ఒక్క కవిని చిటికలో చిత్తు చేస్తాగా" అన్నాడు ఢిల్లీ వస్తాదు.

వెంటనే కవిగారు "నీకు జూజూ కుస్తీ పట్టు తెలుసా" అని అడిగారు కవిగారు.

ఢిల్లీ యోధుడు తెల్లబోయాడు. కాస్త ఆలోచించాడు. గుర్తుకు రాలేదు.

"రేపు వచ్చి వివరిస్తా" అని బసకు చేరాడు మల్లయోధుడు.

మల్లయోధుడు రాత్రంతా ఆలోచించాడు. ఏదీ గుర్తుకు రాలేదు. అతనికి విజయనగరంలో తెలిసిన వారెవరూ లేరు.

రాయలవారికి మరల ముఖం చూపలేక తెల్లారేసరికి విజయనగరం విడిచి వెళ్ళిపోయాడు.

రాయలవారు మరుసటి రోజున కొలువు దీరారు. రామకృష్ణకవి సభకు వచ్చారు.

వెంటనే రాయలవారు "రామకృష్ణ కవీ - జూజూ కుస్తీ - అంటే ఏమిటో వివరించు" అన్నారు.

అందుకు రామకృష్ణ కవి పకపక నవ్వారు.

"జూజూ కుస్తీ అనేది ఏదీ లేదు రాయల వారూ! ఢిల్లీయోధుని తికమక పెట్టడానికి అన్నాను. అంతే" అన్నారు కవిగారు.

కవిగారి యుక్తికి, సమయోచిత దృష్టికి ఆనందించి, ప్రత్యేక బహుమతి ఇచ్చారు.


★ ★ ★

## 19. కుంజరయూధం

శ్రీకృష్ణదేవరాయల కొలువు అష్టదిగ్గజాలతో కళకళలాడుతూ ఉండేది. రాయలవారు పండిత గోష్ఠి జరుగుతూ ఉండేవారు. పండితుల మధ్య వాదనలు ఏర్పరచేవారు.

ఒక రోజున కొలువు జరుగుతూ ఉంది. అల్లసాని పెద్దన, భట్టుమూర్తి, పిల్లలమర్రి పిన వీరభద్రుడు, తెనాలి రామకృష్ణుడు మొదలైన కవులంతా కొలువు దీర్చి ఉన్నారు.

భట్టుమూర్తి లేచి "రామకృష్ణకవీ ! నేనొక సమస్య ఇస్తాను. నీవు పూర్తి చేయగలవా ! చేస్తే నీకు మంచి బహుమతి రాయలవారిచే ఇప్పించే ఏర్పాటు చేస్తాను" అన్నారు.



"సరే" సెలవివ్వండి అన్నారు రామకృష్ణకవి భట్టుమూర్తిగారికి నమస్కరించి.

కవి భట్టుమూర్తి లేచి నిలబడి సమస్య ఇలా ఇచ్చారు.

"కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చెన్"

ఈ సమస్య వినేసరికి కవి, పండితులంతా గతుక్కుమన్నారు "ఏనుగుల గుంపు దోమ నోట్లోకి వెళ్ళడమేమిటి?"

ఎలా ఈ సమస్య తీర్చడం.

రామకృష్ణ కవి ధైర్యంగా ఉన్నారు.

క్షణం ఆలోచించారు. తనను అవమానిం చేందుకే ఈ సమస్య ఇచ్చారని భావించారు.

భట్టుమూర్తికి గుణపాఠం చెప్పాలనుకున్నారు.

రామకృష్ణకవి వెంటనే పద్యం అందుకున్నారు.

కం: గంజాయి త్రాగి తరకల
సంజాతము గూడి కల్లు చనిగొన్నావా ?
లంజల కొడకా ! యెక్కడ
కుంజర యూధంబు దోమకుత్తుక జొచ్చెన్.

ఈ పద్యం వినగానే భట్టుమూర్తి ఖంగు తిన్నారు. తనను చావుదెబ్బ కొట్టినట్లు భావించారు.

సమస్యాపూరణ కాస్త ఘాటుగా ఉంది.

రాయలవారికీ ఈ పద్యం నచ్చలేదు. భట్టు మూర్తిగారు బాధపడడం వారికి ఇష్టం లేదు.

"రామకృష్ణకవీ ఈ సమస్యకు భారత పరంగా అర్థం చెప్పు" అన్నారు రాయలవారు.

రామకృష్ణకవి చేయి తిరిగిన కవి. ఏ అర్థంలోనైనా చెప్పగలరు. ఏ ఛందస్సులోనైనా చెప్పగలరు. ఏ అలంకారం ప్రయోగించి అయినా చెప్పగలరు.

కవిగారు వెంటనే పద్యం ఆశువుగా చెప్పారు.

కం: రంజన చెడి పాండవులరి
భంజనులై విరటు గొల్వ పాల్పడిరకటా !
సంజయ ! విధి నేమందును
కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చెన్.

ఈ పద్యం రాయలవారికీ నచ్చింది. భట్టు మూర్తి గారు తమ సమస్యకు సరైన పూరణ వచ్చిందని ఆనందించారు.

విరాటుని కొలువులో పాండవులు మారు వేషంలో తలదాచుకోవడం విధి వక్రించడం కాదా! ఇది ఏనుగుల గుంపు దోమ నోట్లో దూరినట్లుంది అని చమత్కరించారు.

భట్టుమూర్తి తన వాగ్దానం ప్రకారం ఏదైనా మంచి బహుమతిని రామకృష్ణకవికి ఇవ్వమని కోరారు. రాయలవారు అలాగే చేశారు. ఆనాటి కొలువు ముగిసింది.

భట్టుమూర్తికి రామరాజభూషణుడు అనే మరొక పేరుంది. వీరు వసుచరిత్రము అనే ప్రబంధాన్ని రాశారు. ఇది తెలుగున గల ప్రసిద్ధ పంచ కావ్యాలలో ఒకటి.

★ ★ ★

## 20. అరేబియా గుర్రం అమ్మకం

తెనాలి రామకృష్ణకవి రాయలవారి చివరి దశలో కొలువులో ఉన్నారు. విజయనగరంలో మకాం పెట్టారు. కొత్త కుటుంబం పైగా వీరికో కుమారుడు. ఆ దినాలలో విజయనగరంలో అద్దెకిచ్చే ఇళ్ళు ఎక్కువగా ఉండేవి కాదు. నగరమంతా రాజప్రాసాదాలే. ఈ ప్రాసాదాలలో రాయలవారు, వారి కుటుంబ సభ్యులు ప్రధాన ఉద్యోగులు, చిన్న చితకా భృత్య గణం నివసిస్తూ ఉండేవారు. వీరు ఎలాంటి అద్దె చెల్లించవలసిన అవసరం లేదు. అన్నీ దివాణమే భరించేది. పైగా ఆ భవనాలలో వసతులు బాగా ఉండేవి. కవిగారికి పెద్దగా ఆస్తిపాస్తులు లేక పోయినా బాగా బతకాలను కునేవారు. పైకి ఆడంబరంగా కనుపించాలనే అనుకునేవారు. అలాగే ప్రవర్తించేవారు.



కవిగారు కాస్త సరదా మనిషి. రాయలవారు ప్రతినెల ఇచ్చే వేతనం సరిపోయేది కాదు. అప్పుడప్పుడు అప్పులు చేసేవారు. మరల తీర్చేవారు. ఇలా కాలం సాగిపోయింది.

ఒకసారి కవిగారికి అప్పు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రక్కవీధిలో షావుకారు వద్దకు వెళ్ళారు. షావుకారు వడ్డీకి అప్పులు ఇస్తూ ఉంటారు.

"నాకు మూడు వందల వరహాలు అప్పు కావాలి. త్వరలో తీర్చుతాను" అన్నారు కవిగారు.

"సరే ఇస్తాను. నెలకు మూడు వరహాల వడ్డీ" అన్నారు షావుకారు. షావుకారు మరో షరతు పెట్టారు. ఆరు మాసాలలో అప్పు చెల్లించకపోతే గుర్రాన్ని అప్పగించాలి. ఆనాడు రామకృష్ణకవిగారి వద్ద మంచి అరేబియా గుర్రం ఉంది. ఆ గుర్రం ఐదు వందల వరహాల ఖరీదు చేస్తుంది. షావుకారు ఆశ పడ్డారు. పని జరగాలి గదా. రామకృష్ణ కవి "సరే" అన్నాడు.

ఒప్పుకున్న విధంగా షావుకారు కవిగారికి అప్పు ఇచ్చారు. ఈ సొమ్ము కవిగారు తమ అవసరాలకు వాడుకున్నారు. చూస్తుండగానే ఆరు మాసాలు గడిచిపోయాయి.

ఒప్పుకున్న గడువు లోపల కవిగారు అప్పు తీర్చలేకపోయారు.

షావుకారు కవిగారికి కబురు చేశారు.

కవిగారు వచ్చారు. అప్పు సంగతి గుర్తు చేశారు షావుకారు.

"తప్పక ఇస్తా. నా గుర్రాన్ని అమ్మి అప్పు తీరుస్తా" అన్నారు కవిగారు.

షావుకారు అందుకు అంగీకరించారు.

గుర్రాన్ని తీసుకొని ఇద్దరు సంతకు చేరారు.

కవిగారు తమతోపాటు ఒక పిల్లిపిల్లను వెంట బెట్టుకు వచ్చారు.

బేరం ప్రారంభమైంది.

పిల్లి పిల్ల ఖరీదు 300 వరహాలు, గుర్రం ఖరీదు వరహా" అని బేరం ప్రారంభించారు.

షావుకారు తన అప్పు తీరబోతుందని సంతోషించారు. ప్రక్కఊరికి చెందిన భటుడు ఒకరు ఈ బేరం బాగుందని రెంటినీ కొని మూడువందల ఒక వరహా కవిగారికి ఇచ్చారు.

కవిగారు అందు మూడు వందలు తాను తీసుకొని, ఒక వరహా షావుకారుకు ఇచ్చారు.

షావుకారు బిత్తరపోయి "ఇదేమిటి ? ఒక వరహా ఇస్తున్నావ్" అన్నారు.

ఆ పై కవిగారు – అంతేగదా ! పిల్లిపిల్ల ఖరీదు 300 వరహాలు, గుర్రం ఖరీదు ఒక వరహా అని చెప్పాను గదా ! కనుక నీ గుర్రానికి ఒక వరహాయే వచ్చింది. తీసుకో" అన్నారు.

ఆ తరువాత షావుకారు నోటి వెంట మాట రాలేదు. ఈ విషయం కోట దాకా పాకింది.

రాయలవారి కొలువులో విచారణ ప్రారంభ మైంది. కవిగారి చమత్కారానికి నవ్వుకొని, షావుకారుకు నష్టం కలుగకుండా తమ ఖజానా నుంచి 300 వరహాలు ఇప్పించారు. కవిగారి అరేబియా గుర్రాన్ని కవిగారికి అప్పగించారు.

★ ★ ★

## 21. గుత్తివంకాయ కూర



విజయనగరంలో రాయలవారు పలు ఫల వృక్షాల తోటలతో బాటుగా, కూరగాయల తోటలనూ పెంచేవారు. రాయలవారికి గుత్తి వంకాయ కూర అంటే చాలా ఇష్టం. అందుకోసం ప్రత్యేకంగా మేలిరకం విత్తనాలు తెప్పించి వంగ తోటను పెంచారు.

ఒకరోజు కోటలో రాయలవారు మంత్రులకు, కవి, పండితులకు విందు ఇచ్చారు. ఆ విందులో గుత్తి వంకాయ కూర ప్రత్యేక వంటకం. రామకృష్ణ కవి విందుకు హాజరైనారు. ఆనందంగా విందు ఆరగించారు. కవిగారు రాత్రికి ఇంటికి చేరారు. భార్యకు విందు విషయం చెప్పారు. ఆమెకూ కోటలో పండే గుత్తి వంకాయ కూర తినాలనిపించింది.

“లేత గుత్తి వంకాయలు రాజావారి తోటలో నుంచి తీసుకురండి అంది కవిగారి భార్య.

కవిగారు ఆలోచనలో పడ్డారు. ఎలా వంకాయలు సంపాదించడం. తోటలో వాటిని దొంగిలించడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు.

ఒక రోజు రాత్రి కవిగారు వంగతోటకు వెళ్ళారు. లేత గుత్తివంకాయలను చూశారు. ఆనందించారు. గబగబా పది కాయలు కోశారు.

ఎవరూ చూడకుండా ఇంటికి తెచ్చి భార్యకు ఇచ్చి వండమన్నారు.

భార్య నూనె వేపుడుతో కమ్మని వాసన వచ్చేలా కూర తయారు చేసింది. కుటుంబం అంతా కలిసి కూర తిన్నారు. వీరితోబాటు కవిగారి కుమారుడు ముగ్గురు స్నేహితులను విందుకు పిలిచారు. అందరూ సంతోషపడ్డారు.

మరుసటి రోజు కోటలో ఒక వార్త గుప్పుమంది. “తోటలోంచి వంకాయల దొంగతనం జరిగిందని”

రాయలవారికి ఎంతో కోపం వచ్చింది. దొంగతనం ఎలా జరిగింది. ఆశ్చర్యపోయారు. దొంగను పట్టుకోవాలి అనుకున్నారు.

రాయలవారు కొలువు దీరారు. కవిగారి ఇంట్లో క్రిందటి రాత్రి వంకాయ కూర వండారని ఆరా తీశారు.

“రామకృష్ణా – వంకాయలు ఎందుకు దొంగతనం చేశావు. అడిగితే నేను ఇచ్చేవాడిని కదా!” అన్నారు రాయలవారు.

దొంగతనం చేయలేదని కవిగారు బుకాయించారు. రాయలవారికి నమ్మకం కలుగలేదు.

కవిగారి కుమారుని పిలిపించారు. “నీవు క్రిందటి రాత్రి వంకాయకూర తిన్నావా” అని అడిగారు కవిగారి కుమారుని రాయలవారు.


“తిన్నాను చాలా రుచిగా ఉంది” అన్నాడు కవిగారి కుమారుడు.

వెంటనే రామకృష్ణ కవి అందుకుని “మా అబ్బాయి వాటిని తిన్నట్లు కలగన్నాడు” అంతే అన్నారు.

ఈ విషయం పొడిగించడం ఇష్టం లేక ఆ సభ ఆనాడు ముగించారు.

★ ★ ★

## 22. రామకృష్ణకవి ఢిల్లీ ప్రయాణం



శ్రీకృష్ణదేవరాయల వారి కీర్తి ప్రతిష్టలు నలుదిశలు పాకాయి. రాయలవారు హంపి విజయనగరం పాలిస్తున్న దినాలలో ఢిల్లీ కేంద్రంలో బాబర్ ప్రభువు మొగల్ సామ్రాజ్యాన్ని పాలిస్తున్నారు. బాబర్ ప్రభువు రామకృష్ణ కవి చమత్కారాలను కర్ణాకర్ణిగా విన్నారు. కవిగారిని ఢిల్లీలో తన కోటకు పంపమని బాబర్ వర్తమానం పంపారు.

ఈ విషయం రాయలవారికి ఎంతో ఆనందం వేసింది. వెంటనే రాయలవారు రామకృష్ణకవికి కబురు పెట్టారు. కవిగారు రాయలవారి ఆస్థానానికి ఏతెంచారు.

"రామకృష్ణకవీ నీవు విజయనగరానికి కీర్తి ప్రతిష్ఠ తెచ్చిపెట్టావు. నీ పేరు దేశమంతా వ్యాపించింది. అది మొగలాయి చక్రవర్తి బాబర్‌కు తెలిసి నిన్ను వారి సంస్థానానికి ఆహ్వానించారు. నీవు ఢిల్లీ వెళ్ళి జయప్రదంగా తిరిగిరా. నీకు రెండు మూటల నాణాలు బాబర్ ప్రభువు బహూకరిస్తారు పట్టుకురా. మన రాజ్య గౌరవం నిలబెట్టు" అన్నారు రాయలవారు.

"చిత్తం" ప్రభూ అని రామకృష్ణ కవి ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. ప్రయాణంలో పలు కష్టాలు ఎదుర్కొని ఎట్టకేలకు రామకృష్ణ కవి ఢిల్లీ చేరాడు. ఒక రోజు విశ్రాంతి తీసుకున్నాడు. బాబరు కొలువుకు వస్తానని వర్తమానం పంపారు.

రామకృష్ణ కవి వస్తున్న విషయం బాబరుకు ముందే తెలుసు.

"రామకృష్ణకవి మన కొలువుకు వస్తున్నారు. అతను హాస్య చతురుడు. తన ప్రయాణంపై ఎన్ని హాస్యోక్తులు వేసినా మీరు నవ్వకండి" అని హుకుం జారీ చేశారు చక్రవర్తి.

రామకృష్ణ కవి తన సహజవేషంలో బాబరు కొలువులో ప్రవేశించారు.

ప్రభువు వారికి అభివాదం చేశారు. "మంచిది! నీవు గొప్ప హాస్య కవివని విన్నాం. నీ చమత్కార కవిత్వంలో కొన్ని చదివి వినిపించు" అన్నారు.

కవిగారు కొన్ని పద్యాలు చదివారు. ఎవరూ నవ్వలేదు. మరికొన్ని పద్యాలు చదివారు. అప్పుడూ అంతే.

తర్వాత కొన్ని హాస్యోక్తులు విసిరారు. అప్పుడూ అంతా నిశ్శబ్దం. ఎవరూ నోరు విప్పలేదు.

ఇందుకు కారణం ఏదో ఉంటుంది. రామకృష్ణకవి ఆలోచనలో పడ్డారు.

మరుసటి రోజున బాబరు ప్రభువు వాహ్యాళికి బయలుదేరారు. మార్గంలో ఒక ముదుసలి కనుపించాడు. ఆయన ఒక గోతిని తవ్వుతున్నాడు. బాబరు ప్రభువు గుర్రం దిగారు.

"ఎందుకు తాతా ముసలి వయసులో ఇంత కష్టపడుతున్నావు. గోతిని తవ్వుతున్నావు. నీవు పాతిన మొక్క పెరిగి పెద్దదై దాని పండ్లు నీవు తినగలవా ?" అన్నాడు నవ్వుతూ ప్రభువులవారు.

"ప్రభూ ! మా పూర్వులు నాటిన మొక్కలు, పెద్దవై, చెట్లయి కాయలు కాచినందున, నేను నాటిన మొక్క పెద్దదై, కాయలు కాస్తే మా బిడ్డలు తింటారు గదా ! ఆనందంగా ఉంటారు గదా" అన్నాడు ముసలి.

అందుకు ప్రభువువారు సంతసించి ముదుసలికి ఒక వరహాలమూట దానంగా ఇచ్చి, ముదుసలి వాని సంకల్పాన్ని ప్రశంసించారు.

అందుకు ముదుసలి సంతసించి "ప్రజలు మొక్క నాటి ఎప్పటికో కాయలు, ఫలాలు పొందుతారు. కాని నాకు మొక్క నాటిన రోజే ఫలితం లభించింది. ప్రభువులు చాలా గొప్పవారు" అని ప్రశంసించాడు.

ఇందుకు బాబరు ప్రభువుకు ఎంతో ఆనందం కలిగి మరో నాణేల మూట బహూకరించారు.

మొక్క నాటిన రోజు రెండు బహుమతులు లభించినందుకు ఎంతో ఆనందించాడు. ముదుసలి ప్రభువుగారు గుర్రం ఎక్కి వెళ్ళిపోయారు.

మరుసటి రోజు బాబరు ప్రభువు మరల కొలువు దీరారు. మరల కొలువు అంతా నిశ్శబ్దం.

"ప్రభూ నిన్న మొక్కలు నాటుతుండగా చూచిన ముదుసలిని నేనే. మీరు నాకు రెండు మూటల నాణేలు బహుమతిగా ఇచ్చారు" అన్నారు రామకృష్ణకవి.

కవిగారి యుక్తికి మెచ్చి బాబరు ప్రభువు మరో మూట నాణేలు ఇచ్చారు. రాయలవారు కనీసం రెండు మూటలు నాణాలనైనా తీసుకురమ్మన్నారు. నేడు మూడు మూటలు లభించాయి అని ఎంతో ఆనందించారు.

★ ★ ★

## 23. మాయమైన గులాబీలు



తెనాలి రామకృష్ణకవి విజయనగరంలో స్థిరపడ్డాక కుటుంబాన్ని తీసుకెళ్ళారు. కవిగారికి ఒక కుమారుడు.

ఒకరోజున కవిగారితో వారి కుమారుడు కోటలోకి వెళ్ళాడు. అచట గులాబి తోట ఉంది. కుమారుడు తోట చూశాడు.

చాలా అందంగా ఉన్నాయి. గులాబి పూలు మంచి వాసన వేస్తున్నాయి.

వెంటనే ఒక గులాబి పూవును తుంచాడు. దీన్ని భటులు చూశారు. వెంటనే కవిగారి కుమారుని పట్టుకున్నారు. దీన్ని దొంగతనంగా గుర్తించి కోటలోకి తీసుకువెళ్ళే ప్రయత్నంలో ఉన్నారు.

దారిలో కవిగారు కనిపించి ఏమిటి సంగతి అన్నారు. "మీ అబ్బాయి కోటలోని తోటలో గులాబి పూవును తుంచాడు. ఎవరి అనుమతి లేదు. ఇది దొంగతనం. అందుచేత రాయలవారి వద్దకు తీసుకు వెళ్తున్నాం" అన్నారు భటులు.

"మా అబ్బాయి అటువంటి పనులు చేయడు" అని సర్ది చెప్పబోయారు కవిగారు.

"అదేమి కవిగారు మీ అబ్బాయి చేతిలో గులాబీలన్ని ఉన్నాయి గదా" అన్నారు భటులు.

కవిగారు బాలుని తలపై శాలువ కప్పి, గులాబీలను తినమని చెవిలో చెప్పారు. కుమారుడు అలాగే చేశాడు.

అందరూ రాజస్థానానికి చేరారు. రాయలవారు కొలువు దీరారు.

మంత్రి పుంగవులు, కవి పండితులు అచట ఉన్నారు. రాయలవారు బాలుని ఉద్దేశించి "నీవు తోటలోని గులాబి పూలు కోశావా ? అందుకు ఎవరి అనుమతి పొందావు" అని గద్దించారు బాలుడు ప్రభువుగారికి వంగి నమస్కరించాడు.

"ప్రభూ నేను గులాబీలు కోయలేదు. మా తండ్రిగారిపై అసూయతో మీ భటులు మా పై నేరారోపణ చేశారు. కావాలంటే చూడండి" అని తలపై శాలువను తీశాడు.

భటులు వచ్చి తనిఖీ చేశారు. గులాబీలు కన్పించలేదు. ఆశ్చర్యపోయారు. గులాబీలు ఏమైనట్లు ? వారి సందేహం తీరలేదు.

"క్షమించండి ప్రభూ" అంటూ వేడుకున్నారు భటులు. రాయలవారికి ఇందలి కిటుకు అర్థం కాలేదు.

"రామకృష్ణా ! జరిగిన విషయం చెప్పు" అన్నారు రాయలవారు.

కవిగారు జరిగిన వాస్తవం పూసగుచ్చినట్టు చెప్పారు. కవిగారి తెలివి తేటలకు, సమయస్ఫూర్తికి రాయలవారు మెచ్చుకున్నారు.

★ ★ ★

# 24. రామకృష్ణుని సూక్ష్మబుద్ధి



తెనాలి రామకృష్ణుడు రాయలవారి కొలువులో స్థిరపడ్డారు. ప్రతిరోజూ కొలువుకు వచ్చేవారు. వచ్చిన ప్రతిరోజూ ఏదో వింతపని చేస్తూ – కొలువును నవ్వులతో ముంచెత్తేవారు. ఇది నిత్యకృత్యం.

ఒక రోజున కవిగారు సభకు ఆలస్యంగా వచ్చారు. "ఎందుకాలస్యం అయింది" అని రాయల వారు అడిగారు.

"మా అబ్బాయి మారాం చేశాడు. వాడిని సముదాయించి వచ్చేప్పటికి ఆలస్యం అయింది" అని ప్రభువుకు మనవి చేశారు. వెంటనే ప్రభువు "ఏమి – రామకృష్ణా బిడ్డలను సముదాయించడం అంత కష్టమా ! నీవు నిజం పలకడం లేదు" అన్నారు.

"నిజం ప్రభూ ! చిన్న పిల్లలను సముదాయించడం చిన్న పనికాదు. చాలా కష్టమైన పని, ఓ పట్టాన చెప్పిన మాట వినరు. పైగా ఏడుపు లంకించుకుంటారు. ఆపరు. ఓదార్చి వచ్చేసరికి ఆలస్యం అయింది" అని మనవి చేశారు.

ఆ మాటలకు రాయలవారు నమ్మలేదు. కవిగారు ఏదో దాస్తున్నారని రాయలవారు భావించారు.

అయితే "ప్రభూ నా బాధ ప్రత్యక్షంగా వివరిస్తా. మీరు తండ్రిగా నటించండి, నేను చిన్న పిల్లవాడుగా నటిస్తా" అన్నారు కవిగారు.

"సరే – అలాగే" అన్నారు రాయలవారు.

రామకృష్ణుడు పిల్లవాడిలా మారాం చేయడం మొదలు పెట్టాడు. ముందుగా బెల్లం మిఠాయి తెమ్మన్నాడు.

సరే బెల్లం మిఠాయి తిన్నాడు.

మారాం మరల మొదలుపెట్టి, ఏడుపు లంకించుకుని – బజారుకు తీసుకువెళ్ళమన్నాడు.

సరే అని బజారుకు బయలుదేరారు. దారిలో ఏనుగు కనిపించింది. ఏనుగును ఎక్కించ మన్నాడు. వెంటనే ఆ ఏనుగును ఎక్కించారు – బాలుడుగా నటిస్తున్న రామకృష్ణని.

ఆ బాలుడు అంతటితో ఆగలేదు. బజార్లో ఒక సంచికొని పెట్టమన్నాడు.

సరి అని – ఒక సంచి కొని ఇచ్చారు, పిదప ఆ బాలుడు సంచీలో ఏనుగును పెట్టమన్నాడు.

రాయలవారు "సంచిలో ఏనుగు ఎలా పడుతుంది. వీలుపడదు. ఇంకేమైనా కోరుకో" అన్నారు. పిల్లవాడు వినలేదు. మరల ఏడుపు లంకించుకున్నాడు.


రాయలవారు విసిగిపోయి "పిల్లల కోర్కెలు మనం తీర్చలేం. నీవు ఆలస్యంగా కొలువుకు వచ్చిన కారణం అర్థం చేసుకున్నాను" అని అన్నారు. సభ అంతా గొల్లుమని నవ్వింది.

★ ★ ★

# 25. ఇత్తడి బిందె చచ్చిపోయింది

రాయలవారి దర్శనం లభించింది. వారి ఆదరణతో రామకృష్ణుడు కొంతకాలం హంపి విజయనగరంలో ఉన్నారు. వీరి ఇంట్లో జరిగే ఒక వేడుక సందర్భంలో రెండు బిందెలు కావలసి

వచ్చాయి. వెంటనే విజయనగరంలో అద్దెకిచ్చే ఆసామి వద్దకు పోయాడు. రెండు బిందెలు రోజుకు రూపాయి వంతున అద్దెకు తీసుకున్నాడు.




రామకృష్ణుని ఇంట వేడుక పూర్తయింది. రామకృష్ణుడు రెండు బిందెలను, మూడో రోజున బాడుగ అద్దెకిచ్చిన ఆసామికి భద్రంగా ఇచ్చారు.

ఆసామికి ఒక ఆలోచన వచ్చింది. రామకృష్ణ కవి అమాయకుడని భావించాడు. నీకు ఇచ్చినవి మూడు బిందెలు – మూడో బిందె ఏది – అని దబాయించాడు ఆసామి.

రామకృష్ణుడు ఈ విషయం రాయలవారికి కొలువులో ఫిర్యాదు చేశారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి రాయల వారు ఇద్దరినీ విచారించారు. "ఏం జరిగింది రామకృష్ణ కవీ" అని అడిగారు.

వెంటనే కవిగారు "ఆసామి మూడు బిందెలు ఇచ్చిన మాట వాస్తవమే. కానీ నేను తెచ్చిన రెండో రోజున ఒక బిందె చచ్చిపోయింది" నేనేం చేసేది అన్నారు.

"బిందె చనిపోవడం ఏమిటి" అన్నారు రాయలవారు.

"అంతే ప్రభూ నాకు రెండు బిందెలు అద్దెకిచ్చి మూడు బిందెలు ఇచ్చానని ఆసామి అబద్ధం ఆడుతుంటే – మూడోబిందె చావక ఏం జేస్తుంది. చస్తుంది కదా !" అన్నారు కవిగారు.

రాయలవారు ఆసామిని నిలదీశారు. ఆసామి చేసిన తప్పు అంగీకరించారు.

తప్పు ఒప్పుకున్నారు గనుక శిక్ష తప్పింది. ఆ దినం సభ అంతటితో ముగిసింది.

★ ★ ★

## 26. చెట్టెక్కిన రామకృష్ణుడు

రామకృష్ణుడు హంపి విజయనగరంలో రాయలవారి కొలువులో ఉన్న కాలంలో రోజూ ఏదో వింత చేసేవాడు. ఒక్కోసారి రాయలవారిని విసిగించేవాడు, బాధ కలిగించేవాడు.




రామకృష్ణుడు చేసిన తిక్కపనికి రాయలవారికి బాగా కోపం వచ్చింది. "వెంటనే రామకృష్ణ కవిని పిలిచి నా రాజ్యం విడిచి వెళ్ళిపో" అన్నారు.

కవిగారు "చిత్తం ప్రభూ" అంటూ కొలువు విడిచిపెట్టి వెళ్ళిపోయారు.

కొన్నాళ్ళ తరువాత రాయలవారు వేటకు వెళ్ళారు. అది చిట్టడవి. ఆ అడవిలో ఒక చెట్టుపై రామకృష్ణ కవి నక్కి దాగి ఉండడం గమనించారు. కవిగారిని కిందకు దిగమన్నారు. చేసేది లేక చెట్టు దిగారు.

"నిన్ను రాజ్యం విడిచి వెళ్ళమన్నాను గదా, నా రాజ్యంలోనే ఉంటూ చెట్టెక్కి దాక్కున్నా వేమిటి?" అన్నారు రాయలవారు.

"ప్రభూ మీ ఆజ్ఞ ప్రకారం – మీ రాజ్యం విడిచి వెళ్ళాలనుకున్నాను. ఎంతో దూరం పోయి వచ్చా, ఎటు చూసినా మీ రాజ్యమే కదా ! మరొకరి రాజ్యం కనిపించలేదు. కనుక తిరిగి వచ్చి ఇచట దాక్కున్నాను" అన్నారు కవిగారు.

వాస్తవానికి కవిగారు చెప్పిందాంట్లో వాస్తవం లేదు. అయినా రామకృష్ణున్ని యుక్తికి రాయలవారు సంతోషించి విజయనగరం తీసుకువెళ్ళారు.

★ ★ ★

## 27. మూడు బొమ్మల రహస్యం

రాయలవారు రోజూ కొలువు దీర్చేవారు. కొలువు కూటానికి మంత్రులు, సామంతులు, కవులు, పండితులు, సామాన్య ప్రజలు హాజర య్యేవారు. ఆ కొలువుకు బొమ్మలు తయారు చేసేవాడూ ఒకరోజున వచ్చాడు. వస్తూ తాను తయారు చేసిన మూడు బొమ్మలను తెచ్చాడు. దాన్ని వారికి చూపాడు.

"ప్రభు ఈ బొమ్మలలోని రహస్యాన్ని ఎవరైనా చెప్పగలరా" అని అన్నాడు. అందరూ ఆశ్చర్యంగా చూశారు. బొమ్మలలో వింతేముంది అనుకున్నారు. సభలోని పెద్దలు బొమ్మలను పరిశీలనగా చూశారు. కాని వారికేం కొత్తదనం కనిపించలేదు.

బొమ్మలు చూసేవంతు కవిగారికి వచ్చింది. కవిగారు మూడు బొమ్మలను చేత్తో తీసుకుని పరిశీలనగా చూశారు. కవిగారి తెలివితేటలు అపారం. బొమ్మల చెవులకు రంధ్రాలుండడం గమనించారు. ఏదో "క్లూ" దొరికినట్లు భావించారు.



ఒక సన్నని తీగ తీసుకున్నారు. మొదటి బొమ్మ చెవిలో మెల్లగా దూర్చారు. ఆ తీగ నోటి నుంచి బయటకు వచ్చింది.

అలాగే రెండో బొమ్మ చెవిలోనూ తీగను దూర్చాడు. చెవినుంచి బయటకు వచ్చింది.

అలాగే మూడో బొమ్మ చెవిలోనూ తీగను దూర్చాడు. ఆ తీగ బయటకు రాలేదు.

పిదప కవిగారు మూడు బొమ్మల రహస్యాన్ని ఇలా వివరించారు.

ప్రభూ – మొదటి బొమ్మలో తీగ బయటకు వచ్చింది. అంటే విన్న సంగతి దాచుకోలేదు. కనుక అలాంటి వ్యక్తికి రహస్యాలు దాచేపని అప్పగించ రాదు. అప్పగిస్తే – శత్రువుకు ఇట్టే తెలిసిపోతుంది. అతన్ని దూరంగా ఉంచాలి.


రెండో బొమ్మలో తీగ చెవి నుంచి బయటకు వచ్చింది. అంటే అతను మందబుద్ధి. ఈ చెవితో విన్నది ఆ చెవితో వదిలేస్తాడు. అలాటి వారి వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు.

మూడో బొమ్మలో తీగ బయటికి రాలేదు. అంటే ఎన్నో విషయాలు మనసులో ఉంచుకుంటాడు. బయటకు చేరవేయడు. నమ్మదగిన వాడు. అలాంటి వ్యక్తికి ఎలాంటి రాచకార్యం అయినా అప్పగించవచ్చు. అతను ప్రయోజనకారి - అని కవిగారు మూడు బొమ్మల రహస్యం వివరించారు.

ఆలోచనాత్మకమైన మూడు బొమ్మలను తయారు చేసిన బొమ్మలవానిని ప్రభువు సత్కరించారు. కవిగారినీ సన్మానించారు. ఆనాటి సభ ఆనందంతో ముగిసింది.

* * *

## 28. ప్రతిరాత్రీ స్వర్గయాత్ర



ఒకరోజున కవిగారు ఇంటి ముందు గల అరుగుపై కూర్చున్నారు. ఆ ప్రాంతంలో గల మిత్రులు, కవి పండితులు అచటకు చేరారు. ఇంతలో ఒక సన్యాసి అక్కడకు వచ్చాడు.

"భూలోకం పాపాలతో పండిపోయింది. రాత్రులు జరిగే అక్రమాలు భరించలేం. కనుక ప్రతిరాత్రి స్వర్గానికి వెళ్ళి, అచట విశ్రాంతి తీసుకుని మరుసటి రోజు ఉదయం భూలోకానికి వస్తుంటాను" అని బడాయిలు పలికాడు సన్యాసి.



ఇదంతా రామకృష్ణకవి విన్నారు. సన్యాసికి బుద్ధి చెప్పాలనుకున్నాడు. సన్యాసిని పిలిచి కూర్చోమని చెప్పాడు కవిగారు.

సన్యాసి కూర్చున్నాడు. ఆ తరువాత కవిగారు "మీరు నాలుగో స్వర్గానికి ఎప్పుడైనా వెళ్ళి వచ్చారా!" అన్నారు. నాలుగో స్వర్గం ఉందేమో - చూడలేదంటే నవ్వుకుంటారేమో - అని తటపటాయించాడు సన్యాసి.

"వెళ్ళకేం... నిన్నరాత్రే నాలుగో స్వర్గానికి వెళ్ళి ఈ ఉదయమే వచ్చా" అన్నాడు సన్యాసి.

సన్యాసి బుకాయిస్తున్నాడని కవిగారు భావించారు. అతని భరతం పట్టాలనుకున్నారు.

"సరే స్వామీ - ఏటిగట్టున ఇసుక మీకు ఏమైనా మెత్తగా తగిలిందా ?" అని సన్యాసిని అడిగారు కవిగారు.

"తగలకేం, మెత్తగా మైనం ముద్దలాంటి పదార్థం తగిలింది. కాని అది విపరీతమైన దుర్వాసనతో కూడుకొని ఉంది" అన్నాడు సన్యాసి.

"అది నా గుర్రపు లద్దె. రాత్రి నేనూ నాలుగో స్వర్గానికి వెళ్ళి వచ్చాను. నాలుగో స్వర్గం అంటే గుర్రపు లద్దె వేసే చోటు కదా".

సన్యాసి ఈ వాస్తవం గమనించాడు. తన బడాయి మాటలు తెలిసి పోయాయని తల వంచుకున్నాడు. అలా ఆ దినాలలో తెలివితేటలతో రామకృష్ణుని ఓడించగలవారుగాని, దీటైనవారు గాని ఆనాడు లేరు.

* * *

## 29. రాయలు వారి చలోక్తి

రామకృష్ణకవికి హంపి విజయనగరంలో ఉన్న దినాలలో పుత్ర సంతానం కలిగింది. పుత్రుడు ఐదేళ్ళ వాడయ్యాడు. తండ్రిలా తెలివైన వాడు. చురుకైనవాడు. వాడికి రాయలవారి కొలువు చూడాలనిపించింది, తండ్రికి ఈ విషయం చెప్పాడు.



కవిగారు అందుకు అంగీకరించారు. ఒక రోజున రాయలవారి కొలువుకు వెళ్ళేటప్పుడు కుమారుని తీసుకెళ్ళారు. కొలువులో ప్రవేశించగానే కవిగారి పుత్రుడు రాయలవారికి సాష్టాంగ ప్రమాణం చేశాడు. తదుపరి లేచి నిలబడ్డాడు.

రాయలవారు ఆ బాలుని వినయ విధేయతలు చూసి ఎంతో ఆనందించారు. చేంతలో ఉన్న ఒక హారాన్ని బాలునికి ఇవ్వబోయారు. బాలుడు తీసుకోలేదు.

"ఎందుకు తీసుకోవు" అని రాయలవారు అడిగారు.

"తీసుకుంటే అమ్మ కోప్పడుతుంది" అన్నాడు బాలుడు.

"ఎందుకు" అన్నాడు రాయలవారు.

"ముక్కూ మొహం ఎరగని వాళ్ళ దగ్గర ఏమీ తీసుకోకూడదు – అని చెప్పింది" మా అమ్మ అన్నాడు బాలుడు.

"నాకు ముక్కు, మొహం ఉన్నాయి కదా. రాజును కదా ! తీసుకో" అన్నారు రాయలవారు.

అవును కదా – అని నీళ్ళు నమిలాడు బాలుడు.


చివరకు రాజుగారిచ్చిన కానుక తీసుకోక తప్పలేదు.

★ ★ ★

# 30. తాతాచార్యులవారి అబద్ధం

తాతాచార్యులవారు, రామకృష్ణ కవి రాయల వారి కొలువులో ఉండేవారు. ఇద్దరూ హంపి విజయనగరంలో ఉండేవారు. పైగా ప్రక్క ప్రక్కన గల ఇళ్ళలో ఉండేవారు. అంతేగాదు తాతా చార్యులవారు పెద్ద పిసినారి. ఎలాగోల సంపాదిం చడమే గాని పైసా ఖర్చు చేయరు.

ఒక రోజున రామకృష్ణకవి తాతాచార్యుల వారికి వినపడేలా ప్రార్థిస్తూ "భగవంతుడా ! నేను ఆర్థిక ఇబ్బందిలో ఉన్నాను, నాకో నూరు వరహాలు ప్రసాదించు స్వామీ. అందుకు ఒక్కటి తక్కువైనా నాకు వద్దు స్వామి" అన్నారు.



ఈ మొర తాతాచార్యులవారు పూర్తిగా విన్నారు. రామకృష్ణ కవిని ఆట పట్టించాలి – అని అనుకున్నారు. తన ఇంట్లో ఉన్న తొంబై వరహాలను మూటగట్టారు. ఎవరికీ తెలియకుండా రామకృష్ణ కవి ఇంట్లో జారవిడిచారు. రామకృష్ణకవి దీన్ని గమనించాడు. మూటను తీసుకుని లెక్కించాడు. సరిగా తొంబై వరహాలే ఉన్నాయి. మిగతా పది వరహాలు కూడా ఇవ్వవా స్వామీ అని పెద్దగా ప్రార్థించాడు.

ఈ ప్రార్థన తాతాచార్యులవారు విన్నారు. "రామకృష్ణ ఒక్క వరహా తగ్గినా తీసుకోనన్నావు పది తగ్గాయి కదా ! ఎలా తీసుకున్నావు, నేనే ఆ డబ్బు మీ ఇంట్లో జారవిడిచా" నా సొమ్ము నాకివ్వు అన్నారు తాతాచార్యులు. తాతాచార్యుల వారి తిక్క కుదర్చాలని రామకృష్ణకవి ఎదురు తిరిగారు.

"పక్కింట్లో ఎవరైనా డబ్బు మూట జార విడుస్తారా ! ఈ డబ్బంతా నాదే" అన్నారు కవిగారు.

తాతాచార్యులవారికి రామకృష్ణ కవి ధోరణి అర్థం అయింది.

"రాయలవారి వద్దకు వెళదాం. వారే న్యాయం చేస్తారు" అని అన్నారు తాతాచార్యులవారు.

అపుడు రామకృష్ణ కవి మరో పేచీ పెట్టాడు. నా గుర్రం మేతకు పోయింది, నడిచే ఓపిక నాకు లేదు. అయితే తాతాచార్యులవారు రామకృష్ణుని యుక్తి భగ్నం చేయాలని – కొలువుకు వచ్చేందుకు తన గుర్రాన్ని పంపారు. తాతాచార్యులవారి గుర్రంపై కవిగారు కొలువుకు వచ్చారు.


ఇద్దరూ కొలువులో హాజరైనారు. ఎవరిగోడు వారు చెప్పుకున్నారు. అందుకు కవిగారు "ప్రభూ నా పాపం ఏమీ లేదు. ఎవరైనా డబ్బు మూటను ప్రక్క ఇంట్లోకి విసిరేస్తారా ? ఆచార్యుల వారికి మతిభ్రమణం కలిగింది. ఇంకాసేపుంటే నేను ఎక్కి వచ్చిన గుర్రం కూడా తనదే అనేట్లున్నారు" అన్నారు. వినయంగా రాయలవారు కవిగారి మాటలు నమ్మారు. తాతాచార్యుల వారిదే తప్పన్నారు. ఆచార్యులవారు తలదించు కున్నారు. కవిగారు ఆనందంతో ఇల్లు చేరారు.

★ ★ ★

# 31. ఖరీదైన లెంపకాయ

రామకృష్ణ కవి కొంతకాలం విజయ నగరంలో ఉన్నారు. ఒకరోజున రాజవీధి గుండా వెళ్తున్నారు. వెనుకనుంచి గుర్తు తెలియని వ్యక్తి ఒకరు వచ్చి – వీపుమీద బలంగా గుద్దాడు. ఆ దెబ్బకు కవిగారు క్రింద పడిపోయారు.

వెంటనే రాజభటులు గుద్దిన వాడిని పట్టు కున్నారు. రామకృష్ణకవిని పైకి లేపారు. సేద తీర్చారు. "నీవు కవిగారిని ఎందుకు గుద్దావు" అని రాజభటులు అతన్ని అడిగారు.



"నా మిత్రుడు వెనుక నుంచి చూస్తే అచ్చం మీలాగే ఉంటాడు వాడనుకుని కవిగారిని పొరపాటున గుద్దాను" అన్నాడు.

గుద్దినవాడు నేరం చేశాడని రాజభటులు భావించారు. ఇద్దరినీ రాయలవారి కొలువులో ప్రవేశపెట్టారు.

ఇద్దరినీ రాయలవారు విచారించారు. తప్పు చేసిన వాడిని దండించాలని తలచాడు.

రామకృష్ణకవిగారిని పిలిచి "నీవు అతనిని ఒక లెంపకాయ కొట్టు, అంతేగాక ఒక రూపాయి అపరాధ రుసుం కూడా తీసుకో" అన్నారు.

"ప్రభూ! ఈ తీర్పు నాకు నచ్చలేదు ఎందుకంటే అపరాధ రుసుం ఒక రూపాయి మాత్రం అంటే మా అమ్మ నమ్మదు. రాజుగారి కొలువులో కనీసం పదిరూపాయలైనా ఇవ్వరా ! ఇస్తారు" అంటుంది మా అమ్మగారు.

రాజుగారు తన స్థాయి గుర్తుకు తెచ్చుకుని కవిగారికి పది రూపాయలు ఇవ్వక తప్పలేదు.

బలమైన గుడ్డు తిన్న – కవిగారికి ఇలా కలిసి వచ్చింది. ఇలాగున విజయనగరంలో రోజుకో వింత జరుగుతుండేది.

★ ★ ★

## 32. రామకృష్ణుని ప్రభుభక్తి



విజయనగరంలోనే తెనాలి రామకృష్ణ కవి నివాసం. రాయలవారు ఏర్పాటు చేసిన నివాసం. ఒక రోజున కవిగారు ఇంట్లో ఉండి కవితా వ్యాసంగంలో ఉన్నారు. ఇంతలో అపరిచితుడైన ఒక వ్యక్తి వచ్చి, తెనాలి నుంచి వచ్చానని, కొన్ని రోజులు అతిథిగా ఆశ్రయం ఇవ్వమనీ వేడుకున్నాడు. ఇతను ఎవరోగాదు రాయలవారు పంపిన గూఢచారి, రామకృష్ణకవి ప్రభుభక్తి పరీక్షించాలి అనుకున్నాడు.

ఆ వ్యక్తి కొన్ని దినాలు పోయాక వచ్చిన అపరిచిత వ్యక్తి తాను వచ్చిన పని రహస్యంగా చెప్పాడు. "తనకు రాయలవారిని హత్య చేయాలని ఉందని" కవిగారు ఆశ్చర్యపోయారు. ఎలా తప్పించాలని యోచన చేశారు. వెంటనే రాయలవారికి లేఖ రాస్తూ "నా ఆరోగ్యం బాగాలేదు. మీలాగా వేషం వేసి ఒక వ్యక్తిని, మీ భటులతో పంపండి. ఈ విషయం అతి రహస్యంగా ఉంచండి" అని రాశారు.

ఇందు ఏదో గోప్యం దాగి ఉందని రాయలవారు గమనించి రాయలవారి వేషం వేసి ఒకరిని, భటులతో పంపారు.

రాయలవారు భటులతో రామకృష్ణుని ఇంటికి రావడం గమనించి, తలుపు చాటున దాక్కుని రాయలు వేషంతో ఉన్నవారిని కత్తితో పొడిచే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని భటులు గమనించి హత్యా ప్రయత్నం నివారించారు. అపరిచితుని రాయల కొలువుకు తీసుకువెళ్ళారు.

రాయలవారు ఆ విధంగా రామకృష్ణ కవి గారి ప్రభుభక్తిని పరీక్షించారు.

★ ★ ★

## 33. అద్దంలో భగవంతుడు

తెనాలి రామకృష్ణ కవి వికటకవిగా ప్రసిద్ధి చెందారు. రాయలవారి కొలువులో అందరినీ వినోదపరచడం వారి పని. ఏదో ఒక చమత్కారంతో రాయలవారిని నవ్వించడం వారి వంతు.

ఒక రోజున కవిగారు రాయలవారితో "ప్రజలు కాస్త సమయం చిక్కితే చాలు అబద్ధమాడతారు" అని మనవి చేశాడు.

"నీవు ఎలా చెప్పగలవు? ప్రజలు ఏదైనా సందర్భాన్ని బట్టి అబద్ధం చెప్పి ఉండవచ్చు. కాని ఎప్పుడూ అబద్ధం చెప్పరు కదా !" అన్నారు రాయల వారు.

"కాని రాయలవారూ – అబద్ధం చెప్పనివాడు సృష్టిలో ఉండరు" నమ్మండి – అన్నారు కవిగారు. "నీవు ఉరామరికగా చెప్పద్దు, రాజుగా నేనెప్పుడు అబద్ధం చెప్పలేదు" అన్నారు రాయలవారు.




"నేను నిరూపిస్తా" అన్నారు కవిగారు.

"నిరూపించు మరి" అన్నారు రాయలవారు.

"అయితే నాకు వెయ్యి బంగారు నాణేలు ఇవ్వండి. ఒక సంవత్సరం సమయం ఇవ్వండి" అన్నారు కవిగారు.

అందుకు రాయలవారు అంగీకరించారు.

ఈ నాణాలు కోశాగారం నుంచి తీసుకుని రామకృష్ణకవిగారు ఏడాదిపాటు సభలో కనిపించ లేదు. ఈలోగా కవిగారు అందమైన ఇల్లు నిర్మించుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇంట్లో గోడకు పెద్ద అద్దం అమర్చారు. ఇతర గోడలపై చిత్రాలు గీయించారు. ఏడాది పూర్తయింది. ఇల్లు పూర్తి అయింది.

ఇంతలో రామకృష్ణ కవి స్వామీజీగా వేషం మార్చుకున్నాడు. రాయలవారి ఆస్థానంలో ప్రత్యక్షం అయ్యారు. రాయలవారు స్వామీజీని గుర్తించలేదు. కవిగారు ఇలా చెప్పారు.

"ప్రభూ ! నేనొక అందమైన ఇల్లు నిర్మించు కున్నాను. ప్రతిరోజు ఒక గదిలో కూర్చుని దైవాన్ని ప్రార్థిస్తాను. నా భక్తికి మెచ్చి దేవుడు ప్రతిరోజు నా గదిలో దర్శనం ఇస్తున్నారు. మీరు వచ్చి చూడవచ్చు. అయితే ఎవరు పవిత్రమైన జీవితం గడుపుతారో, ఎవరైతే జీవితంలో ఒక్కసారి కూడా అబద్ధం చెప్పరో వారికే దర్శనమిస్తారు".

రాయలవారు సన్యాసి ఇల్లు చూసేందుకు అంగీకరించారు. రాజావారు ఇందలి వాస్తవం తెలుసుకునేందుకు ఒక మంత్రిని పంపించారు. మంత్రిగారు ఆ ఇంటికి వచ్చి గోడకు బిగించిన అద్దం చూశారు. అద్దంలో తన నిలువెత్తు రూపం చూసుకున్నారు. కాని భగవంతుడు కనిపించలేదు. రాయలవారికి నిజం చెప్పేందుకు భయపడి "రాయలవారూ, సన్యాసి చెప్పింది నిజం, సన్యాసి ఇంట్లో భగవంతుని చూశాను" అన్నాడు.

ఎందుకైనా మంచిదని రాయలవారు మరో మంత్రిని పంపారు. రెండో మంత్రీ "దేవుని చూసిన అనుభవం అద్భుతం" అని వర్ణించి అబద్ధం చెప్పాడు. అపుడు రాయలవారు "నేను వెళ్ళాలి, నిజం తెలుసుకోవాలి అనుకున్నారు" స్వామీజీ ఇంటికి వెళ్ళారు.

అద్దం ముందు నిలబడ్డారు. తన రూపు చూసుకున్నారు.

అబద్ధం చెప్పని వారికి భగవంతుడు కనిపిస్తారని - స్వామీజీ చెప్పారు గదా ! నాకు భగవంతుడు కనిపించలేదని చెబితే - నేను అబద్ధం ఆడినట్లే గదా" అని యోచన చేశాడు.

రాయులవారు బయుటకు వచ్చారు. స్వామీజీతో ఇలా చెప్పారు. "స్వామీ మీరు చెప్పింది నిజం, నేను భగవంతుణ్ణి మీ ఇంట చూశాను" ఇది నిజమా, అన్నారు స్వామీజీ, 'నిజమే' అన్నారు మరల అడిగాడు స్వామీజీ, అదే సమాధానం చెప్పారు - రాయలవారు. పైగా రాయల వారికి ఈసారి కోపం వచ్చింది.

కవిగారు స్వామీజీ వేషం తీసి వేశారు. రాయల వారు ఆశ్చర్యపడ్డారు.

"మీరు అబద్ధం చెప్పలేదు అన్నారు కదా మీరే ఎలా అబద్ధమాడారో చూశారు గదా" మా ఇంట్లో

భగవంతుడు లేనే లేడు. కేవలం అద్దం మాత్రమే ఉంది. మోసానికి అందరూ అబద్ధం చెప్పారు. అంతే, రాయలవారూ తమ తప్పిదాన్ని అంగీకరించారు.

కానుకగా కవిగారు నిర్మించుకున్న ఇల్లు – కవిగారికే చెందేలా హుకుం జారీ చేశారు.

★ ★ ★

## 34. నిజాయితీపరుడెవరు ?



రాయలవారి సంస్థానంలో కొలువు యథా విధిగా జరుగుతుంది. మామూలు ధోరణిలో రాయలవారు మాట్లాడుతూ, ధనవంతులు నిజాయితీ పరులనీ, పేదవారు నిజాయితీ లేనివారనీ చెప్పారు. పేదరికం నిజాయితీ లేకుండా చేస్తుందని చెప్పారు.

అందు తెనాలి రామకృష్ణ కవి అంగీకరించ లేదు. ఇందుకో పరీక్ష పెడదాం అన్నారు. అందుకు రాయలవారు అంగీకరించారు.

ఈ పరీక్ష నిమిత్తం ఒక్కొక్కటి వంద వరహాలు గల రెండు మూటలు ఇవ్వమని రాయలవారిని కోరాడు. ఖజానా నుంచివాటిని వెంటనే ఇప్పించారు రాయలవారు.

కవిగారు ఒక వరహాల మూట రహదారి పక్కన కనబడేటట్లు క్రిందకు జారవిడిచాడు. మరుసటి దినం ఒక ధనవంతుడు ఆ బాటను నడుస్తూ... వరహాల మూటను చూశారు.

"ఆహా నేనెంత అదృష్టవంతుణ్ణి, ఇదంతా లక్ష్మీదేవి కటాక్షం కదా" అని సంతోషించి ఆ మూటనుఇంటికి తీసుకెళ్ళిభద్రంగా దాచుకున్నాడు.

మరొకరోజు మరో మూట కవిగారు రోడ్డు ప్రక్కనే విడిచారు. ఆ దినం ఆ రోడ్డు ప్రక్కన వెడుతున్న పేదరైతు ఆ మూట చూసి ఎంతో ఆనందించాడు.

ఎవరో దురదృష్టవంతుడు ఈ మూట పోగొట్టు కున్నాడు. వారికెంత అవసరమో అనుకున్నాడు. ఆ మూటను వెంటనే రాయలవారి ఖజానాకు అప్పగించి, ఎవరిదో తెలుసుకుని అందజేయ మన్నాడు.

మరుసటి రోజు కొలువు జరిగింది అందరూ కొలువుకు హాజరయ్యారు.

ఒక మూట మాత్రం రాజావారి ఖజానాకు చేరినట్లు తెలిసింది.

రెండో మూట సంగతి తెలియదు. రాయల వారు నగరంలో దండోరా వేయించారు. రెండో మూట అప్పగింపకపోతే కఠిన దండన ఉంటుం దని చెప్పారు.

మరుసటి రోజు ఒక ధనవంతుడు రాయల వారి ఆస్థానానికి వచ్చి, నేను వ్యాపారంలో చాలా నష్టపోయాను, నా ప్రార్థన మన్నించి లక్ష్మీదేవి నాకీ ధనం ఏర్పాటు చేసింది" అన్నారు.

"నీవెందుకు ఈ మూట ఖజానాలో అప్ప గించలేదు" అన్నారు రాయలవారు.

"నా కోసం లక్ష్మీదేవి పంపితే నేనెలా అప్ప గించగలను. అందుకు నా మనసు అంగీకరించ లేదు" అన్నాడు.

"నీవు తప్పు చేశావు. ఆ సొమ్ము నీదికాదు. నీవు దండనార్హుడవు" అని రాయలు తీర్పు ఇచ్చారు.

ధనవంతుడు రాయలవారి పాదాలపై పడి క్షమించమని కోరాడు.

అప్పుడు రామకృష్ణ కవి అన్నారు "చూశారా! రాయలవారూ – పేదవాడు ఎంత నిజాయితీపరుడో, ధనవంతుడు ఎంత గుణహీనుడో" అన్నారు.

ధనవంతుని క్షమించి వదిలేశారు. ఆ సభ అంతటితో ముగిసింది.

★ ★ ★

## 35. పుచ్చుకోవడమే గాని, ఇవ్వడం తెలియని మంత్రి



విజయనగరంలో రామకృష్ణ కవి ఒక చెరువు గట్టున ఉన్న ఇంట్లో ఉండేవారు. ఆ చెరువు గట్టున నడుస్తున్న మంత్రివర్యులు కాలుజారి చెరువులో పడిపోయారు.

ఆ చెరువులో నీరు ఎక్కువగా లేదు. నీట మునిగి చనిపోయే ప్రమాదం లేదు. అయినా నీటిలో సహజంగా ఉండే జలచరాలు కూడతాయే మోనని భయపడిపోయాడు.

ఇంతలో జనం చెరువు చుట్టూ చేరారు. మంత్రి గారిని కాపాడలనుకున్నారు.

మంత్రిగారూ "మీ చెయ్యి ఇవ్వండి బయటకు లాగుతాం" అన్నారు. మంత్రిగారికి వారి మాటలపై నమ్మకం కలుగలేదు.

ఇంతలో రామకృష్ణకవి వచ్చారు. చెరువు గట్టుకు పోయి తన చెయ్యి చాపి, తన చెయ్యి పట్టుకోమని కోరాడు. అలా మంత్రిగారు కవిగారి చేయి పట్టుకుని ఒడ్డుకు సురక్షితంగా చేరారు.

అయితే జనమంతా తెల్లబోయారు. ఉదయం నుంచి "మీ చెయ్యి ఇవ్వండి బయటకు లాగుతాం" అని మంత్రిగారిని ఎంతకోరినా చెయ్యి ఇవ్వలేదు, చివరకు రామకృష్ణకవి మాట విన్నారు.

చెరువు గట్టున చేరిన ఒక పెద్దాయన "మంత్రిగారు మాకు చెయ్యి ఎందుకు ఇవ్వలేదు" అని కవిగారిని అడిగారు.

అందుకు కవిగారు నవ్వి "మరేం లేదు మీరంతా చెయ్యి ఇవ్వండి" అన్నారు. నేనేమో "నా చెయ్యి పుచ్చుకోండి" అన్నాను. అంతే తేడా, వాస్తవం ఏమంటే మంత్రిగారికి ఏదైనా పుచ్చుకోవడమేగాని, ఇవ్వడం తెలియదన్నమాట" అన్నారు కవిగారు.

అందరూ గొల్లున నవ్వారు.

★ ★ ★

## 36. గంజితాగే పిల్లి

ఒకరోజు శ్రీకృష్ణదేవరాయల వారికి స్నేహితుడైన ఒక రాజు కొన్ని పిల్లులను పంపాడు. శ్రీకృష్ణదేవరాయల వారు ఆ పిల్లులను ఎవరన్నా పెంచితే వాటి పోషణాభారం కోశాగారం నుండి తీసుకోవచ్చని చెప్పారు.


కొంతమంది రాజోద్యోగులు ముందుకు వచ్చి తలా ఒక పిల్లిని తీసుకున్నారు.

రాజోద్యోగులతో పాటుగా తెనాలి రామ లింగడు కూడా ఒక పిల్లిని పట్టుకుపోయాడు.

పిల్లి పోషణకు సంబంధించి శ్రీకృష్ణదేవ రాయలు ఇస్తానన్న మొత్తాన్ని ప్రతినెలా అందరి కంటే ముందుగా వచ్చి పట్టుకు పోసాగాడు రామ లింగడు.

ఒకరోజు ఏదో పని మీద నంది తిమ్మన రామలింగడి ఇంటికి వెళ్ళాడు.

ఆ సమయంలో రామలింగడు పిల్లికి పాలు బదులు చల్లార్చిన గంజి పొయ్యటం ఆయనే స్వయంగా చూసాడు.



మరుసటి రోజు శ్రీకృష్ణ దేవరాయల వారిని ఏకాంతంగా కలుసుకుని రామలింగడు పిల్లికి గంజి పోస్తూ ధనాగారం నుండి ప్రతినెలా దాని పోషణ నిమిత్తం కేటాయించిన మొత్తాన్నీ పట్టుకు పోతున్నాడని చెప్పాడు.

అప్పుడు శ్రీకృష్ణదేవరాయలవారు విస్తుబోయి..

"పిల్లి గంజి తాగటమా....!?" అనడిగారు.

"అవును ప్రభూ...! నా కళ్ళతో స్వయంగా చూసాను. కావాలంటే రామ లింగడిని పిలిపించి అడగండి. అతడు దానికి గంజితో సరిపెట్టి తను దానికి కేటాయించిన మొత్తం దొంగలిస్తున్నాడు" అంటూ తను చెప్పవల్సింది చెప్పి జారుకున్నాడు.

శ్రీకృష్ణదేవరాయలకి ఈ విషయం ఏదో తేల్చు కోవాలనిపించింది. అదే సమయానికి మహామంత్రి తిమ్మరుసు ఆయనతో ఏదో విషయం మాట్లాడ టానికి వచ్చాడు.

"విన్నారా అప్పాజీ.. మన రామలింగడు పెంచుకుంటానికి తీసుకు పోయిన పిల్లికి పాలు బదులు గంజిని పోసి దాని కడుపు మాడుస్తు న్నాడట..ఈ సంగతి మన తిమ్మన వారు స్వయంగా చూసారట... రామలింగడు ఏదో కొంటెవాడులే అని క్షమించి వదిలేస్తే అతడి కొంటెదనం నోరులేని జీవాల మీద కూడా చూపిస్తున్నాడు..." అన్నారు కోపంగా.

"తొందరపడకండి ప్రభూ..! రామలింగడు మరీ అంత దుర్మార్గుడు కాదు. ఇందులో ఏదో రహస్యం ఉంది.. మనం తెలుసుకుందాం" అంటూ నచ్చ చెప్పాడు అప్పాజీ.

మరుసటిరోజు భువనవిజయంలో శ్రీకృష్ణదేవ రాయలవారు "రామలింగా...! నీవు తీసుకు వెళ్ళిన పిల్లికి పాలు కాక గంజి పోస్తున్న మాట నిజమేనా?" అంటూ నిలదీసి అడిగారు.

రామలింగడు కొంచెం కూడా తడబడకుండా "నిజం ప్రభూ..." అంటూ చెప్పాడు.

"ఎందుకని..? ఆ పిల్లి పోషణకు కావలసిన ధన మొత్తం ధనాగారం నుండి నెలనెలా తీసుకు పోతూనే ఉన్నావుగా...గంజితో దాన్ని పోషిస్తు న్నప్పుడు నీవు ధనం తీసుకోవటం మోసం చేసే ఉద్దేశంతోనే కదా..?" అంటూ శ్రీకృష్ణ దేవరాయలు కోపంగా ప్రశ్నించాడు.

రామలింగడు ఏమాత్రం భయపడకుండా...

"ప్రభూ..! ఎవరో గిట్టని వాళ్ళు నాపైన మీకు అబద్ధాలను చెప్పి ఉంటారు. వారం క్రితం వరకు

నే తీసుకుపోయిన పిల్లి నిక్షేపంగా పాలు, పెరుగు, వెన్న వంటివి అన్నీ జుర్రుకు త్రాగేది.

సరిగ్గా వారం క్రితం దానికి ఏమయ్యిందో ఏమో? పాలు చూస్తేనే మొహం చిట్లించు కోసాగింది. పాలు ముందు పెట్టినా త్రాగను కూడా త్రాగకుండా పస్తులుండసాగింది. అది అలా పస్తులుండటం చూడలేక ఒకరోజు దాని ముందు గంజి పెట్టాను.

ఆ గంజి దానికి అమృతంలా తోచిందో ఏమో లొట్టలేసుకుంటూ త్రాగింది. మరునాడు మళ్ళీ పాలను పెట్టినా త్రాగలేదు... గంజినీళ్ళే కావాలంది. ఇందులో నా తప్పేం ఉంది ప్రభూ... పస్తులతో పిల్లిని చంపలేక గంజినీళ్ళనే దానికి పోస్తున్నాను. కావాలంటే వెంటనే పిల్లిని తెచ్చి తమ ముందు ఉంచుతాను. తమరు పరీక్షించుకోవచ్చు" అంటూ చెప్పాడు.

"పిల్లి పాలు వద్దనుకుని గంజి త్రాగటమా... సరే వెంటనే పిల్లిని తెప్పించు... మేం పరీక్షిస్తాం..." అంటూ ఆజ్ఞాపించారు శ్రీకృష్ణదేవరాయలవారు.

వెంటనే రామలింగడు ఒక సేవకుడిని ఇంటికి పంపి పిల్లిని తెప్పించి రాయల వారి ముందు పెట్టాడు.

రాయలువారు ఒక వెండి పాత్ర నిండా పాలను తెప్పించి పిల్లి ముందు పెట్టగా పిల్లి కనీసం ఆ పాల దరిదాపులకు కూడా పోకుండా భయంతో మ్యావ్... మ్యావ్.. అని అరుస్తూ దూరంగా జరగసాగింది.

ఆ దృశ్యం చూసిన వారందరికి రామలింగడు చెప్పినది నిజమే అన్న నమ్మకం కుదిరింది.

వెంటనే రాయలవారు మరొక పాత్రనిండా గంజి తెప్పించి పెట్టగా ఆ పిల్లి ఆ గంజి నీళ్ళను ఆవురావురుమంటూ కడుపునిండా త్రాగింది.

రాయలవారికి రామలింగడిని ఏమనాలో అర్థం కాక "రామలింగా... నన్ను క్షమించు. కళ్ళతో చూసింది తిమ్మనాచార్యులు నమ్మారు. చెవులతో విన్నది నేను నమ్మాను. ఇందులో నీ తప్పు ఏమీలేదు..." అన్నాడు.

"దానిదేముందిలే ప్రభూ.. కళ్ళతో చూసేవి... చెవులతో వినేవి ఏవీ నిజం కాదు..." అంటూ మెత్తగా నవ్వాడు.

"సరే... కళ్ళ ముందు మొత్తానికి ఏదో గారడీ చేసావనే మనసుకు బలంగా తోస్తున్నది. పిల్లి జాతి లక్షణం పాలు త్రాగడం దానిని మానిపించి దాని చేత గంజి నీళ్ళను త్రాగించగలిగిన నీవు తిరిగి దాని చేత పాలను త్రాగించటం కూడా సాధ్య మవుతుంది. ఆ పిల్లితో పాలు త్రాగించు నీకు వెయ్యి బంగారు వరహాలనిస్తాను అన్నాడు రాయలు.

"క్షమించండి ప్రభూ.. నేను ఏ గారడీ చెయ్య లేదు. ఆ పిల్లి నిజంగా పాలు త్రాగటం మానేసింది"

"రెండు వేల బంగారు వరహాలిస్తాను..."

రామలింగడు ముసిముసిగా నవ్వుతూ....

"ప్రభువుల వేలం పాటను మొదలు పెట్టి నట్లున్నారు. శ్రీకృష్ణదేవరాయలు వారికి ఎంత జంతుప్రేమ ఉన్నా... ఈ రామలింగడిపైన నమ్మకము ఉన్నా పాలు మానిన పిల్లి చేత పాలు త్రాగించడం సాధ్యమా...?" అంటూ మెత్తగా నవ్వాడు.

"రాయలవారు బహుమానం రెట్టింపు చెయ్య గానే దాన్ని ఇంకా రెట్టింపు చేద్దామన్న చిలిపి ఆలోచన కలిగింది రామలింగడికి. అందుకే అలా అన్నాడు.

"సరే.... అయిదువేల వరహాలిస్తాను" అన్నారు రాయలువారు.

"అలాగే ప్రభూ... ఒక్క వారం గడువివ్వండి. పిల్లితో గంజినీళ్ళను మానిపించి పాలు త్రాగించే

బాధ్యత నాది" అంటూ శ్రీకృష్ణదేవరాయలవారికి హామీ ఇచ్చి పిల్లిని చంకన పెట్టుకుని ఇంటి ముఖం పట్టాడు.

రాయలవారికి రామలింగడికి జరిగిన సంభాషణ అంతా విన్న అప్పాజీ దారిలో రామలింగడిని కలుసుకుని..

'రామలింగా... పిల్లిని పాలు త్రాగటం మాన్పించావు కదా... ఇప్పుడు మళ్ళీ ఎలా త్రాగిస్తావు చెప్పు..?" అంటూ ప్రశ్నించాడు.

"చల్లని పాలు... వేడి గంజి" అన్నాడు రామలింగడు.

అప్పాజీకి అర్థం కాలేదు.... అప్పుడు రామలింగడు పిల్లితో పాలు మాన్పించిన వైనాన్ని ఇలా చెప్పాడు.

"అప్పాజీ ఈ పిల్లి బాగా తిండిపోతు.. ఎప్పుడూ దీనికి పాల మీద, పెరుగు, వెన్నల మీదే ధ్యాస.. అందుకే ప్రతిరోజూ బాగా వేడి చేసిన పాలు దీని ముందు పెట్టాను... దెబ్బకి ఇది పాలను చూసి మూతి కాలుతుందని మానేసింది.

వారం రోజుల తరువాత ఒక గిన్నెలో వేడి పాలు, మరో గిన్నెలో చల్లని గంజి పెట్టాను. ఇది పాలు మాని గంజి త్రాగటానికి అలవాటు పడిపోయింది.

ఇప్పుడు దీనికి వేడి గంజి.. చల్లని పాలు పెడితే సరి. గంజి మాని పాలు త్రాగుతుంది" అని చెప్పగానే అప్పాజీ పెద్దగా నవ్వేస్తూ "మొత్తానికి పిల్లితో పాలు మాన్పించటంలో కూడా నీ కొంటెతనం చూపించావు" అంటూ రామలింగడిని అభినందించకుండా ఉండలేకపోయాడు.

# 37. నవరసాలు

శ్రీకృష్ణదేవరాయలు వారి సాహితీ సభలో ఎంతోమంది కవులు ఉన్నా భువన విజయంలోనూ, రాయలవారి మనసులో మన తెనాలి రామలింగడికి ఉన్న స్థానమే వేరు.

అందుకు కారణం..

రామలింగడి హాస్యచతురతే..!

రామలింగడు ఎక్కడ ఉన్నా నవ్వులు పూయిస్తాడు..

మాటల్తో..చేష్టలతో నవ్వుల జల్లులు కురిపించ గలడు, హాస్య వర్షం సృష్టించగలడు.

రామలింగడంటే కొందరు కవులకు ద్వేషం... మరికొందరి కవులకు భయం. అయినా రామ లింగడు ఏరోజూ తన పద్ధతిని మార్చుకోలేదు.. ఎవ్వరి ముందు ఓటమి ఒప్పుకుని తలవంచనూ లేదు.

ఒకరోజు...

భువన విజయంలో సాహితీ ప్రసంగాలు జరుగు తున్న సమయంలో రాయలవారు కల్పించుకుంటూ...

"సభాసదులారా! ఎంతో కాలంగా మా మనసులో ఒక్కరోజైనా చక్కని కథా కాలక్షేపం చేయాలన్న కోరిక కదలాడుతునే ఉన్నది. నేటికి ఆ కోరిక తీర్చుకోవాలన్న బుద్ధి కలిగింది కనుక మీలో ఎవ్వరైనా చక్కని కథను చెప్పి మా మనసును రంజింప చెయ్యగలిగితే బంగారు వరహాలతో తులాభారం తూచి వారిని సత్కరిస్తాను...." అంటూ చెప్పారు.

వెంటనే...

అప్పాజీ కల్పించుకుని సభికులను ఉద్దేశించి...

"సభికులారా ! రాయలవారు కోరుకున్నట్లే అటువంటి కోరిక నా మనసు నందు కూడా ఎంతో కాలంగా గూడు కట్టుకుని ఉంది. నవరసాలు కలిసిన కథను ఎవరన్నా చెబితే ఇంకా ఎంతో బాగుంటుంది....."

మళ్ళీ శ్రీకృష్ణదేవరాయలు వారు మాట్లాడుతూ...

"అప్పాజీ కోరిక ప్రకారం నవరసాలు కల గలసిన కథను చెప్పిన వారికి రెండు సార్లు తులా భారం తూయిస్తాను. ఈ పోటీలో పౌరులు, రాజో ద్యోగులు, కవులు ఎవరైనా పాల్గొన వచ్చును. కానీ వారెవ్వరైనా సరే విజయనగర వాసులు అయి ఉండాలన్నది మాత్రమే మా షరతు..." అంటూ గంభీరంగా చెప్పారు రాయలవారు.

రాయలవారి మాటలకి భువన విజయం మొత్తం ఒక్కసారి నిశ్శబ్దం ఆవహించింది.

మళ్ళీ ఖంగుమంది రాయలు వారి కంఠం....

"ముందుగా అవకాశం సభికులకి.. ఆ తరువాత రాజోద్యోగులకి. ఆఖరుగానే కవులకి.. ముఖ్యంగా అందరికంటే చివరి అవకాశం రామ లింగడిది" అంటూ రామలింగడి వంక చిరునవ్వుతో చూసారు.

రామలింగడు తక్కువ తిన్నాడా...?

వినయంగా తలవంచి నమస్కరిస్తూ..

"ప్రభువులకు నాపై ఉన్న నమ్మకానికి ధన్యవాదాలు. తమ ఉద్దేశం ప్రకారం కథ చెప్పే అవకాశం నా వరకూ వస్తుందనే కదా... అంటూ మెత్తగా నవ్వాడు.

రాయలవారు గతుక్కుమన్నారు...

రాయలవారు రామలింగడిని ఉడికిద్దామని కావాలనే రామలింగడిది ఆఖరి అవకాశం అన్నారు. కానీ ఆఖరులో ఉన్నవాడి దాకా అవకాశం పోయిం దంటే ముందున్న వాళ్ళు ఎవ్వరూ నవరసాలు ఉన్న కథను చెప్పి ప్రకటించిన బహుమానం పొందలేరని అర్థం స్ఫురిస్తుందన్న విషయాన్ని మర్చిపోయారు.

దొరికితే వదులుతాడా రామలింగడు... ఎంతట వారిపై నైనా ఒంటి కాలి మీద యుద్ధానికి పోతాడు. ఆ సమయంలో రాజయినా.. బంటయినా ఎవరయినా అతడికి ఒకటే.

ఇలా రాయలు వారు ఆలోచించుకుంటుండ గానే రామలింగడు తిరిగి....

"ప్రభూ.. నా మాటలు మిమ్మల్ని బాధిస్తే క్షమించండి. తమరు ఆజ్ఞాపించినట్లే కథను చెప్పే అవకాశం మనవారందరూ చివరి వరకు నాకు మిగిల్చి ఇస్తే తప్పకుండా తమరు కోరినట్లుగానే నవరసాలు ఉన్న కథను చెప్పి తమ మనసును రంజింప చేస్తానని హామీ ఇస్తున్నాను" అంటూ చెప్పి కూర్చున్నాడు.

రామలింగడి మాటలకు అష్ట దిగ్గజములలో మిగతా కవులకు తలకొట్టేసి నట్లయింది.

"ఈ రామలింగడికి ఎంత పొగరో.. ఈ సభ మొత్తంలో మనతో పాటు మూడువేల మంది ఉన్నారు. ఇంత మందిలో ఒక్కరు కూడా ప్రభువుల మనసును రంజింప చెయ్యగల కథను చెప్పలేరనేనా ఇతగాడి ఉద్దేశం. ఎంత పాండిత్య మున్నా ఇంతటి అహంకారం పనికిరాదు.



తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు ఇంత కాలం రాయలువారు ఈ రామలింగడిని భుజాల మీదకు ఎక్కించుకున్నాడు కదా అందుకనే ఈ రోజు ఏకంగా రాయలవారి మాటలనే తప్పు పట్టి పరువు

తీసాడు....” అంటూ ఎప్పట్నుంచో రామలింగడి మీద మనసులో దాచుకున్న ఉక్రోషం మొత్తాన్ని వెళ్ళగ్రక్కాడు ధూర్జటి.

“అవునవును.. అయినా రామలింగడిది ఆఖరి అవకాశం. అందరిని వదిలేసినా కథను చెప్పే అవకాశం మనల్ని దాటి రామలింగడి దగ్గరకు పోనివ్వకుండా ఉంటే సరి. అదే కుక్క కాటుకు చెప్పు దెబ్బ అవుతుంది” అంటూ మెత్తగా నవ్వాడు నంది తిమ్మన.

కవులలో ఒకరితో ఒకరు గుసగుసలాడు కుంటుండగానే పోటీ ప్రారంభిస్తున్నట్లు ఘంటా నాదం మ్రోగింది.

సభికుల చప్పట్ల మధ్యన కథల పోటీ ప్రారంభ మైంది. ముందుగా అవకాశం సభికులదే కనుక వారిలో ఒక వృద్ధుడు ముందుకు వచ్చి కథను ప్రారంభించాడు.

ఆ తరువాత మరికొంత మంది సభికులు రకరకాల కథలను చెప్పారు కానీ ఎవ్వరూ రాయల వారిని మెప్పించలేకపోయారు.

తరువాత వంతు రాజోద్యోగుల కొచ్చింది.

ఎవరికి తోచిన కథను వారు చెప్పసాగారు కానీ అవన్నీ కూడా చప్పగానే ఉన్నాయి.

రాయలవారిని అటు సభికులు గానీ ఇటు రాజోద్యోగులు గానీ తమ కథలతో మెప్పించలేక పోవటంతో ఇక తదుపరి వంతు కవులకు వచ్చింది.

రాయలవారు కవులవంక చూస్తూ...

“కవుల్లారా! ఈ వంతు మీదే. మీలో ఎవరో ఒకరు తులాభార సత్కారం పొందుతారని ఆశిస్తున్నాను.. ఆ అదృష్టాన్ని నాకు కలిగించండి” అంటూ కవుల వైపుకు ఓ చూపు విసిరాడు. ముందుగా పెద్దన, తరువాత తిమ్మన ఆ తరువాత మిగతా కవులందరూ తలా ఒక కథను చెప్పారు కానీ ఆ కథలలో ఒకటి రెండు రసాలు తప్పితే మిగిలిన రసాలు లేవు..

శ్రీకృష్ణదేవరాయలు పెదవి విరిచారు.

ఆఖరి వంతు రామలింగడిది...

అప్పాజీ రామలింగడి వంక చూస్తూ...

“రామలింగా... నువ్వుకోరుకున్నట్లే కథను చెప్పి మెప్పించే అవకాశం అందరిని దాటుకుని నీ వరకు వచ్చింది.. ఇక నీదే ఆఖరి వంతు.. కథను ప్రారంభించు..” అంటూ ముసిముసిగా నవ్వాడు.

రామలింగడు లేచి నిలబడి రాయల వారికి, అప్పాజీకి, మిగిలిన కవులకి.. రాజోద్యోగులకి.... సభికులకి.. అందరికీ నమస్కరించి...

“మీరందరూ నన్ను క్షమించండి.... వరహాల తులాభారం కోసం ఈ అవకాశం నా వరకు రావా లని నేను కాచుక్కూర్చొన లేదు.. అయినా అవకాశం వచ్చింది. కనుక తులాభార దృశ్యం మీ కన్నుల కింపు కల్గించటానికి నా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాను....

కథను ప్రారంభించమంటారా....?” అంటూ సభికులను ఉద్దేశించి అడుగుతూ కవుల వైపు ఓరగా చూసాడు.

కవుల మొహాలు మాడిపోయి ఉన్నాయి.

నిలువెత్తు బంగారు నాణేల రాశిని ఏదో ఒక మాయ చేసి రామలింగడు తమ కళ్ళ ముందే తన్నుకుపోతాడన్న విషయం గ్రహించే కవులందరూ అలా మొహాలు మాడ్చుకున్నారు.

సభికులు కథను ప్రారంభించమన్నట్లు చప్పట్లు చరిచి తమ సమ్మతి తెలియచేసారు.

అప్పుడు రామలింగడు ఇలా చెప్ప సాగాడు...

“పూర్వం వీరుడు, ధీరుడు సకల ఐశ్వర్య వంతుడయిన ఒక రాజు ఉండేవాడు.

ఆయనకి తొమ్మిది మంది పట్టపురాణులు...

ఆ రాజుకి అన్నీ ఉన్నా సంతానం లేదు...

తొమ్మిది మంది రాణులలో ఒక్క రాణి కూడా ఒక్క నలుసు కనకపోవటంతో ఆ రాజు గారు మనోవ్యాధితో రాజ్యపాలన మీద ఆసక్తి తగ్గించు కున్నారు.

కాలం గడుస్తోంది...

ఒకనాడు...

త్రిలోకసంచారి అయిన నారదమహర్షి ఆ రాజును చూడవచ్చి రాజు మనోవ్యాధికి కారణం తెలుసుకుని...

"రాజా! చింతించకు. పూర్వం దశరథ మహారాజు కూడా సంతాన భాగ్యం కోసం పుత్ర కామేష్ఠి యజ్ఞం చేసాకే సంతానం కలిగింది.

నీవు పుత్రకామేష్ఠి యజ్ఞం చెయ్యక్కర్లేదు ఈ రాజ్యానికి తూర్పున ఉన్న జగదాంబా ఆలయానికి నీ భార్యలతో సహా వెళ్ళి కుంకుమార్చన చేయి. నీకు తప్పకుండా సంతానం కలుగుతుంది..." అంటూ చెప్పి తన దారిన తాను వెళ్ళిపోయాడు.

నారదమహర్షి మాటలతో ఆ రాజుకి ధైర్యం వచ్చి మర్నాడే సతీసమేతంగా జగదాంబా ఆలయానికి వెళ్ళి పూజలు జరిపించాడు.

పదినెలలు గడిచేసరికి తొమ్మిది మంది రాణులకు తొమ్మిదిమంది పుత్రులు జన్మించారు.

రాజు ఆనందానికి అంతే లేదు...

ప్రజలందరూ పెద్ద పండగ చేసుకున్నారు.

రాజకుమారులకి జాతకకర్మలు నిర్వర్తించి నామకరణం చేసే సమయానికి ఊడిపడ్డాడు నారదమహర్షి.

రాజు.. రాణులు నారదమహర్షి పాదాలకు మ్రొక్కి....

"మహానుభావా! నీ ఉపదేశం వల్లనే మాకు సంతాన భాగ్యం కలిగింది కనుక మా పుత్రులం దరికీ మీరే నామకరణం చేసి ఆశీర్వదించండి.." అంటూ ప్రార్థించారు.

ఈ బిడ్డ పేరు 'శాంతం' అన్నాడు.

రెండవ బిడ్డపేరు 'రౌద్రం' అన్నాడు...

వెంటనే ధూర్జటి లేచి 'మూడవబిడ్డ పేరు "బీభత్సం" నాలుగవ బిడ్డ పేరు 'హాస్యం' అంటూ పెట్టాడు నారద మహర్షి, అంతేనా రామలింగ కవీ..." అంటూ అడ్డు తగిలాడు.

రామలింగడు ధూర్జటి మాటలకి చిరునవ్వులు చిందిస్తూ..

"అరే... సరిగ్గా చెప్పారు.. ఈ కథ మీకూ తెలుసన్నమాట. ఇంకేం మిగిలిన కథను తమరు పూర్తి చెయ్యండి. తులాభార బహుమానం చెరి సగం పంచుకుందాం.." అంటూ కూర్చుండి పోయాడు రామలింగడు.

ఖంగుతిన్నాడు ధూర్జటి.

రామలింగడు నవరసాలను రాజు గారి కొడుకులకు పేరులుగా నారద మహర్షి పెట్టాడని చెప్పటంతో అతడిని దెబ్బతీద్దామని మిగతా రసాల పేర్లను చెప్పాడు కానీ తను వేసిన బాణం తిరిగి తనకే వచ్చి తగిలింది.

రామలింగడు ఆ కథను ఎటు మెలికలు తిప్పు తాడో తనకేం తెలుసు.... తొందరపడి నోరు జారినందుకు నిండు సభలో తనని నిలువ పాత రేసేసాడు.

మిగతా కవుల వైపు చూసాడు...

నీ ఖర్మ..! రామలింగడి మాటలకు అడ్డు దూరటం కంటే రోట్లో రోకటి పోటు సుఖంగా ఉంటుందని తెలియదా నీకు..? నీకంటే పాండిత్యం ఉన్న మేమే నోరు మూసుకుని కూర్చుని ఉంటే తగుదునమ్మా అంటూ నువ్వు అడ్డం పోతావా? అనుభవించు... అన్నట్లు చూసారు అంతా.

ధూర్జటి వెంటనే తడబడుతూ...

"అయ్యో..! ఇదేదో నాకు తెలిసిన కథ కదా అనుకున్నాను. తరువాత కథ నాకు జ్ఞాపకం రానిదే...మిగిలిన కథను కథకుడు పూర్తి చెయటమే సబబుగా ఉంటుంది...." అంటూ చప్పున కూర్చుండి పోయాడు.

తిరిగి రామలింగడు లేచి నిలబడి "మన ధూర్జటి మహాశయుడు చెప్పినది నిజమే. నారద మహర్షి అయిదవ పిల్లవానికి 'గంభీరం' అని, ఆరవవానికి 'శృంగారం' అని ఇలా మిగిలిన వారికి 'ఆశ్చర్యం, భయానకం, విషాదం, ఆనందం'... అంటూ పేర్లు పెట్టాడు.

నారద మహర్షి యువరాజులకు పెట్టిన పేరులన్నీ చిత్రవిచిత్రంగా అనిపించటంతో రాజు ఆశ్చర్యపడి...

"మహానుభావా! నా కుమారులకు తమరు పెట్టిన పేరులన్నీ విచిత్రంగా ఉన్నాయి...

ఈ పేరుల వెనుక ఏదైనా మర్మం ఉన్నదా." అంటూ వినయంగా అడిగాడు.

నారద మహర్షి నవ్వి...

"రాజా! ఈ పేరులు వెనుక ఏ మర్మమూ లేదు. నా బుద్ధి నా నోటితో పలికించిందే పలికాను. అయినా నీ బిడ్డలకు నేను పెట్టిన ఈ పేరులన్నీ ఈలోకంలో నవరసాలుగా ప్రసిద్ధి పొందుతాయి" అని దీవించి వెళ్ళిపోయాడు.

ఆనాటి నుండి ఆ రాజుగారి తొమ్మిది మంది పుత్రులు నవరసాలుగా లోకప్రసిద్ధి పొందారు... అంటూ చెప్పటం ముగించాడు తెనాలి రామలింగడు.

రాయలవారు మౌనంగా ఉండిపోయాడు.

"రాజా... నేను చెప్పిన కథలో నవరసాలు ఉన్నాయా...?" అంటూ అడిగాడు రామలింగడు.

రామలింగడి ఎత్తు రాయలవారితో పాటు కవులందరికీ అర్థమయ్యింది. రామలింగడి కథలో ఏ రసం లేదన్నా రాజుగారి కొడుకుల పేర్లు చెబుతాడు.

రాయలువారు అప్పాజీ వంక చూసాడు.

అప్పాజీ సైగతో భువన విజయంలో రామ లింగడికి తులాభారం తూయించారు.

మొత్తానికి అన్నట్లుగానే రామ లింగడు కథను చెప్పి రాయల వారిని మెప్పించి తులా భారంలో తూగి బంగారు నాణేలను పట్టుకుపోయాడు.

## 38. పరాభవం

ఒకరోజు రామలింగడి భార్యకు అన్న వరస అయిన బంధువు ఏడేళ్ళ తన కొడుకును వెంట పెట్టుకుని వచ్చాడు.

పలకరింపులు అయ్యాక ఆ బంధువు రామ లింగడితో అసలు సంగతి చెబుతూ...

"బావా..! మా పిల్లవాడికి చదువు సంధ్యల మీద అస్సలు శ్రద్ధ లేదు.. ఎప్పుడూ తోటి వాళ్ళతో ఆటపాటలే... వాడిని నేను ఎప్పుడు మందలిం చాలని చూసినా వాళ్ళమ్మ అడ్డుపడుతూ "చిన్నప్పుడు మా రామలింగ అన్నయ్య కూడా చదువు సంధ్యలు లేకుండా ఆటపాటలతో కాలం గడిపే వాడుట. ఇప్పుడు రాయలువారి కొలువులో గొప్ప కవిగా పేరుతెచ్చుకోలేదూ" అంటూ నా నోరు మూయిం చేస్తుంది. నువ్వు ఏం చేస్తావో.. ఎలా చేస్తావో నాకు తెలియదు. మా వాడిని కూడా నీ అంత గొప్ప వాడిని చేసి పుణ్యం కట్టుకో... అంటూ చేతులు పట్టుకుని బ్రతిమాలాడు.

రామలింగడు ఖంగుతిన్నాడు.

ఆ తరువాత వాళ్ళ పిల్లవాడికి చదువు సంధ్యలు అబ్బకపోవటం వాడిని చిన్నప్పుడు తనతో పోల్చటంతో కాస్తంత బాధపడ్డాడు.

వచ్చింది బంధువు....

పైగా భార్య అన్న వరుస...


మొహం మీదే అతడిని ఏమైనా అంటే చేజేతులా తన కాపురంలో తానే చిచ్చు పెట్టు కున్నట్లవుతుంది. కర్ర విరక్కుండా పాము చావకుండా సమస్యను పరిష్కరించి బంధువును సాగనంపాలి.

ఇలా ఆలోచించుకుని...

"ఆ... దానిదేముంది బావా..! సాధనతో రాయిని అయినా రత్నంగా మార్చవచ్చు. కానీ మీ పిల్లవాడికి తగిన గురువును నేను కాదు. ఏదో వికటత్వం తప్ప నా దగ్గర పాండిత్యం లేదు.. ఆ హాస్యానికి తోడు కాస్తంత గడుసుదనం కూడా ఉంది కనుక రాయలవారి కొలువులో వుంటున్నాను.

మీ పిల్లవాడు చూస్తే మెత్తని వాడులా ఉన్నాడు. పాండిత్యం వంట పట్టకపోతే భువన విజయంలో రాణించటం కష్టం. అందుకే ముందు మంచి గురువును చూస్తాను.

ఆ తరువాత మంచిరోజు చూసి ఆయన శిష్యరికంలో చేరుద్దాం" అంటూ మెత్తగా చెప్పాడు.



వేరే గురువు దగ్గర చేర్చటం ఆ బంధువుకు ఇష్టం లేదు. అయినా ఆ మాటను చెప్పటానికి మొహమాటం అడ్డువచ్చి సరేనన్నాడు.

మరుసటి రోజు రామలింగడు భువన విజయానికి వెళ్తుండగా ఆ బంధువు తమ పిల్లవాడికి గురువును వెతికే విషయం గుర్తు చేసాడు.

"తప్పకుండా విచారిస్తాను.. ఈ లోపు ఆ భారం నా మీద వేసి ఐదారు రోజుల పాటు విజయ నగరం అంతా నీవు, పిల్లవాడు చూసి రండి.. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసాను" అంటూ బంధువుకు చెప్పి వెళ్ళిపోయాడు రామలింగడు.

రెండు రోజులు గడిచాయి.

వారం దాటింది...

బంధువు పిల్లవాడికి గురువును మాత్రం రామలింగడు వెతకనే లేదు.

వారం దాటాక ఓ రాత్రి....

"బావా! వచ్చి వారం అయ్యింది. అయినా నీవు మా వాడికి గురువును వెతికినట్టు లేదు" అనడిగాడా బంధువు.

"బావా నీవు నన్ను అపార్థం చేసుకున్నావు. నేను ఆ పని మీదే ఉన్నాను. రాయిని రత్నం చెయ్యాలంటే గురువు ఎంత గొప్పవాడయి ఉండాలి... ఇప్పటి వరకు నా విచారణలో అటువంటి గురువు కనిపించలేదు.. మరొక్క రోజు గడువివ్వు మీ వాడి గురువు ఎవరో తేల్చేస్తాను" అంటూ ఆ బంధువుకి ఎంతో నమ్మకంగా చెప్పాడు.

ఆ సంభాషణంతా రామలింగడి భార్య విని తరువాత ఏకాంతంలో...

"ఏమండీ... నా మేనల్లుడికి నిజంగానే మీరు తగిన గురువును వెతుకుతున్నారా?" అంటూ నిలదీసింది.

"ఎంత మాట..? ఎందుకొచ్చింది నీకా అనుమానం" అనడిగాడు.

"ఏం లేదు. మీ కొంటెతనంతో అందరినీ బురిడీ కొట్టించినట్లు మా అన్నని కూడ కొట్టిస్తున్నారేమోనని....."

"నాపై అంత అపనమ్మకమా.. ఈ తెనాలి రామలింగడిని నమ్మి చెడిన వాళ్ళు ఎవరూ లేరు"

"నిజం చెప్పండి"

"ఏం చెప్పేది. నీ మేనల్లుడికి వర్ణ మాలను తప్పు లేకుండా చదవటం కూడా రాదు.. పైగా వాడిని గమనించాను కదా వాడి కసలు చదువు మీద ధ్యాస లేకపోవటం ప్రక్కన ఉంచు. దేని మీదా అస్సలు ధ్యాస లేదు కనుక అటువంటి వాడికి గురువు కావటానికి ఏ తలకు మాసిన వాడు ఒప్పుకుంటాడు చెప్పు... అయినా అటువంటి వాడి కోసమే వెతుకుతున్నాను.... రేపే అటువంటి వాడి దగ్గరకు నీ మేనల్లుడిని పంపుతాను.." అంటూ చెప్పాడు.

"తలకుమాసిన గురువా...? ఎవరు?" అంటూ ఆశ్చర్యపోయింది రామ లింగడి భార్య.

"అవును... సరిగ్గా అటువంటి వారే...."

"అదే.. ఎవరు?"

"ఇంకెవరు.... మన తాతాచార్యులవారు" అంటూ నవ్వాడు రామలింగడు.

"తాతాచార్యుల వారా!?"

"అవును. నేను రాయలు వారి ఆశ్రయం కోరి ముందుగా ఆయనని సేవిస్తే నేను కవిని కాదని నాది కవిత్వము కాదని ఛీ కొట్టి తిరస్కరించారు. అందుకనే నేనింత గొప్ప కవిని అయ్యాను.. నీ మేనల్లుడిని కూడా ఆయన తిరస్కరిస్తే వాడు కూడా నాలుగు అక్షరం ముక్కలు నేరుస్తాడు" అంటూ నవ్వేసాడు రామలింగడు.

"అసలు విషయం తెలిస్తే మా అన్నయ్య నొచ్చుకుంటాడేమోనండి..."

"నువ్వేం బాధపడకు. విషయాన్ని అంత వరకు ఆలోచించకుండా ఉంటానా.. నేను ఏది చేసినా నీ మేనల్లుడి మంచి కోసమే వాడికి ఈ దెబ్బతో వస్తే చదువు సంధ్యలు వస్తాయి లేకపోతే ముందు ముందు ఉపయోగపడే పనీపాటా నేర్చు కుంటాడు.. అందుకు నాది హామీ....' అంటూ అప్పటికి ఆ సంభాషణను ముగించాడు రామలింగడు.

మర్నాడు ఉదయం భువన విజయానికి రామలింగడు బయలు దేరుతూ... బంధువును పిలిచి తాతాచార్యుల వారి ఇంటికి దారి చెప్పి....

"బావా! ఆయన తిట్లు కూడా దీవెనలే... వెళ్ళి మీ వాడిని శిష్యుడిగా స్వీకరించమని ఆయనని అడుగు..." అంటూ పంపాడు.

తరువాత భార్యను పిలిచి...

"మీ అన్న తిరిగి రాగనే ఊరికి ప్రయాణం అయినా కావచ్చు.. ఆపకు... ఈ లోపు వంటా వార్పు సిద్ధం చేసి ఉంచు.. రాగానే భోజనం చేసి మరీ వెళ్ళమని నా మాటగా చెప్పు" అంటూ చెప్పి వెళ్ళి పోయాడు.

రామలింగడు చెప్పినట్లే తాతాచార్యుల వారింటికి వెళ్ళిన బంధువు తిరిగి వచ్చి రామ లింగడు వచ్చేదాకా ఉండమన్నా ఉండకుండా పిల్లవాడితో ఊరికి ప్రయాణమై వెళ్ళిపోయాడు.

అక్కడ భువన విజయంలో..

తాతాచార్యుల వారు రామలింగడిని ఎగతాళి చేస్తూ....

"ఏం రామలింగా.... మీ బంధువుల పిల్లవాడికి వర్ణమాల కూడా రాదు. అటువంటి వాడిని శిష్యుడిగా నా దగ్గరకు పంపుతావా? అటువంటి వాడిని ఏ తలకుమాసిన వాడన్నా శిష్యుడిగా స్వీకరిస్తాడా....?" అన్నారు.

ఇంకేముంది రామలింగడికి తాతాచార్యుల వారు దొరకనే దొరికారు.

వెంటనే రామలింగడు ఏమాత్రం తడుము కోకుండా "అందుకే కదా తాతాచార్యా... వాడిని తమ వద్దకు పంపింది.. మీరు తిరస్కరించారు కనుకనే కదా... నేను ఇంతటి వాడినయ్యింది. అందుకనే వాడ్ని ముందుగా మీ దగ్గరకు పంపింది" అనగానే సభికులు అందరూ ముసిముసిగా నవ్వు కున్నారు.

అది గమనించి తాతాచార్యుల వారి మొహం ఎర్రబారింది.

రామలింగడిని నిండు సభలో పరాభవిద్దా మనుకుని పాపం! తాతాచార్యుల వారు తానే పరాభవం పాలయ్యారు.

## 39. బురిడీ

పూర్వ కాలంలో విజయనగరంలో దొంగల బెడద ఎక్కువగా వుండేది.

దొంగల ముఠా రాత్రుళ్ళు ఎక్కడ నుంచో హఠాత్తుగా ఊడిపడి ధనవంతుల ఇల్లు కొల్లగొట్టి పోయేవారు.


నగర వాసులు దొంగతనాల గురించి రాయల వారికి ఫిర్యాదు చేసి దొంగల బెడదను వదిలించమని కోరారు.

రాయలు వెంటనే సైన్యాధిపతిని పిలిపించి దొంగలను బంధించి తన ముందు నిలబెట్టమని ఆజ్ఞాపించాడు.

సైన్యాధిపతి నగరానికి కట్టుదిట్టమైన కాపలాను ఏర్పాటు చేసాడు.

రాత్రిపూట గస్తీకాచే సైనికులను రెట్టింపు చేసాడు. ధైర్యవంతులైన కొంతమంది యువకులు కూడా సైనికులకు తోడుగా వీధుల్లో పహరా కాయసాగారు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా దొంగతనాలు ఆగలేదు సరికదా మరింత పెరిగాయి.



రాయలవారికి ఈ విషయం తెలిసి దొంగలను పట్టుకుని అప్పగించిన వారికి పదివేల బంగారు నాణేలను బహుమతిగా ఇస్తానని ప్రకటించాడు.

రాయలువారు బహుమానం ప్రకటించటంతో ఆ బహుమతి కోసం దొంగలను పట్టుకోవటానికి నగర వాసులు ఎంతోమంది ముందుకొచ్చారు.

దొంగతనాలు ఆగిపోయాయి. దొంగలు మాత్రం ఏ ఒక్కరూ పట్టుబడలేదు.

వారం గడిచింది.

ఈ వారంలో విజయనగరంలో ఒక్క దొంగ తనం జరగక పోవటమే కాదు ఎక్కడా దొంగల అలికిడి కూడా వినిపించలేదు.

దొంగల స్థావరం విజయనగరానికి అవతల ఉన్న అడవిలోఉంది. వారుప్రతిరోజూ వ్యాపారస్తుల్లా మారువేషాలలో విజయనగరంలోకి ప్రవేశించి చడీచప్పుడు కాకుండా తమ స్థావరానికి తిరిగి వెళ్ళిపోతున్నారు.

రాయలువారు బహుమానం ప్రకటించటం, దానికి ఆశపడి రాజభటులు, నగరవాసులు కళ్ళల్లో వత్తులు వేసుకుని మరీ కాపలా కాయటంతో ఇక విజయనగరంలో దొంగతనాలుచేయటం ఏమాత్రం క్షేమం కాదని వారంరోజులు తమ స్థావరంలో ఉండిపోయారు.

దొంగతనాలు తగ్గటంతో రాజభటులు, నగర పౌరులు హాయిగా ఊపిరి తీసుకున్నారు. వారం తరువాత...

ఒకరోజు రాత్రివేళ...

ఏమాత్రం చడీచప్పుడు లేకుండా దొంగ విజయనగరంలోకి ప్రవేశించి దొంగతనం చేయ టానికి తగిన ఇంటిని వెతుకుతూ వెళ్తుండగా వారికి ఎదురుగా రాజభటులు వస్తూ కన్పించటంతో చప్పున ప్రక్కన ఉన్న ఒక ఇంటి పెరటిలోకి దూకి నక్కారు.

ఆ ఇల్లు తెనాలి రామలింగడిది.

ఆ సమయంలో రామలింగడు కావ్య రచనలో నిమగ్నమై ఉన్నాడు.

పెరడులోకి దొంగలు దూకిన చప్పుడు రామలింగడి చెవులకు చేరింది.

ఆ చప్పుడు దొంగలదే అయి ఉంటుందని సందేహం కలిగి కావ్య రచనను ఆపి పెరటి కిటికీ లోంచి తొంగిచూసాడు రామలింగడు.

పెరడులో మొక్కల చాటున నక్కిన నలుగురు దొంగల ఆకారాలు కన్పించటంతో దొంగలకు తగిన బుద్ధి చెప్పాలని ఒక కొంటె ఆలోచన చేసాడు.

కిటికి దగ్గర నుంచి తిరిగిపోయి నిద్రపోతున్న భార్యను లేపిదొంగలుతమ పెరడులోఉన్న విషయం చెప్పిఆమెఏంచెయ్యాలో.ఎలా మాట్లాడాలో చెప్పి ఇంట్లో వున్న చెత్తనంతా మూట కట్టుకుని తలుపు తీసుకుని పెరటిలోకి వచ్చాడు.

అతని వెనుకనే వచ్చింది అతని భార్య.

"ఏమండీ... ఎక్కడికి? చేతిలో ఆ మూట ఏమిటి?" అంటూ ఏమీ తెలీనట్లు అడిగింది.

"అయ్యో అరవకు. ఈ మూటలో ధనం ఉంది"

"ధనమా..!?"

"అవును రాయలవారు ఇంతకు ముందు నాకు తులాభారం తూచినపుడు నాణేలతో పాటు కొన్ని వజ్రాలను కూడా కలిపి పోసారు. నగరంలో దొంగల బెడద ఎక్కువగా ఉంది కదా.. అందుకని వాటిని తీసుకుపోయి బావిలో దాస్తున్నాను"

"వజ్రాలను ఎవరన్నా బావిలో దాస్తారా... ఈ విషయం దొంగలకు గానీ తెలిసిందంటే ఎంచక్కా బావిలోకి దిగి తీసుకుపోరు"

"నేను మరీ అంత అమాయకుడినా.. నిన్ననే బావిలో మండ్రగబ్బలని తెప్పించి వేసాను. అవి గానీ కరిచాయంటే ఎవడైనా చనిపోవలసిందే...."

"మీ తెలివి తెల్లారినట్లుంది. బావినిండా మండ్రగబ్బలు వేస్తే మనకి కావలసి వచ్చినపుడు వజ్రాలను బయటకు ఎలా తీస్తాం..."

"ఓసి పిచ్చిదానా.. ఆ మాత్రం ఆలోచన చెయ్య లేదనుకున్నావా? మనకి కావాలను కున్నప్పుడు నలుగురు మనుషులను పెట్టి నీళ్ళు తోడిస్తాను... నీళ్ళతో పాటుగామండ్రగబ్బలుబయటకు వస్తాయి.. ఆ తరువాత బావిలోకి దిగి వజ్రాల మూట బయటకు తీస్తాను.

సరే... సరే... అడిగింది చాలు విన్నది చాలు.. చెట్లకు కూడా చెవులుంటాయి.. ఇతరులకు తెలిస్తే మన సొత్తు మనకు కాకుండా పోతుంది. ముందు నువ్వు లోపలకు వెళ్ళు.." అంటూ భార్యను కసురు కున్నట్లు నటిస్తూ ఆమెను లోపలకు పంపి తను తిన్నగా పోయి చేతిలోని మూటను బావిలో పారేసి తిరిగివచ్చి తలుపు మూసేసాడు రామలింగడు.

ఈ సంభాషణ మొత్తం చెట్ల ప్రక్కన నక్కి కూర్చున్న దొంగల చెవిన పడనే పడింది.

"ఇవాళ మనం నక్కతోకను తొక్కి వచ్చాం...." అన్నాడొకడు.

"అవునవును. ఆ వజ్రాల మూటను దక్కించు కుంటే చాలు. ఇక వాటిని అమ్ముకుని జీవితాంతం మనం హాయిగా బ్రతికెయ్యవచ్చు" అన్నాడింకొకడు.

కొంతసేపటికి నలుగురు దొంగలు బావి దగ్గరకు చేరి లోపలకు తొంగి చూసారు.

ఒక దొంగ బావిలోకి దిగబోయాడు.

మరొకడు ఆపి "లోపల మండ్రగబ్బలు ఉన్నాయి కదా.. దిగకు" అంటూ హెచ్చరించాడు.

నలుగురు దొంగలు నీళ్ళు తోడి మండ్ర గబ్బలనుబయట పడెయ్యాలని నిర్ణయించుకున్నారు.

ఒకరి తరువాత ఒకరు నీళ్ళు తోడసాగారు.

అదంతా కిటికీలోంచి రామలింగడు గమ నిస్తూనే ఉన్నాడు.

దొంగలు నీళ్ళు తోడటం మొదలు పెట్టగానే భార్యకు జాగ్రత్తలు చెప్పి ముందు వైపు నుంచి రాజభటులకు దొంగల విషయం చెప్పి వారిని వెంట పెట్టుకు వచ్చి దొంగలను పట్టించాడు.

అప్పటికి దొంగలు తోడిన నీళ్ళకి రామలింగడి పెరటితోట సగభాగం తడిసింది.

పట్టుబడిన దొంగలు బావిలో వజ్రాలు, మండ్ర గబ్బలు రెండూ లేవని రామలింగడు తమని పట్టించటానికే ఎత్తు వేసాడని తెలుసుకుని తాము మోసపోయామని దిగాలు పడిపోయారు.

రామలింగడు దొంగలని చూసి నవ్వుతూ...

"బాబులూ... న్యాయమైన మార్గంలో బ్రతకని వాడికికాలం ఎప్పుడూకలసిరాదు. ఎప్పుడో అప్పుడు ఇలాంటి సత్కారమే జరుగుతుంది... నాకు ఎవ్వరి కష్టం ఉంచు కోవటం ఇష్టం లేదు. నా తోటకు నీళ్ళు తోడినందుకు ఇదిగో మీ కూలి..." అంటూ తలొక బంగారు నాణేన్నీ వారి చేతుల్లో పెట్టాడు.

దొంగలు సిగ్గుతో తలదించుకున్నారు.

మర్నాడు రాయలువారు దొంగలని పట్టు కుంటే ఇస్తానన్న పదివేల బంగారు నాణేలు బహుమానం రామలింగడికిఇచ్చి అభినందించారు.

## 40. రామలింగడి వాక్చాతుర్యం

రామలింగడికి హాస్యత్వంతో పాటు కొంటె తనము, చిలిపితనమూ రెండూ ఎక్కువే.... ఆ రెండూ లేకపోతే అతడు వికటకవి కాడు కదా.

అతడి చిలిపితనం శృతి మించినప్పుడల్లా రాయలు వారికి ఫిర్యాదులు అందుతుండేవి. ఫిర్యాదులు అన్నీ ఎంతో సహనంగా రాయలువారు వినేవారు.

ఆ తర్వాత రాయలు వారు  రామలింగడిని సమర్థించే వారు కాదు.. శిక్షించేవారు కాదు.. విని ఊరుకునే వారంతే.

ఒకరోజు రామలింగడు భువన విజయానికి ఏ కారణము చేతనో రాలేదు. సభ అంతా బోసి పోయినట్లు వుంది.

రామలింగడు సభకు రాకపోవటంతో కవు లందరూ ధైర్యంగా అతడి గురించి రాయల వారికి ఫిర్యాదులు చేయాలని నిర్ణయించుకున్నారు. రాయలు వారు సభకు రాగానే రామలింగడు కనిపించక పోవటంతో.. " ఈ రోజు రామలింగ కవి సభకు రానట్లున్నాడే" అంటూ స్వగతంలో అనుకున్నట్లే పైకి అన్నారు.

"అవును ప్రభూ...! ఏ కారణం చేతనో రామలింగడు ఈ రోజు రాలేదు" అంటూ చెప్పాడు అప్పాజీ.

భువన విజయంలో కొంతసేపు సాహితీ సమీక్షలు జరిగాక పెద్దనామాత్యులు–

"ప్రభూ! ఈ మధ్యకాలంలో మన రామలింగడి ధోరణి పూర్తిగా మారిపోయింది. ఇతర కవులను తప్పు పట్టటమో, అవమానించటమో ధ్యేయంగా భువన విజయానికి వస్తున్నాడు. కానీ అంతకు మించి మరొక పని ఉన్నట్లు నాకు తోచట్లేదు" అంటూ చెప్పాడు.

"అవును ప్రభూ....! రామలింగడు సాటి కవులమని కూడా లేకుండా తమ ముందు కూడా మాపైన ఎంత దురుసుగా ప్రవర్తిస్తున్నాడో మీకు తెలియంది కాదు. కాస్త తమరే రామలింగడిని మందలించాలి" అంటూ చెప్పాడు ముక్కుతిమ్మన.

ఇక మిగతా కవులందరూ కూడా రామ లింగడిపై తలొక రకంగా ఫిర్యాదులు చేసారు.

అందరి ఫిర్యాదులు విన్నాడు రాయలు వారు.

ఆ తరువాత...

"కవుల్లారా...! ఇంతకాలం రామలింగడు తన చిలిపి చేష్టలతో కొంటె మాటలతో సభను రక్తి కట్టిస్తున్నాడనుకుంటున్నాను. కానీ అతడి ప్రవర్తన మిమ్మల్ని ఇంతగా బాధిస్తోందని ఎప్పుడూ భావించ లేదు.



రామలింగడి ప్రవర్తన వలన మీరింతగా బాధపడుతున్నందుకు పరోక్షంగా నేను కూడా కారకుడిననిపిస్తోంది.

కనుక నన్ను క్షమించండి" అంటూ రాయలు వారు మనస్పూర్తిగా కవులందరినీ క్షమాపణలు కోరుకున్నారు.

కవులందరికి కొంత ఆత్మ సంతృప్తి కలిగింది.

రాయలు వారంతటి వారు రామలింగడి విషయంలో తనది తప్పు అని ఒప్పుకున్నాక ఇక ఊరుకుంటారా? ఇక రామలింగడి మీద ఒకటి కాదు వంద ఫిర్యాదులు చేసారు.

అన్నీ ఎంతో ఓపిగ్గా విన్నాక రాయలు వారు....

"కవులారా... రామలింగడు మీ మనస్సులను ఇంతగా బాధించినందుకు శిక్షగా నేటి నుండి అతడు భువనవిజయంలో ఒక్క పలుకు కూడా పలుక రాదు. మౌనంగా ప్రేక్షకుడిలా పక్షం రోజులు సభికుల మధ్యన కూర్చోవాలి... ఇది నా ఆజ్ఞ" అంటూ అప్పటికప్పుడు సేవకుడిని పిలిచి రామలింగడి ఇంటికి పోయి ఆ ఆజ్ఞను చెప్పి రమ్మని పంపాడు.

ఆ సేవకుడు పోయి రామలింగడికి రాయలు వారు చెప్పమన్నట్లే చెప్పి వచ్చాడు.

రాయలు వారు అలా ఆజ్ఞాపించటానికి కారణం ఏమిటో రామలింగడికి అర్థం కాలేదు.

భువన విజయంలో ఘంటను మ్రోగించే రాజోద్యోగి పేరు చందురుడు. అతడి వయసు యాభై ఏళ్ళ పైమాటే ఉంటుంది. అతడికి రామ లింగడంటే మహాభిమానం. సభ అయి పోయాక బయట రామలింగడి చేత కవిత్వం చెప్పించు కుంటాడు.

రామలింగడికి చందురుడు గుర్తుకొచ్చాడు. తిన్నగా అతడింటికి పోయి భువన విజయంలో మిగతా కవులంతా తన మీద ఫిర్యాదు చేసిన వైనాన్ని తెలుసుకున్నాడు.

రామలింగడికి కోపం వచ్చేసింది.

ఒక్కరోజు భువన విజయానికి వెళ్ళకపోతేనే కవులందరూ కలసి రాయలు వారికి తన మీద చాడీలు చెప్పి ఆస్థానంలో సభికుల మధ్యన ఆసనం వేయించారు....

పక్షం రోజుల పాటు భువన విజయంలో తన గొంతు వినిపించకుండా చేసారు. ఇలాగే వదిలేస్తే తనని కొంత కాలానికి భువన విజయం నుంచే కాదు విజయనగర సామ్రాజ్యానికి కూడా దూరంగా తరిమి వేయగల సమర్థులు..

దెబ్బకు దెబ్బ తియ్యాలి...

ఒక్కరోజన్నా కవులందరిని సభికుల మధ్యన కూర్చోబెట్టాలి.... అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

రామలింగడు తలుచుకోవాలే గానీ అతడికి సాధ్యం కానిదంటూ ఉందా?

పక్షం రోజుల పాటు రామలింగడు రాయలు వారి ఆజ్ఞ మేరకు భువన విజయానికి వెళ్ళి సభికుల మధ్యన కూర్చుని ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

పక్షం గడిచిపోయింది.

రామలింగడి శిక్ష పూర్తయ్యింది.

తిరిగి రామలింగడు సభలోకి వచ్చాడు.

మిగతా కవులందరికి మనసులో బెదురు గానే ఉంది. పక్షం రోజుల పాటు రామలింగడిని కేవలం శ్రోతగానే సభికుల మధ్యన కూర్చోపెట్టి నందుకు ఏదో ఒక రకంగా తమని పరాభవానికి గురి చెయ్యకుండా వదులుతాడా?

ఎవరి ఆలోచనలో వారున్నారు.

రామలింగడు మాత్రం వారిని ఏమాత్రం పట్టించుకోకుండా తన కావ్యాన్ని చదువుతూ ఉండి పోయాడు.

రాయలు సభకు వస్తూనే రామలింగడిని చూసి....

"ఏం రామలింగా...! పక్షం రోజుల పాటు సభికుల మధ్య నోరు మెదపకుండా కూర్చు న్నావుగా... ఎలా వుంది ఆ అనుభవం? అంటూ అడిగారు రాయలవారు.

రామలింగడు ఎంతో వినయంగా....

"ప్రభూ! నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?" అంటూ అడిగాడు.

వెంటనే అప్పాజీ కల్పించుకుంటూ...

"అదేమిటి రామలింగా... ప్రభువులు అడిగితే నిజం చెప్పాలి కానీ అబద్ధం చెబుతావా?" అంటూ ప్రశ్నించాడు.

"ఏం లేదు అప్పాజీ... నిజం చెబితే రాయల వారితో పాటు మన కవులు కూడా నొచ్చుకుంటారు అందుకని..."

"అందుకని అబద్ధం చెబుతావా? నిజమే చెప్పు..." అంటూ గద్దించాడు తిమ్మరుసు.

"ఈ పక్షం రోజుల పాటు సభికుల మధ్యన కూర్చుని మన కవులసాహితీప్రసంగాలు వింటుంటే వీరు ఎంత ఉద్ధండ పండితులో తెలిసి వచ్చింది..." అంటూ పక్షం రోజులు కవులు వాదసంవాదాలు, సాహితీ ప్రసంగాలలో దొర్లిన తప్పొప్పులను క్షుణ్ణంగా ఏకరువు పెట్టాడు.

రామలింగడి వాక్ప్రవాహానికి, అతడి బుద్ధి కుశలతకి మిగతా కవుల తల తిరిగిపోయింది.

అంతా చెప్పాక... రామలింగడు మిగతా కవుల వంక చూస్తూ....

"క్షమించండి... సభలో ఉన్నప్పుడయితే మీ తప్పులను వెతకటం కంటే నా కావ్యాలలో తప్పులు దిద్దుకోవటానికి నేను ప్రసంగించాల్సిన అంశాలను శోధించటానికి సమయాన్ని కేటాయించే వాడిని. కానీ ఈ పక్షం రోజులు నాకు ఆ పని లేకుండా పోయింది. అందుకే మీ ప్రసంగాలను బాగా బుర్రకెక్కించుకుని శోధించాను" అంటూ వినయంగా నమస్కరించాడు.

రామలింగడుసభలోనే కాదుసభికుల మధ్యన ఉన్నా కవులను తూర్పార బట్టడం మానడని అర్థమయిన రాయలువారు ముసి ముసిగా నవ్వుకున్నారు.

రామలింగడి దెబ్బకి కవులంతా బిక్క చచ్చిపోయి తోక తొక్కితే కాటు వెయ్యక మానుతుందా... ఇదీ అంతే అనుకుని సరిపెట్టు కున్నారు.

# 41. వ్యర్థ ప్రేలాపన

చీకటిపడే సమయానికి రామలింగడు ఒకరోజు అలా షికారుకి పోయివద్దామని బయలు దేరాడు.

అప్పుడప్పుడు రామలింగడికి అలా ఒంటరిగా బయలుదేరి కాసేపు అటూ ఇటూ తిరిగి రావటం విశేషాలను తెలుసుకోవటం అలవాటే...

ఆ గుడిలో ఎక్కడన్నా ఏకాంత ప్రదేశం కనిపిస్తే తనలో తానే చర్చించుకుని ఎప్పటికో ఇంటికి చేరుకోవటం కూడా పరిపాటి.

దారిలో ఒక శివాలయం ఉంది.

అది చాలా పురాతనమైనది.

ఆ గుడిలో పలు మహావృక్షాలు, దిగుడు బావి, ఒక సత్రం కూడా ఉన్నాయి.

రామలింగడి కాళ్ళు అటు సాగాయి.

ఆలయం లోపలకు పోయి దైవ దర్శనం చేసుకుని సత్రం అరుగు మీద కూర్చున్నాడు.

ఆ సత్రంలోకి ఓ సాధువుల గుంపు చేరింది.

ఆ సాధువులు దేశదిమ్మరులు.

ఈనాడు ఈ ఊరిలో ఉంటే మరొకరోజు మరొక ఊరిలో ఉంటారు.

భిక్షాటన వారి వృత్తి...

సాయంత్రం దాకా వీధులలో భిక్షాటన చేసి చీకటిపడే వేళకు ఏ గుడి సత్రంలోనో... మఠం లోనో అందరూ కలుసుకుని గంజాయి సేవిస్తూ కాలక్షేపం చేస్తారు.

ఆ సత్రంలో చేరిన సాధువులు... గంజాయి సేవిస్తూ కబుర్లు మొదలు పెట్టారు.

"విజయనగర ప్రభువు రాయలు వారు ఉత్త అమాయకుడు" అన్నాడొక సాధువు.

ఆ మాటలు విని రామలింగడు ఉలిక్కి పడ్డాడు...

ఆ కాలంలో రాయలు వారికి బలమైన శత్రువులు గజపతులు.

వారింటి పిల్లను రాయలు వారు పెండ్లి చేసుకుని బంధుత్వం కూడా కుదుర్చుకున్నాడు.

గజపతులు మాత్రం ఆ బంధుత్వం మరిచి పోయి రాయలు వారిని ఏదో ఒక రకంగా సర్వనాశనం చేయాలనే ప్రయత్నించేవారు.



గజపతుల వేగులు చడీచప్పుడు చేయకుండా విజయనగరంలోకి ప్రవేశించి తమ పనులు చక్కపెట్టుకుపోవటానికి ప్రయత్నించి దొరికి హతమైపోయిన సంఘటనలు ఎన్నోఉన్నాయి.

రాయలు వారి ప్రస్థావన సాధువుల నోటి వెంట రాగానే ఏదన్నా రహస్యం తెలుస్తుందే మోనని రెండు చెవులు అటువైపు వేసి మౌనంగా కూర్చున్నాడు రామలింగడు.

ఆ సాధువుల సంభాషణ పూర్తిగా వింటే గానీ వారు గజపతుల మనుషులు అవునో... కాదో... అర్థం అవుతుంది.

ఏ విషయంలోనైనా పూర్తిగా అవగాహనకు రాకుండా తొందరపడటం రామలింగడికి అస్సలు ఇష్టం ఉండదు.

అందుకే.....

సాధువుల సంభాషణ మౌనంగా వింటుండి పోయాడు.

"ఎందుకని?" అన్నాడింకో సాధువు.

"ఎందుకంటే రాజుల సొమ్ము రాళ్ళ పాలంటారు పెద్దలు. కానీ ఆ మాట అందరి రాజులకు వర్తిస్తుందేమో కానీ ఈ రాయలువారికి మాత్రం వర్తించదు..."

"ఎందువల్ల....?"

"ఈ రాయలు సొమ్ము కవుల పాలు.. అందుకని" అన్నాడు మొదటి సాధువు.

అప్పటి దాకా వాడి నోటి వెంట ఏదో గొప్ప రహస్యం బయటపడుతుందని ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్న రామలింగడు అటువంటిదేమీ లేదని తెలియటంతో కొంత ఊపిరి తీసుకుని వాళ్ళ సంభాషణ కవుల మీదకు తిరగటంతో ఆ విషయం ఏమిటో తెలుసుకోవాలని మౌనంగా వింటూ కూర్చుండిపోయాడు.

"రాయలు సొమ్ము కవుల పాలా.. అదెలా!?"

"అవును.."

"అవును అని సరిపెడితే ఎలా.. సరిగ్గా చెప్పు"

"చెప్తాను... వినండి. రాయలవారి కొలువులో ఎంతోమంది కవులున్నారు. వాళ్ళకి తిండికి లోటా..? బట్టకి లోటా.?ఆడంబరాలకి లోటా...? ఒక కావ్యం రాయటం పట్టుకుపోయి రాయలుకి అంకిత మివ్వటం.. మూటల కొద్దీ బంగారు నాణేలు పుచ్చుకోవటం..

అక్కడితో సరిపెడతారా.. వీలు దొరికితే రాయలు వారిని పొగుడుతూ పద్యం చెప్పటం.

అందుకు బహుమతిగా రత్నాల హారాల్ని.. వజ్రాల ఉంగరాల్ని సంపాదించటం...

ధన,కనక,వస్తు వాహనాలలో ఏది కావాలన్నా సరే కావ్యమే వారికి కల్పవృక్షం...." అంటూ చెప్పాడతడు.

అవును నిజమే కదా అనుకున్నారు మిగతా సాధువులు.

ఈ సంభాషణ వింటున్న రామలింగడికి వాళ్ళ మీద ఎక్కడ లేని కోపం ముంచుకొచ్చింది. అప్పటికప్పుడు వాళ్ళతో వాదించి కవులందరి తరుఫునా క్షమాపణలు చెప్పించుకుందామనుకుని కూడా ఇంకా వాళ్ళు ఏం మాట్లాడుకుంటారో విందామని ఆగిపోయాడు.

"అయితే రాయలవారికి కావ్యాల మీదున్న పిచ్చి కవులకు సకల భోగాలను అందిస్తోం దంటావ్..." అన్నాడొక సన్యాసి.

"అంతేగా మరి"

"అయితే నేనూ ఒక కావ్యం రాస్తాను అది రాయలవారికి అంకిత మిచ్చి అంతులేని ధనాన్ని సంపాదిస్తాను" అన్నాడొక సాధువు.

"రాయి... నువ్వు కవివి అయ్యి రాయలు వారి కొలువులో చేరితే మాకందరికీ భిక్షాటన చేసే ఖర్మ తప్పుతుంది"

"అలాగే... ఎప్పుడో ఎందుకు ఇప్పుడే కావ్యం రాయటానికి పూనుకుంటాను"

సాధువుల సంభాషణ వింటున్న రామలింగడి బుర్ర గిర్రున తిరిగి పోయింది.

"ఓరి వీళ్ళ అసాధ్యం కూలా.. కావ్య రచన అంటే ఎంతో సులువను కుంటున్నారు కాబోలు.." అనుకుని అయినా ఏం కావ్యం రాస్తారో చూద్దామని కూర్చున్నాడు.

కావ్యం రాస్తానన్న సాధువు సత్రం గచ్చును చేత్తో శుభ్రం చేసాడు.

ఆ తరువాత...

ఓ సారి గంజాయి దమ్మును గట్టిగా పీల్చి చిలుమును ముంచే నీళ్ళలో చెయ్యి పెట్టి ఆ గచ్చు మీద రాయసాగాడు.

రామలింగడు ఆ సాధువు చేస్తున్న పనిని చూసి ముందు విస్తుపోయాడు... ఆ తరువాత తెలియకుండానే అతడికి నవ్వు తన్నుకొచ్చేసింది.

రామలింగడి నవ్వుకు కావ్య రచనకు పూనుకున్న సాధువు దృష్టి అతడి వైపు తిరిగింది.

"ఏయ్.. ఎవరువ్వు?... ఎందుకు నవ్వు తున్నావు..? అంటూ రామలింగడిని గద్దించాడు.

రామలింగడు నవ్వుతూనే....

"నా పేరు తెనాలి రామలింగడు... తమరి కావ్యరచనను చూసి నవ్వు వచ్చింది" అంటూ సమాధానమిచ్చాడు.

"ఎందుకు....?" మరోసారి గద్దిస్తూ అడిగాడు ఆ సాధువు.

"అయ్యా... తమరు నేలమీద నీటితో రాస్తున్న కావ్యాన్ని మీ కళ్ళ ముందే గాలి ఎత్తుకుపోతున్నదే.. అయినా మీరు దానిని పట్టించుకోవట్లేదు కదా.. అది చూసే నాకు నవ్వు వచ్చింది" అంటూ మరోసారి నవ్వాడు రామలింగడు.

ఆ మాటలకు ఆ సాధువు గచ్చు వైపు చూసాడు.

అక్కడ ఏముంటుంది...?

నేలమీద నీటితో రాసిన రాతలు గాలికి ఆరిపోకుండా ఉంటాయా?

నేలంతా బోసిగా కన్పించింది.

"అయ్యో..నా కావ్యాన్ని గాలి ఎత్తుకు పోయింది"అంటూ ఆ సాధువు లబోదిబోమన్నాడు.

రామలింగడు నవ్వుతూ...

"కంగారు పడకు మహానుభావా.. ఈ కావ్యాన్ని గాలి ఎత్తుకు పోతేనేం మరొక కావ్యం రాసి రాయలవారికి అంకితమివ్వవచ్చునులే... రాయలువారి కొలువులో కవులు కావ్యాలు రాసేటప్పుడు కూడా గాలి ఇలా ఎన్నోసార్లు ఎత్తుకు పోయింది. అయినా వారు పట్టు వదలక పూర్తి చేసారు" అంటూ ఎగతాళి చేసాడు.

రామలింగడి మాటలు అర్ధమయిన ఆ సాధువుకి తను చేసిన తప్పేమిటో అర్థమయ్యింది.

రామలింగడి గురించి వివరాలు అడిగి తెలుసుకుని అతడే వికటకవి తెనాలి రామలింగడు అని తెలుసుకుని గంజాయి మత్తులో తమ నోటి వెంట వచ్చిన వ్యర్థ ప్రేలాపనలకు క్షమార్పణలు కోరుకున్నారు.

# 42. అసలు నిజం

ఒకరోజు రామలింగడు, రాయలు వారు ఏకాంతంలో ఉండగా ఒక రహస్య గూఢచారి వచ్చి ఏదో చెప్పబోయి రామలింగడిని చూసి సంశయిస్తూ ఉండిపోయాడు.

రాయలు ఆ గూఢచారితో "ఫర్వాలేదు... చెప్పు.. రామలింగడు మనవాడే" అని భరోసా ఇవ్వటంతో...

"ప్రభూ... రాచనగరు శివారులలో ఉన్న సత్రంలోకి కొంత మంది వర్తకులు వచ్చి బస చేసారు.

వారంతా శత్రు గూఢాచారులని సందేహంగా ఉంది.

వారం నుండి వారిని రహస్యంగా గమనిస్తూనే ఉన్నాం. వారు వర్తకుల వలే ప్రవర్తిస్తూనే ఉన్నారు కానీ అనుమానించ తగ్గ పనులు ఏవీ చెయ్యట్లేదు.

మా రహస్య దళంలో ప్రతి ఒక్కరికీ వారు శత్రు గూఢాచారులనే అనుమానం. తొందరపడి సందేహంతో వారిని బంధిస్తే ఆ తరువాత అవమానాలను ఎదుర్కొనవలసి వస్తుందేమోనని భయంగా ఉంది" అంటూ విన్నవించాడు.


రాయలు వారు అది విని అతడికి ఏం సమాధానం చెప్పి పంపాలో అర్థంకాక ఆలోచిస్తుంటే రామలింగడు కల్పించుకుని...

"ప్రభువులు నన్ను క్షమిస్తే ఇందుకు చక్కని పరిష్కార మార్గం నేను సూచించగలను" అన్నాడు.

"రామలింగా చెప్పు...! కర్ర విరగకుండా పాము చావకుండా అసలు నిజం బయటపడే మార్గం ఏదయినా ఉంటే వెంటనే చెప్పు...!" అంటూ అడిగారు రాయలు.

"చెప్పటం కాదు ప్రభూ చేసి చూపిస్తాను.. ఒక్కరోజు గూఢచారులందరూ నా ఆజ్ఞలను పాటించాలని ఆజ్ఞాపించండి... అది చాలు నాకు"

రాయలవారు సంశయించారు.



అదే సమయానికి అప్పాజీ అక్కడకు వచ్చాడు.

అంతకుముందు గూఢచారి తెచ్చిన సమాచారము ఆ సమస్యను పరిష్కరించటానికి రామలింగడు కోరిన అధికారము రాయలు అప్పాజీకి చెప్పి "ఇప్పుడు ఏం చేద్దాం?" అంటూ అడిగాడు.

అప్పాజీ కొద్ది క్షణాలు ఆలోచించి రామలింగడు కోరిన అధికారాన్ని అతడికి కట్టబెట్ట మన్నాడు.

రాయలవారు అప్పటికప్పుడు ఆ అధికారాన్ని రామలింగడికి కట్టబెడుతున్నట్లు గూఢచారుల ద్వారా ఆ దళనాయకుడికి సమాచారం పంపాడు.

ఆ తరువాత....

రాయలు రామలింగడితో...

"రామలింగా...! ఇప్పుడు చెప్పు నీ ఎత్తు ఏమిటో?" అంటూ అడిగాడు.

'ప్రభూ... చెప్పను.. నా మీద నమ్మకం ఉంచండి.. రేపు ఈ సమయానికి ఆ వర్తకుల గురించి నిజానిజాలతో మీ ముందు ఉంటాను" అని ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్పి గూఢచారులదళ నాయకుడిని కలుసుకుంటానికి వెళ్ళిపోయాడు.

రాయలువారు ఆజ్ఞ అందుకున్న గూఢచారుల దళ నాయకుడు రామలింగడి రాక కోసం ఎదురు చూస్తున్నాడు.

రామలింగడిని చూస్తూనే.

"అయ్యా... రామలింగ కవి.. అనవసరమైన కార్యాన్ని తమరు నెత్తిన ఎందుకు వేసుకున్నారు. ఇందులో ఏమాత్రం తేడా వచ్చినా విజయనగర పరువు మొత్తం గంగపాలు అవుతుంది.

అప్పుడు దేవరవారు మిమ్మల్ని చచ్చినా క్షమించరు. నా మాట వినండి... తమరి మంచి కోరి చెబుతున్నాను" అంటూ రామలింగడికి నచ్చ చెప్పి అతడి ప్రయత్నాన్ని విరమించుకునేలా చేయాలని ప్రయత్నించాడు.

వింటేకదా? రామలింగడు....

అనుకున్నది సాధించే వరకు అతడి పట్టు భల్లూక పట్టే కదా...

"అయ్యా...! నాపై తమరి అభిమానానికి ధన్యుడిని... కానీ నేను ఏ పనినయినా చెయ్య గలను అనుకున్నాకే నెత్తికి ఎత్తుకుంటాను. కనుక నా గురించి ఏమీ ఆలోచించకండి ముందు నేను చెప్పినట్లు చెయ్యండి" అంటూ గూఢచారులకు ఈ విధంగా చెప్పాడు...

"మీలో కొందరు ఈ రాత్రంతా సత్రంకి నాలుగు ప్రక్కల కావలి కాయండి. ఒకరు నాకు సహాయకుడిగా రండి. తెల్లవారే లోపు సత్రంలో నుండి ఎవ్వరు బయటకు వచ్చినా వారిని బంధిం చండి" అంటూ ఆ వేగులలో ఒక గూఢచారిని సహాయకుడిగా తీసుకుని మారువేషం ధరించి వర్తకుడిలా సత్రంలోకి ప్రవేశించాడు.

వర్తకులు ఆ సమయానికి అందరూ ఒక చోట చేరి గుసగుసలాడు కుంటున్నారు. మారు వేషంలో రామలింగడు ప్రవేశించేసరికి అందరూ నిశ్శబ్దమై పోయారు.

రామలింగడు అది గమనించాడు.

తిన్నగా వారి ప్రక్కకు పోయి ప్రక్క పరచి పడుకున్నాడు. ఆ ప్రక్కనే రామలింగడు సేవకుడిగా తెచ్చుకున్న గూఢచారి కూడా ప్రక్క పరుచుకు పడు కున్నాడు.

ప్రక్కనున్న వర్తకులలో ఒకడు...

"ఏమండీ.. ఎక్కడ నుంచి వచ్చారు...?" అంటూ రామలింగడిని పలకరించాడు.

ఆ మాట కోసమే ఎదురు చూస్తున్నాడు రామలింగడు.

"ప్రక్క రాజ్యమే... తమరు ఎక్కడివారు" అంటూ అడిగాడు.

"మాదీ ప్రక్క రాజ్యమే... తమరిది ఏం వ్యాపారం?" అంటూ మాటలను ఆ వ్యాపారే పెంచాడు.

"ఆయుధాలను తయారు చేయించి అమ్ముతూ ఉంటాను. తమరిది ఏం వ్యాపారం....?" అంటూ అడిగాడు రామలింగడు. "సుగంధ ద్రవ్యాలు..." చెప్పాడు పలకరించినవాడు.

"మంచి వ్యాపారమే... లాభసాటిగా ఉంటుం దనుకుంటా" అని అడిగాడు రామలింగడు.

"అవునవును..." అన్నాడతను.

"అయ్యా.. నాదొక సందేహము" అన్నాడు రామలింగడు.

"ఏమిటి...?"

"ఇంతకు ముందు సత్రంలోకి నేను వచ్చే టప్పుడు సత్రం చుట్టు ప్రక్కల సైనికులు చుట్టు ముట్టి ఉన్నారు. ఈ సత్రంలో ఎవరన్నా శత్రువు లున్నారా....?" అంటూ గొంతును తగ్గించి వాళ్ళతో అన్నాడు రామలింగడు.

ఆ మాటలకి ఆ వర్తకులందరూ మౌనం వహించారు.

దీపం వెలుగులో వారి మొహాలలో భయం కదలాడటం గమనించాడు రామలింగడు.

వాళ్ళ భయం చూసి వర్తకుల వేషాలలోఉన్న వాళ్ళు ఖచ్చితంగా శత్రువుల మనుషులు అయి ఉంటారని గ్రహించి వెంటనే ప్రక్కన సేవకుడిగా ఉన్న గూఢచారితో...

"నీవుపోయి ఆయుధాల మూటలు సరిగా ఉన్నాయో లేదో చూసి రా.." అంటూ పంపేసాడు.

రామలింగడు ఆ సేవకుడికి ముందు గానే చెప్పి ఉంచటం వల్ల అతడు పోయి "వారు శత్రువుల మనుషులేనని రామలింగకవి నిర్ధారించుకున్నాడు. కనుక వారు తప్పించుకోకుండా సత్రం చుట్టూ గట్టి బందోబస్తు చేయమని సంకేతం చెప్పి నన్ను పంపాడు" అంటూ గూఢచారి దళ నాయకుడికి చెప్పాడు.

గూఢచారులంతా సత్రం చుట్టూ కావలి కట్టు దిట్టం చేసారు.

సత్రం లోపల రామలింగడు వర్తకులతో సంభాషణ కొనసాగిస్తూనే ఉన్నాడు.

"అయ్యా తమరిని చూస్తే వర్తకులవలే లేరు.. బహుశా ఏ రాజ్యానికో చెందిన గూఢచారుల్లా ఉన్నారు. బయట ఉన్నవారు కూడా మీ వారేనా...?" అనడిగాడు రామలింగడు.

వర్తకులు కంగారుపడిపోయి...

"అయ్యో... అలాంటిదేం లేదు..." అన్నారు.

"అలా అయితే మంచిది. మీకు తెలుసో లేదో రాయలు వారు ప్రజలకి ఎంత మంచివాడిగా కన్పిస్తాడో శత్రువులకి అంతకు రెట్టింపు చెడ్డవాడు.

ఎవడన్నా శత్రువు పట్టుబడితే ముందురోజు పారిపోకుండా కాళ్ళు నరికించి మూలపడేస్తాడు.. రెండవ రోజు చేతులు, మూడవ రోజు తలను నరికించి చంపుతాడు. ఈ సంగతి చాలా మందికి తెలియదు" అంటూ వారిని మరింత బెదరగొట్టే సాడు.

వర్తకుల వేషంలో వచ్చిన వాళ్ళు నిజంగానే శత్రురాజుల గూఢచారులు. వర్తకం చేస్తూ నగర ఆనవాలు తెలుసుకుపోవటానికి వచ్చారు.

వారు నగర వీధులన్నీ తిరుగుతూ నగర దారులను ఇళ్ళను ఎటునుంచి ఎలా కోటలోకి ప్రవేశించవచ్చు అన్న విషయాలను బుర్రలోనే గుర్తుంచుకోసాగారు.

రామలింగడి మాటలతో వాళ్ళలో ఉన్న ధైర్యం కాస్తా జారిపోయింది.

ఒక్కొక్కరికి కాళ్ళు, చేతులు వణకసాగాయి.

బయటకు పారిపోదామంటే సత్రం చుట్టూ రాజభటులున్నారని అంతకు ముందే వర్తకుడి వేషం వేసిన రామలింగడు చెప్పాడు.

పట్టుబడితే రాయలు ముందు కాళ్ళు, చేతులు నరికించి ఆ తరువాత తీరిగ్గా తల నరికించి చంపు తాడని చెప్తున్నాడు. ముందు చూస్తే నుయ్యి... వెనక చూస్తే గొయ్యి అన్నట్లుగాఉంది వారి పరిస్థితి.

రామలింగడు వారి సంకటస్థితి అర్థం చేసు కున్నాడు.

"అయ్యా.. తమరెందుకో కంగారు పడుతు న్నట్లున్నారు. బయట రాజభటులు వచ్చింది తమ కోసమే అయినా కంగారు పడవలసిన పనిలేదు...

మీరందరూ కలసి నాకు కొన్ని బంగారు నాణేలను ఇస్తే ఇక్కడ నుంచి క్షేమంగా తప్పించుకు పోయే మార్గం చెబుతాను" అంటూ వారికి ఎంతో నమ్మకంగా చెప్పాడు రామలింగడు.

ఏటినీళ్ళలో కొట్టుకుపోయేవాడు గడ్డిపోచ కనిపించినా దాన్ని పట్టుకుని ప్రాణాలు రక్షించు కుందామని ప్రయత్నిస్తాడు.

ఇప్పుడు వారి పరిస్థితి అలాగే ఉంది. అందుకనే వెంటనే రామలింగడికి కొన్ని నాణేలను ఇచ్చారు.

ఆ తరువాత రామలింగడు వారిని అక్కడే ఉండమని చెప్పి బయటకు వచ్చి రహస్యగూఢచారి దళ నాయకుడితో వారు శత్రుగూఢచారులే బంధించమని చెప్పాడు. వెంటనే దళనాయకుడు మిగిలిన అనుచరులతో పోయి వారిని బంధించాడు.

విచారణలో వారు శత్రువర్గం వారని తేలటంతో రాయలు వారు మరణశిక్ష విధించి రామలింగడిని అభినందిస్తూ..

"రామలింగా...ఈ కార్యాన్ని ఎలా సాధిం చావ్?" అనడిగారు.

"ఇందులో గొప్ప ఏం లేదు ప్రభూ.... మాటలు కలిపాను. వారిని నమ్మించాను. అసలు నిజం తెలుసుకున్నాను. అంతే..." అంటూ తేలిగ్గా నవ్వేసాడు.

*